ఆగస్టు – అక్టోబర్ 1969 12 త్రైమాసిక

మొట్టమొదటి కన్యాశుల్కము

సమీక్ష

కొడవటిగంటి కుటుంబరావు

అం ప శ య్య

ప్రయోగాత్మక నవల

న వీ న్

సృజన

అభ్యుదయ సాహిత్య వేదిక

నిర్వహణ: 'సాహితీ మిత్రులు' ఒక రూపాయి.

సృజన

ఆధునిక సాహిత్య వేదిక

[త్రైమాసిక]

12

ఆగస్ట్ 1969

నిర్వహణ
'సాహితీ మిత్రులు'

సంవత్సర చందా 4 రు.

ఈ సంచిక 1 రు.

ప్రతులకు, వివరాలకు:
వరవరరావు
సృజన
C/o చందా కాంతయ్య మెమోరియల్ కాలేజి
వరంగల్-2.

యీ సంచిక ఒక రూపాయి
సంవత్సర చందా నాలుగు రూపాయలు

ముద్రణ:
వేంకటరమణ ముద్రణాలయము, వరంగల్-2.

సృజన

ఆధునిక సాహిత్య వేదిక

త్రైమాసిక ఆగస్టు—అక్టోబర్ '69 12

సృజన నిర్ణయాలు

చాలామంది అభిమానులు సృజనను ద్వైమాసికగా మార్చడంకన్నా ప్రచురణలు చేపట్టటం మంచిదని సూచించారు. ఆ సూచనమేరకు సృజన ప్రచురణలు ప్రారంభించి ద్వైమాసిక ఆలోచనను కొంతకాలంపాటు వాయిదా వేస్తున్నాం.

సృజన ప్రచురణలు కింద ఏడాదికి కనీసం రెండు పుస్తకాలయినా వెలువరించాలన్నది మా ఆశయం. మొదటి ప్రచురణ, వినడానికోకథ- పింగళి రంగారావు కథలసంపుటి జూన్‌లోనే వెలువడింది. రెండవ ప్రచురణ నవీన్ ప్రయోగాత్మకనవల 'అంపశయ్య' అక్టోబర్‌లో వెలువడుతుంది. మూడవ ప్రచురణగా సి వి. కృష్ణారావు కవితాసంకలనం 'మాదీమీవూరే' త్వరలో వెలువడుతుంది. ఇట్లా మొదటిసంవత్సరం మా ఆశయాన్నిమించి పుస్తకాలు అందించగలిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీనికంతకూ సృజన పాఠకుల, పోషకుల, రచయితల సహకారమే కారణం. సృజన ఈ అభిమానుల సహకార ప్రోత్సాహాలను ఎన్నడూ మరచిపోజాలదు.

ద్వైమాసికగా మార్చమని సూచనలుచేసిన అభిమానులుకూడ సృజన ప్రచురణల కారణంగా ఆ ఆలోచనను వాయిదావేస్తున్న నిర్ణయాన్ని హర్షించి సృజన ప్రచురణలను, సృజనను ఎప్పటివలెనే ప్రోత్సహిస్తారని ఆశిస్తున్నాం.

—సాహితీ మిత్రులు

ప్రయోగాత్మక నవల | అంపశయ్య

—నవీన్

(గతసంచిక తరువాయి)

"హాస్టల్లో ఈ లైట్స్ లేకుండా వుంటే బావుండును"—నిధి

"అంటే అసలు లైట్లే లేకుండా.... చీకట్లోపడి కొట్టుకోమంటావా జనాన్ని?—సాగర్

"చీకటి అంటే నాకిష్టం"—నిధి

"చీకట్లో చూడాలి నీకళ్ల తళ తళలనా? మరి నీ యెంకిని కూడా హాస్టల్ కి తీసుకరా"—వేణు

"చీకటి యిష్టమేమిటి నీకు? ప్రతి వాడూ చీకట్లోనుండి బయట పడాలని ప్రయత్నిస్తాడు నువ్వు చీకట్లోకి పోవాలని ప్రయత్నిస్తున్నావు"—సాగర్.

"అదేమరి.... ప్రతివాడు చేసే పనిని నిధి కూడా చేస్తే నిధి ప్రత్యేకత ఏముంది చెప్పు. కొంచెం ప్రత్యేకంగా ఉండాలికదా! అందుకే ఆయనకు చీకటి యిష్టం"—రవి.

"అదేమీకాదు.... ఎలక్ట్రిక్ లైట్లు ధనిక వర్గానికి చిహ్నాలు. చీకటి కార్మిక వర్గానికి—పేదరైతాంగానికి చిహ్నం. వాళ్ల జీవితాలు వెలిగిన ఈ ఎలక్ట్రిక్ ట్యూబ్ లైట్లు కావుగా.... కిరోసిన్ లేని కుక్కి-దీపాలు వాళ్ల జీవితాలు. అందువల్ల చీకటి వాళ్లనేస్తం. అందుకే నిధికి చీకటంటే యిష్టం"—వేణు.

"బావుంది! బావుంది! నీలాంటివాడు వివరించకపోతే నిధిని అర్థం చేసుకోవటం చాలా కష్టమే"—సాగర్.

"ఇంతకీ వేణు ఇంటర్ ప్రిటేషన్ తో నిధి అంగీకరిస్తాడా?"—రవి.

"నాకా ఇంటర్ ప్రిటేషన్ గూర్చి తెలియదు. చిక్కటి చీకటిని చూస్తే నాకిష్టం. దట్సాల్. ఎందుకు అని అడిగితే ఏమీ చెప్పలేను"—నిధి.

కాస్సేపు నిశ్శబ్దం.

"ఇంతకీ రమేశ్ ఏమీ మాట్లాడటం లేదు"-రవి.

"మీరంతా మాట్లాతున్నారుకదా- యింకొ నేనెందుకు"-రమేశ్.

"నువ్వూ ఏదో మాట్లాడు"-వేణు.

"ఏదో మాట్లాడటం నాకు చేతకాదు"-రమేశ్.

అంతా నిశ్శబ్దంగా నడుస్తున్నారు. చాలామంది స్టూడెంట్స్ డైనింగ్‌హాలు నుండి గుంపులు గుంపులుగా తిరిగి వస్తున్నారు.

"జయసింహగాడికి పోజెక్కువలేవోయ్.... నన్నడిగితే వాడిని మన టీమ్ నుంచి తీసెయ్యటమే మంచిదైంది"- ఒక గుంపును లీడ్ చేస్తున్న స్టూడెంట్ గట్టిగా అంటున్నాడు.

"అసలు నన్నడిగితే మన టీమ్స్‌ను బయటకు పంపించనేవద్దు. తుక్కు-తుక్కుగా ఓడిపోయి వస్తున్నారు"- ఆ గుంపులో మరొకతను.

"క్రికెట్ .... క్రికెట్ గురించి మాట్లాడటం ఈ క్యాంపస్‌లో భలే ఫ్యాషన్ అయిపోయింది. నాకైతే క్రికెట్ గూర్చి ఎబిసిడీలు కూడా తెలియవు"-విధి

"నీకేకాదు. క్రికెట్ గూర్చి ఎంతో తెలిసినట్లు మాట్లాడే వాళ్లకి కూడా నిజంగా యేమీ తెలియదు ఒకడ్ని చూచి ఒకడు.... కొన్ని టరమ్స్ పట్టుకుంటారు. ఒక్కడికీ ఆ టరమ్స్ యొక్క మీనింగ్ ఏమిటో తెలియదు"-రవి.

"అదిగో నవాబ్ ఆఫ్ పటౌడీ వస్తున్నాడు. మాక్కాస్త క్రికెట్ గూర్చి చెప్పరాదూ!"-వేణు.

విశ్వం క్రికెట్ ప్లేయర్. అతనికి వేణు తగిలించిన నిక్‌నేమ్ నవాబ్ ఆఫ్ పటౌడీ.

"ఏమండీ నవాబ్‌గారు.... శర్మిలాటాగోర్ బావుందా? పూర్ క్రీచర్....

ఏక్ నజర్‌మే దిల్ బేచారా హోగయా.... ఎల్ బి డబ్ల్యూ'-రవి.

"దాని మొహం అదంటే నాకిష్టంలేదు. అది ఫిల్మ్‌స్టార్ ఎలా అయిందో నాకర్థం కాదు"- విశ్వం.

"శర్మిలాని నువ్వు చెత్త హిందీ సినిమాల్లో చూసి అలా అంటున్నావు. శర్మిలా బ్యూటీని సత్యజిత్‌రాయ్ సినిమాల్లో చూడాలి. 'అపూర్ సంసార్' చూశావా?" వేణు

"ఇక ఈ చెత్త మొహాన్ని చూడడానికి బెంగాలీ సినిమాలుచూసి తలనొప్పి తెచ్చుకోమంటావు"-విశ్వం.

"అవతల టైమై పోతోంది. కదలండి బాబు. తర్వాత మాట్లాడు కుందురుగాని"—సాగర్.

"మంచిది వస్తాం మరి. కడుపునిండిన వాడివి నువ్వు. నీతో ఎక్కడ కుదురుతుంది మాకు"—వేణు.

డైనింగ్ హాలు సమీపించారు.

"చదువుతుంటే ఒకటీ అర్థమై చావటంలేదు. అర్థమైనా జ్ఞాపకం వుండి చావటంలేదు. ఎలారా చావటం"— అంటున్నారు మరో గుంపులో ఎవరో-

"ఎలానా చావటం! నేను చెప్పనా! చక్కగా ఎండ్రినో, ఎలుకల మందో తాగేస్తేసరి. ఈ పరీక్షలతో చచ్చేకంటే అదేనయం." ఎవడో కసిగా అంటున్నాడు ఆదే గుంపులో.

డైనింగ్ హాల్ మెట్లెక్కు తున్నారు.

"రండిసార్ టైమై పోతోంది. మీరు ప్రతిరోజు లేట్‌గా వస్తారేం సార్ అన్నీ చప్పగా చల్లారి పోయాక!" అంటున్నాడు నరహరి. నరహరి డైనింగ్‌హాల్లో పనిచేసే కుర్రాడు. వాడికి తనన్నా, వేణు అన్నా ఏదో వెర్రి అభిమానం. వాడి అభిమానం తనలో ఎప్పుడూ యేదో ఆర్ద్రతను సృష్టిస్తుంది.

"డైనింగ్ హాల్లో మన మెప్పుడు వస్తామా అని ఎదురుచూసే జీవి వీడొక డున్నాడు. ఫరవాలేదు. 'నాకోసం చెమ్మగిల్లు నయనమ్ము లేదు' అని ఏడ్వాల్సిన పని లేదు"—వేణు.

రమేష్, సాగర్, నిధులు నవ్వారు. వాళ్లనవ్వడం తనకి ఘోరంగాతోచింది.

"అంత ట్రాజిక్ లైన్ మీకు నవ్వు తెప్పిస్తున్నదా? మీలో వినోదానికి, విషాదానికి డిఫరెన్స్ గుర్తించే ఓపిక బొత్తిగా పోతున్నది"—రవి.

"అంటే ఏమిటి? ఇప్పుడు మమ్మల్ని ఏడవ మంటావా? అంతేనా? అలా ఏడ్వకపోతే వినోదానికీ విషాదానికీ భేదాన్ని గుర్తించలేమంటావు" రమేష్ పోట్లాడ టానికి సిద్ధమౌతూ... కుర్చీలో కుర్చుంటున్నాడు.

"నవ్వులోనే యేడ్పు—యేడ్పులోనే నవ్వు కలసివున్నాయి. అసలు ఏడ్పిస్తూ నవ్వించటం— నవ్విస్తూ ఏడ్పించటం— అదీ గొప్ప ఆర్ట్ అంటాడు శ్రీశ్రీ... మీరెందుకు పోట్లాడు కుంటారు. ఇక ఈ 'వడల'తో పోట్లాడండి"—వేణు.

'తినండి సార్— యింకో రెండు వడలు ఎక్కువ తెమ్మంటారా సార్' నరహరి తన దగ్గరకొచ్చి గుసగుసగా.

'అక్కర్లేదులే. నాకు వడలంటే యిష్టంలేదులే. అక్కర్లేదు'— రవి.

'ఏమిటి సార్ మీరు మరీ యిది, ఏదీ ఇష్టం లేదంటారేంటి? ఇయ్యాళ వడలు బావున్నాయి'— నరహరి.

'వడలు ఎప్పుడు బావుండవులేరా. ఈ మెస్ సెక్రటరీగాడొకడు. వడలు వద్దురా బాబు అంటే అవే చేయిస్తాడు'— వేణు.

'వాడు ఆంధ్ర వెధవ. వాడికి వడలు ఇష్టం. సాంబార్ ఇష్టం. అదేరోజూ మన మీద రుద్దుతున్నాడు. అసలు ఈ ఆంధ్ర వెధవలంతా వచ్చి క్యాంపస్‌ను చెడగొడుతున్నారు. నన్నడిగితే బొంబేలో 'శివసేన' లాగ ఇక్కడొక 'తెలంగాణాసేన' తయారై ఈ ఆంధ్ర వెధవన్ని ఇక్కడినుండి తరిమేస్తేగాని మనం బాగుపడం''-సాగర్ ఆవేశంగా.

'దట్స్ టూ మచ్ సాగర్. మనం ఎడ్యుకేటెడ్. మనమే ఇంత యిరుగ్గా ఆలోచిస్తే దేశం ఏమై పోవాలి'— రవి.

'ఈ ఆదర్శాలకేమిలే! రేపు నువ్వు ఎం.ఏ. ప్యాసయాక ఉద్యోగం సంగతి ఆలోచించు. ప్రతిచోటా ఆంధ్రావాళ్లు నిండిపోతున్నారు. ప్రతిచోట వాళ్లదే డామినేషన్. హై ఆఫీసర్స్ అంతా వాళ్లే! పెద్ద పెద్ద రికమండేషన్స్ వాళ్లకే. మనగతి కుక్కలుకూడా కానవు. మనం ఈ ఆదర్శాలు వల్లించుకుంటూ బతకాల్సిందే'- సాగర్

'ఆంధ్రా వాళ్లల్లో మరోటి కన్పిస్తోంది. వెధవలకి చచ్చేగర్వం. తెలంగాణా వాళ్లంటే ఉత్త బ్యాక్‌వర్డ్ ఫెల్లోస్ అన్నచులకన వాళ్లకి. ఆంధ్రా యూనివర్సిటీ స్టాండర్డ్‌తో పోలిస్తే ఉస్మానియా దండగంటారు'—రమేశ్.

'అయితే ఇక్కడికెందు కొచ్చారు. ఆ ఆంధ్రా యూనివర్సిటిలోనే చావక పోయారా?"— సాగర్.

'ఆంధ్రా యూనివర్సిటీ స్టాండర్డ్ మనకి తెలియదు? ఎం.ఏ లో ఎం.యస్ సిలో ఏ సబ్జెక్ట్‌లో చూసినా పది ఫస్టు క్లాసులకి తక్కువ వుండవు. అదే ఉస్మానియాలో ఫస్ట్‌క్లాసు రావటమంటే దిల్లగికాదు'— నిధి

'ఏమైనా మీకు యింత తెలంగాణాఫీలింగు వుండటం నాకునచ్చలేదు. మనం ఇలాంటి న్యారో రీజినలిజమ్‌ను ఫైట్ చేయాల్సిందిపోయి మనమే ఈ ఫీలింగ్‌ను ప్రచారం చేయడమా?'— వేణు.

'ఆంధ్రా ఫీలింగ్ వాళ్లల్లో వుంటే తెలంగాణా ఫీలింగు మనలో ఎందుకుండ గూడదు అంటాను. మన యింట్లోకి వచ్చి మన నెత్తిమీద కూర్చొని— మన మీద పెత్తనం చలాయిస్తుంటే పడి ఉండమంటావు.'— సాగర్.

'ఎవరూ ఎవరి ఇంట్లోకి రాలేదు. ఈ ఫీలింగ్స్ ఎంత త్వరగా మన హృదయంలోంచి పోతే అంత మంచిది'— రవి.

'ఎలా పోతుంది. మనకి పోయినా వాళ్ళకి పోదుగా. ఈ ఫీలింగ్ పోవటమనేది వన్ వే ట్రాఫిక్ కాదు. మార్పు రెండు వైపులా రావాలి'— నిధి.

'తప్పకుండా వస్తుంది. ఎవరో ఒకరు విశాల భావాలకి, ఐక్యతకు నిల బడాలి. మనమే ఆ పని ఎందుకు చేయకూడదు'— వేణు.

'ఏమోలే—మీరిద్దరూ ఎప్పుడూ యేవో ఆదర్శాలు మాట్లాడుతారు. అసలు ప్రాక్టికల్ లైఫ్‌లోకి పోతే తెలుస్తుంది మీకు. మా బ్రదర్ ఒకడు 64లో ఎం. ఎ. ప్యాసయ్యాడు. ఇంతవరకు ఉద్యోగం లేక తిరుగుతున్నాడు. నిజానికి తెలంగాణాలో వేకెన్సీస్ లేవంటవా?'

'నరహరి.... కాఫీ తీసుకురా''—అరిచాడు వేణు.

'ఇవ్వాళ హెడ్ వెయిటర్‌గారు లేనట్లున్నారు'—నిధి.

'ఖాన్‌గాడా! ఔను వాడు లేడు. కాబట్టే మెస్సంత ప్రశాంతంగా వుంది. ఎందుకోగాని వాడుంటే ఈ మెస్సులో తినాలనే కోరిక చచ్చిపోతుంది. మనలందర్నీ శత్రువులన్నట్లు చూస్తాడు వాడు'—రవి.

'ఇదిగోండిసార్ కాఫీ. మీ కోసం స్పెషల్‌గా చేశాను. ఖాన్‌సాబ్ లేడు. అందుకని కొంచెం పాలు ఎక్కువ పోశాను'—నరహరి గుసగుసగా.

'ఎక్కడికెళ్ళాడు ఖాన్. వో పది రోజులదాకా రాకుంటే బావుండునే. మాకు ఎక్కువ పాలు దొరికేవి. కాస్త తిన్నదికూడా వంట బట్టేది'—రవి.

'ఎక్కడకూ పోలేదుసార్. లోపల ఏవో లెక్కలు చేస్తున్నడు. అదిగో వస్తున్నడు'—నరహరి.

ఖాన్ పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ వస్తున్నాడు— ఎందుకోగాని వాడిని చూసి నప్పుడల్లా ఏదోభయం తనలో కల్గుతుంది.

'సార్ .... మీకు మీల్స్ బంద్ కరోబోలె సాబ్'—ఖాన్ కటువుగా.

'ఎవరికి నీకా రవి?'—వేణు.

'హాఁసాబ్? రవిసాబ్ తీన్ మహీనేకా మెస్ బిల్ కట్టలేదు. ఇయ్యాళ్ల వార్డెన్ ఆఫీసు నుంచి స్ట్రిక్ట్ ఆర్డర్సు వచ్చాయి. మెస్‌లో మీల్స్ బంద్ చేయమని'-ఖాన్

'నువ్వు మూడు నెలల మెస్‌బిల్ కట్టలేదా? యేం? ఇంటి నుంచి డబ్బు రావడం లేదా?'—వేణు.

తనకి మట్లాడాలనిపించలేదు. ఈ క్షణం ఎప్పుడో అప్పుడు వస్తుందని తెలుసు. మరచి పోదామని ప్రియత్నించాడు. కానీ....

'కట్టలేదు'—రవి.

'యేం? యింటినుంచి డబ్బురావటంలేదా? మూడు నెలలంటే రెండు మూడు వందలై వుంటుంది. రేపు హాల్ టికెట్ ఎలా తీసికొంటావు? నోడ్యూస్ సర్టిఫికేట్ ప్రొడ్యూస్ చెయ్యకుండా పరీక్ష ఎలాయిస్తావు?'—వేణు.

'ఏమోలే ఏలాగో తీసికుంటాను. లేకపోతే పరీక్ష మానేస్తాను'—రవి.

'ఇపుడు 'నాస్తా' చేశారా సార్!'—ఖాన్.

'ఔను. యేం?'—రవి.

'ఈ 'నాస్తా'కి పైసలివ్వాలి సార్. ఈ రోజునుండి మీకు నాస్తా కూడా వుండదు'—ఖాన్.

'తినేసాడుగా — రేపటినుంచీ ఇస్తాడులే నీ పైసలు'—సాగర్.

'లేదు సార్. ఇప్పుడు తిన్నదానికి డబ్బు లివ్వాల్సిందే. మాకు స్ట్రిక్ట్ ఆర్డర్స్'—ఖాన్.

'ఏమిటోయ్ నీబోడి ఆర్డర్స్? అక్లేవాగకు. మెస్ సెక్రటరీకి చాటు మాటుగా పంపించ వచ్చేం? 'నాస్తాలు' 'ఎగ్స్' 'చికెన్' వాడు కట్టున్నాడా ప్రితి నెల మెస్ బిల్. మావిషయంలోనే స్ట్రిక్ట్ ఆర్డర్స్ అన్నీ'—సాగర్.

'మేరే ఊపర్ లేస్తరేం సార్. మేరా డ్యూటీ మై కర్ రహాహూం' ఖాన్ వెళ్లిపోయాడు.

'దొంగ రాస్కెల్. మెత్తనివాళ్లనిచూస్తే ఎవడికైనా మొత్తాలనిపిస్తుంది'-సాగర్

'ఏమిటివ్వాళ సాగర్ భలే ఎగ్రెసివ్ ఫార్మ్‌లో వున్నాడు'—నిధి.

'ఈ రోజుల్లో ఎగ్రెసివ్ కాందే లాభంలేదు భాయి. మెత్తగా మాట్లాడిన వాడు ప్రితివాడికీ లోకువే'—సాగర్.

కాఫీ తాగడం ముగించి లేచారు. నరహరి తనకేసి జాలిగా చూడటం గమనించాడు. ఖాన్‌గాడి మీద కోపంతో ఉద్రేకంతో రక్తం పొంగుతోంది. కసి ద్వేషం. అవమానం, ప్రతీకారం వాంఛ తనలో రగుల్కొంటున్నాయి. సాగర్ అన్నమాట కరెక్ట్. ఈ రోజుల్లో ఎగ్రెసివ్ కాందే లాభంలేదు. మెత్తగా మాట్లాడే వాడు ప్రితీవాడికి లోకువే. తురక వెధవ. బ్లడీఫూల్. ఈ తురకలందర్నీ కట్ట

గట్టి పాకిస్తాన్ పంపించాలి. వీళ్లు యీ దేశంలో వున్నంతకాలం దేశానికి ఏదో ముప్పు తప్పక వాటిల్లుతుంది.... ఇదేమిటి తనిలా ఆలోచిస్తున్నాడు? తనేనా? సెక్యులరిజంను గొప్పగా పొగిడే తను। కుల మత భేదాలను ఫైట్ చెయ్యాలనుకునే తను యిలా ఆలోచించటమా?

'తురక లంజాకొడుకు. వాడినెప్పుడో ఎముకలిరిగేటట్టు తంతేగాని బుద్ధి రాదు'— సాగర్ అంటున్నాడు.

'ఎందుకు సాగర్। ఇవ్వాళ ఇంత ఆవేశంగా వున్నావు. వాడిదేముంది? ఈయన మూడు నెలల నుండి మెస్ ఫీజు కట్టక పోవడం ఏమన్నా బావుందా?'—వేణు

'ఔను— ఎందుకు కట్టలేదు రవి? ఏమైంది. డబ్బు రావడంలేదా?'—సాగర్

'డబ్బెందుకు రావటంలేదు, రెండు రోజుల కొకసారి మార్నింగ్‌షోస్‌కి ఎలా వెడుతున్నాడు?'— రమేశ్.

'అన్నట్టు ఇవ్వాళ మార్నింగ్ షోస్ ఏమున్నాయో? క్యాంటీన్‌దాకా వెళ్లి క్రానికల్ చూద్దాం పదండి'—నిధి.

'ఇప్పుడింకా మార్నింగ్‌షో ఏమిటి? పరీక్షలుచాలా దగ్గరకొస్తున్నాయి'-సాగర్

'పరీక్షలు దగ్గరకొస్తూనే వుంటాయి. రైలు పట్టాల్లా పరీక్షలూ మనమూ ఎక్కడో ఇన్‌ఫినిటీలో కలుసుకుంటామేమోలే'— నిధి.

'ప్రతీదాన్ని ఫిలాసఫించడం నేర్చుకుంటున్నావు నిధీ— పర్వాలేదు. పైకి వస్తావు'— వేణు.

'ఇలా ఫిలాసఫించుకుంటూ గడిపేయండి. ఈలోగా పుణ్య కాలం కాస్త వెళ్లిపోతుంది. నేను వెళ్లిపోతున్నాను. క్యాంటీనులు మార్నింగ్‌షోలు తిరిగే ఓపిక నాకులేదు'— సాగర్ అంటూనే వెళ్లిపోయాడు.

తనకి ఎటు వెళ్లాలో తోచడంలేదు. మూడు నెలలు మెస్‌బిల్. ఔను దగ్గర దగ్గర మూడు వందల వరకుంటుంది బిల్. ఎలా కడతాడు? కట్టకుండా హాల్ టికెట్ ఎలా దొరుకుతుంది? హాల్ టికెట్ లేకుండా పరీక్షలు ఎలా యిస్తాడు? ఇదంతా చూస్తుంటే ఇందాక ఎవరో అన్నట్లు ఎండ్రిన్నో ఎలుకల మందో తాగి చావటం నయం అనిపిస్తుంది. ఎండ్రిన్నో ఎలకల మందో— ఎక్కడ దొరుకుతాయో? పరీక్ష యివ్వకుండా ఏ ముఖంతో వెళ్లి అమ్మను చూస్తాడు? తనకోసం— తన చదువు కోసం- తన సర్వస్వాన్ని ధారపోస్తున్న అమ్మకోసం— అమ్మకోసం. తమరక్తాన్ని చెమటని డబ్బుగా మార్చి పంపిస్తున్న అమ్మా, నాన్నా. ఎలా చూస్తాడు వాళ్ల మొహాలు. తను పరీక్ష యివ్వకుండా వచ్చానని తెలిస్తే వాళ్ల గుండెలు పగిలిపోవు?

తనకి తెలియకుండానే రవి వాళ్లతో క్యాంటీన్ వైపు నడుస్తున్నాడు.

'ఏం రవీ— ఆలోచిస్తున్నావు?'— వేణు

'ఎండ్రిన్? ఎలుకల మందా? అని'— రవి

'అదేమిటి? ఎండ్రినేమిటి? ఎలుకల మందేమిటి?'— వేణు

'ఇందాక ఎవడో అంటున్నాడులే.... ఈ పరీక్షలబారి నుండి తప్పించుకోవడానికి ఎండ్రినో, ఎలుకలమందో తాగిచావడం మేలని. అది జ్ఞాపకం వచ్చింది'-రవి

'వెధవ పరీక్షలకోసం ప్రాణాలు తీసికోవడమా? ఈ పరీక్షలంత నీచమైనవి ప్రపంచంలో మరొకటి లేవు. ఈ పరీక్షలు ఎంత మంది యువకులను నాశనం చేస్తున్నయో. అసలు ఈ యునివర్సిటీలను ఒక పదేళ్లు మూసెయ్యాలి. దేశం చాలా బాగుపడ్తుంది'— నిధి.

'చలం బాగా తలకెక్కినట్టున్నాదే'— వేణు.

'అదంతా ఏమోగాని చదువు పేరుతో మనం చేస్తున్న ఈ క్రైమ్‌కి మనల్ని ఉరి తీసినా పాపంలేదు'— రవి ఆవేశంగా. యేదో తనకి తెలియని కసి. తనమీద కసి తనలో ఉవ్వెత్తున లేస్తున్నది. తనను తాను కాల్చుకోవాలన్నంత కసి. తన్ను తాను నరికేసుకోవాలన్నంత కసి.

'యేం? ఉరి తీసేవరకు వెళ్ళావు'— వేణు

'మీ సంగతి ఏమో నాకు తెలియదుగాని— మా ఫ్యామిలీకి నన్నిక్కడ హైద్రాబాద్‌లో ఈ లగ్జూరియస్ హాస్టల్స్‌లో మేపుతూ చదివించే ఆర్థికస్తోమత లేదు. అయినా వాళ్లు చదివిస్తున్నారు. యెన్నో కష్టాలుపడి. వాళ్ళ రక్తమాంసాల్ని నాకోసం కరెన్సీగా మార్చి పంపిస్తున్నారు. నామీద ఏవో ఆశలు వాళ్లకి. యింకో సంవత్సరం ఎలాగో కష్ట పడ్డారంటే వాళ్ళ కష్టాలన్నీ తీరిపోతాయని. నేనేదో అవుతానని- వాళ్లని ఉద్ధరిస్తానని. ఆ ఆశల్ని నేనే వాళ్లనుండి డబ్బు లాగటానికి వాళ్ళల్లో సృష్టించి పెంచాను. కాని వాళ్ళ ఆశల్లో ఏ ఒక్కటైనా తీర్చే ప్రయత్నం చేయటంలేదు నేను. వాళ్లు పంపించే డబ్బును మంచి నీళ్ళల్లా ఖర్చు పెట్టేస్తున్నాను. రియల్లీ— నన్ను నేను క్షమించుకోలేను'. తనేనా మాట్లాడు తున్నది? తన గొంతు బొంగురు పోవడం తనకి తెలుస్తోంది. క్యాంటిన్ కొచ్చారు.

'సలీమ్- కుర్చీలు బయటకు పట్రా'— అన్నాడు నిధి.

'సలీమ్— అనార్కలీ కోసం వెళ్ళుంటాడు. ఔరంగజేబుని పిలు'— వేణు. రమేశ్ నిధితో పాటు అక్కడి వాళ్ళంతా గొల్లున నవ్వారు. మొదటి సారిగా వేణు

మీద కోపం వచ్చింది. తను యింత ఆవేశంతో యింత ఫీలింగ్‌తో మాట్లాడుతుంటే జోక్స్ చేస్తాడా? తన బాధల్ని, గాథల్ని, తన కలల్ని కన్నీళ్ళను అర్థం చేసికోగల వ్యక్తి ఈ హాస్టల్లో ఎవరన్నా వుంటే అతడు 'వేణు' అనుకున్నాడిన్నాళ్లు. కాని ఆ వేణు తనని పట్టించుకోవడమే లేదు. తనను నిలువెల్లా కుదిపివేస్తున్న ఆవేశాన్ని అతడు అంత లైట్‌గా తీసి వేస్తాడా?

కుర్చీలు వచ్చాయి. నల్గురూ కూర్చున్నారు. రేడియోలో ఏదో పాట. తనకి చాలాయిష్టమైనపాట. 'బహారోం ఫూల్ బర్‌సావో మేరా మెహబూబ్ ఆయాహై' విధి కూడా గొంతు కలుపుతున్నాడు.

"అన్నట్టు ఆపాట నీకు చాల యిష్టంకదు-" వేణు తనవైపు తిరిగి. 'ఔను'—రవి. కాని ఆ పాటని ఎన్‌జాయ్‌చేసే మూడ్‌లో వున్నాడా తనిప్పుడు?— వేణు ఆ మాత్రం గుర్తించలేడు?

'శంకర్-జైకిషన్‌కి పద్మశ్రీ వచ్చింది తెలుసా'—విధి.

'పద్మశ్రీ రావటం గొప్పా? యింకో పదేళ్లుపోతే ఈ దేశంలో 'పద్మశ్రీ' రానివాడెవడూ ఉండడు. నీకూ నాకూ కూడావస్తుంది. డోన్ట్‌వరీ'—వేణు.

మళ్లా అంతా నవ్వారు. తనకిగూడా నవ్వాలనిపించింది. కాని తనమూడ్. ఈ మూడ్‌లో నవ్వటమా?

ఇంతలో కాంటీన్‌కి ఒక అమెరికన్ కెమెరా భుజానికి తగిలించుకొనివచ్చాడు.

'ఎవడు వీడు? పీస్‌కోర్ వాలంటీరా?'—విధి

'పీస్‌కోర్‌వాడో ధగాకోర్‌గాడో. పీస్‌కోర్ అంటే కోడ్‌భాషలో C.I.A అన్నమాట'—వేణు.

విధి బిగ్గరగా నవ్వాడు. రవికూడా నవ్వకుండా వుండలేకపోయాడు. కాని రమేష్‌కి కోపం వచ్చింది.

'అమెరికన్స్ అంటే మీకీ ప్రిజుడిస్ ఎందుకో నాకర్థంకాదు'—రమేష్.

అమాట తనలోకి ఎలక్ట్రిక్‌షాక్‌నే పంపించింది.

'ఎందుకా? అమెరికన్సు యీనాడు వియత్నాంలో జరుగుతున్న అమానుష మారణహోమానికి బాధ్యులు. కాబట్టి, డబ్బుతో బ్రూట్‌ఫోర్స్‌తో మారణాయుధాలతో ఆసియాప్రజల స్వాతంత్ర్యవాంఛని నలిపేయవచ్చుననే వాళ్ల వెర్రిభ్రమలకు. ఐ హేట్ దీజ్ డర్టీ అమెరికన్స్'—రవి కసిగా, గొంతు హెచ్చించి మాట్లాడుతున్నాడు. అక్కడ కూర్చొని టీ తాగుతున్నవాళ్లంతా తనకేసి చూడటం గమనించాడు,

కౌంటర్ దగ్గర ఏదో కొనుక్కుంటున్న అమెరికన్ వెనక్కి తిరిగి చూశాడు "మే ఐ నో సర్, వై యు హేట్ అమెరికన్స్?" చిరునవ్వు నవ్వుతూ అడిగాడు. అది చిరునవ్వుకాదు. విషపు నవ్వనిపించింది రవికి. అంతా రవికేసి చూస్తున్నారు. తనకేమీ తెలియటంలేదు. తనలో ఏదో ఉద్రేకం— ఆవేశం ఉవ్వెత్తునలేచాయి.

"ఫర్ యువర్ బీస్ట్లీ అండ్ ఇన్‌హ్యూమన్ అట్రాసిటీస్ ఇన్ వియత్నాం" వెంటనే తన ప్రమేయంలేకుండానే వెలువడింది జవాబు.

ఒకసారి అందరికేసి చూసి 'వో! ఐసీ!' అంటూ అదే చిరునవ్వుతో వెళ్లిపోయాడు అమెరికన్.

అంతా విశ్శబ్దం. తనేంచేశాడో తనకి తెలియటంలేదు. తనేమన్నాడో తనకే జ్ఞాపకంలేదు. ఆమాటలు తన నోటినుండే వెలువడ్డాయా? అంతా కల. క్షణంలో జరిగిపోయింది. వేణు అన్నట్టు వాడు సి. ఐ. ఎ. ఏజెంట్ కాడుకదా! తననెక్కడికో కిడ్‌న్యాప్ చేసుకపోడుగదా!

'నేనన్నట్టు నిజంగా వాడు సి. ఐ. ఎ. ఏజంటే ఐతే మన పని పడతాడు. జాగ్రత్త'—వేణు.

'అతను సి. ఐ. ఎ. ఏజంట్ కాడు. పాడుగాడు. అతను పీస్‌కోర్ వాలంటీర్. హీ ఇజ్ యె వెరీ నైస్‌మ్యాన్. నాకతడు తెలుసుగదా. అనవసరంగా అతన్ని హర్ట్ చేశాం'—రమేశ్.

'అతన్నేమీ హర్ట్ చేయలేదు. నువ్వెందుకంత బాధపడ్తావ్'—రవి.

'హర్ట్ చేయకపోవడమేమిటి? బీస్ట్లీ, ఇన్‌హ్యూమన్ అంటూ.... యాజ్ ఇఫ్ హి ఇజ్ గివింగ్ ఆర్డర్స్ టు బాంబ్ హనోయ్—మీలాగే అతడు అమెరికన్ వియత్నాం పాలసీని హేట్‌చేస్తాడు. కాని అతడేమి చేయగలడు? హి ఇజ్ యన్ ఆర్డినరీ సిటిజెన్. కెన్ హి ఇన్‌ఫ్లుఎన్స్ ప్రెసిడెంట్ జాన్‌సన్? అతణ్ణి పట్టుకొని అరిస్తే ఏం లాభం?' రమేశ్ చాలా నిష్ఠూరంగా.

'ఆ అమెరికన్‌ను ఏదో అన్నంతమాత్రాన నువ్వెందుకింత ఋద్దైపోతున్నావో మాకు తెలుసు'—రవి

'ఏమిటి నీకు తెలిసింది'—రమేశ్

'ఇలాంటి అమెరికన్స్‌తో ఫ్రెండ్‌షిప్ చేసికొని ఎలాగో అమెరికావెళ్లాలనుకుంటున్నావు. ఐ నో హౌ క్రేజీ యూ ఆర్ టు గో టు స్టేట్స్'—రవి. మళ్లా తనే

మంటున్నాడో తనకి తెలియటంలేదు ఏదో వెర్రి ఆవేశం, కసి, మళ్ళా తనను వశం చేసికుంటున్నాయి.

'నాన్‌సెన్స్. యూ ఆర్ టాకింగ్ షీర్ నాన్సెన్స్'—రమేశ్

'ఔను. నిజం నాన్సెన్స్‌లాగే వుంటుంది'—రవి.

'అబ్బబ్బ- వూరుకోండికాస్త. నిధి కాసిన్ని మంచినీళ్లు తెప్పించు. ప్లీజ్ చెరోగ్లాసు మంచినీళ్లు తాగండి'—వేణు.

అంతా నవ్వారు చుట్టుపక్కల వున్నవాళ్లతోసహా

'దో పానీ లావోజీ'—నిధి.

అక్కడున్న వాళ్లంతా తమకేసి చూడటం— త మాటలు వినటం రవికి అన్నింటికంటె కష్టంగాఉంది. మంచినీళ్లు వచ్చాయి తనకోగ్లాసు- రమేశ్‌కో గ్లాసు అందించారు.

'అలాగే చార్ చాయ్ లావో'—వేణు.

'అమెరికాకు పోవాలనే అనుకుంటున్నాననుకో- నువ్వన్నట్టు ఐ యామ్ క్రేజీ ఆఫ్ గోయింగ్ టు అమెరికా- దానిపట్ల నేనేదో తప్పు చేస్తున్నానన్నట్టు మాట్లాడటం దేనికి?'—రమేశ్.

తనకిక మాట్లాడటం ఇష్టంలేదు. రమేశ్‌తో సంభాషణ ఎప్పుడూ ఇలాగే ఏదోరకమైన పోట్లాటకి దారి తీస్తుంది.

'పోనీరే రమేశ్. ఐ యామ్ సారీ. లెటజ్ స్టాప్ ఇట్'—రవి.

'అదికాదు. నేనో సంగతి చెప్పనా? నేను అమెరికా వెళ్లటంపట్ల నువ్వంత టచ్చీగా ఎందుకుంటావో'—రమేశ్.

మళ్లా ఏదో బాంబు పేలబోతున్నట్టుంది. తను సారీ అన్నా రమేశ్ వూరుకోవటంలేదు, హీ వాన్ట్సటు ఫైట్.... ఫైట్ అండ్ ఫైట్.

'ప్లీజ్ రమేశ్. లెటజ్ స్టాపిట్. ఐ టెల్ యు. లెటజ్ స్టాపిట్'—రవి

'నేను అమెరికాకి వెళ్లబోతున్నానని నీకు ఈర్ష్య యూ ఆర్ టెర్రిబ్లీ జెలస్ ఆఫ్ మి. దటీజ్ ది రీజన్ వై యూ ఆర్ సో అప్‌ఫుల్లీ టచ్చీ అబౌట్ మై గోయింగ్‌టు అమెరికా'—రమేశ్. తనను సాధ్యమైనంతగా హింసించాననే తృప్తి రమేశ్‌మొహంలో

"నిజంగా నీమీద జాలేస్తుంది రమేశ్. నువ్వు అమెరికాకి పోతున్నావని నాకు ఈర్ష్యా? మన అంతరాత్మలకి తెలుసు. ఎవరు ఎవరిపట్ల ఈర్ష్యపడుతున్నారో?"

తన కంఠంలో విపరీతమైనబాధ. తనలోనూ కల్గుతున్నది సందేహం. నిజంగా రమేశ్ పట్ల ఈర్ష్యా? ఒకటిమాత్రం నిజం, అతను అమెరికాకి వెళ్ళడానికి ప్రయత్నించటాన్ని మాత్రిం తను ఎన్నడూ హర్షించలేదు ఏదో నెపంమీద కావాలని అతవి అమెరికా ప్రియత్నాన్ని ఖండించాడు. అదంతా జెలసీకారణంగా నేనా? ఏమో? రమేశ్ తనకి స్నేహితుడు. ఒకప్పుడు ఎంతో ఇంటిమేట్‌గా- ఒకర్నివిడిచి ఒకరు ఒక్కక్షణంకూడా వుండలేనంత స్నేహితులు. హైస్కూల్లో, కాలేజీలో చదివేరోజుల్లో ఇద్దరిమధ్యవున్న అన్యోన్యత అందర్నీ ముగ్ధుల్నిచేసేది.... కాని యేమిటో? హైదరాబాదుకి వచ్చాక ఆ అన్యోన్యత అకస్మాత్తుగా భగ్నమైపోయింది. అతని కలలు, అతని ఆశయాలు వేరై పోయాయి. అంతే. ఇప్పుడు ఇద్దరూ ఒకర్నొకరు ఏదో ఒక నెపంమీద హింసించుకోవడానికే ప్రియత్నిస్తున్నారు.

"జమురుద్‌లో మంచి మార్నింగ్‌షో ఉంది కాగజ్‌కే ఫూల్"—నిధి.

"ఆ! కాగజ్‌కే ఫూలా?"—వేణు.

"యస్ కాగజ్‌కే ఫూల్"—నిధి.

తనలో అకస్మాత్తుగా ఉత్సాహం పెల్లుబికింది 'ఐతే తప్పకుండా చూడాలి. గురుదత్ చనిపోయాక ఇదేననుకుంటాను మళ్లా రావటం చాలా గొప్ప పిక్చర్. ఆ పిక్చర్‌కి రావల్సినంత ఫేమ్ రాలేదు'—రవి.

"నిజంగా 'కాగజ్‌కే ఫూల్' ఫెయిల్ కావడం గురుదత్‌ని యెంత కుంగదీసిందో. ఒకవిధంగా గురుదత్‌చావుకి ఆ పిక్చర్ ఫెయిలవడమే కారణమనుకుంటాను. ఆ సెన్సిటివ్ ఆర్టిస్ట్ హృదయం ఎంత బాధపడి వుంటుందో"—వేణు.

"ఇంతకీ గురుదత్ ఆత్మహత్య చేసికొన్నాడంటావా?"—నిధి

"దేర్ ఈజ్ నో డౌట్ ఎబౌటిట్. చిత్రిమేమిటంటే ... కాగజ్‌కే ఫూల్‌లోని డైరెక్టర్ ఎలాంటి సమస్యను- ఎలాంటి విషాదాన్ని ఎదుర్కొన్నాడో- ఆ పిక్చర్ రిలీజ్ అయ్యాక గురుదత్‌కూడా సరిగ్గా అలాంటి సమస్యను- అలాంటి విషాదాన్నే ఎదుర్కొన్నాడు"—వేణు.

"అంటే కాగజ్‌కేఫూల్ గురుదత్ ఆటోబయాగ్రఫికల్ పిక్చర్ అంటావా?" —రవి

"అలా అనటానికి వీల్లేదుకదా! కాగజ్‌కేఫూల్‌లో ఏంజరిగిందో అదే తర్వాత గురుదత్ జీవితంలోనూ జరిగింది. గురుదత్ జీవితం లైఫ్ ఇమిటేట్స్ ఆర్ట్ అన్న ఆస్కార్ వైల్డ్ మాటని రుజువుచేసింది"—వేణు.

"ఇంతకీ గురుదత్ అలా అకస్మాత్తుగా చనిపోవటానికి కారణమేమిటంటావు?"—నిధి.

"ఒకటి- కాగజ్ కే ఫూల్ అంత ఘోరంగా ఫెయిల్ అవటంతో గురుదత్ డైరెక్టర్ గా పూర్తిగా తన ఆత్మవిశ్వాసాన్ని కోల్పోయాడు. ఆ పిక్చర్ తీసిన తర్వాత గురుదత్ మరో పిక్చర్ దేనినైనా డైరెక్ట్ చేయకపోవడం గుర్తించుకోవాలి.... తర్వాత కాగజ్ కే ఫూల్ లో హీరో ఎలా ప్రేయసికి- భార్యకి మధ్య నలిగిపోయాడో గురుదత్ నిజ జీవితంలోనూ సరిగ్గా అదే జరిగిందని నా గట్టి నమ్మకం, ఇలాంటి స్థితిలో— అకస్మాత్తుగా అతనిలో జీవితమంతా ఉత్త భ్రమ- కాగితపు పువ్వు- ఈ ప్రపంచానికి గొప్ప విలువలులేవు— బతకడం దేనికనే ఒక విముఖత్వం— ఫ్లాష్ లాగ అతనిలో ప్రవేశించి వుంటుంది. అంతే. అంతా ఐపోయింది"—వేణు.

కాస్సేపు అంతా నిశ్శబ్దంగా కూర్చున్నారు.

"ఆ పిక్చర్ ని మళ్లా ఇప్పుడు యీ బ్యాక్ గ్రౌండ్ లో చూస్తే ఎంతో అపిసియేట్ చేయగలమనుకుంటాను, ఎలాగైనా చూడాలి—"రవి.

"నిధీ! నువ్వు చూపించగలవా?" వేణు.

"అబ్బే! రెండు రోజులనుంచీ సిగరెట్లకే డబ్బులు లేవు. ఛస్తున్నాను, ప్లేయర్స్ తాగేవాణ్ణి. చార్మీనార్ కూడా గతిలేకుండాపోయింది రెండ్రోజులుగా"—నిధి.

"ఏం రమేష్ నువ్వు"—వేణు.

"నాకు పిక్చర్లంటే మీకున్నంత క్రేజీనెస్ లేదు"—రమేష్ కసిగా.

"ఇది మామూలు పిక్చర్ కాదు- చాల గొప్ప పిక్చర్. నిన్ను మూవ్ చేస్తుంది. కన్నీళ్లు తెప్పిస్తుంది. ఒక గొప్ప అనుభూతిని పొందుతావు"—వేణు.

"ఐ యామ్ సారీ. ఐ యామ్ నాట్ దట్ సెంటిమెంటల్. పిక్చర్ కన్నీళ్లు తెప్పించటమేమిటి. మూవీగాబట్టి మూవ్ చేస్తుందేమో"—రమేష్. ప్రతిమాట తనకేసి గురిపెట్టబడి వదిలిపెడ్తున్న రాకెట్ అని తనకి తెలుస్తూనేవుంది....

'అహహ—. గొప్పజోకు. అమెరికాకి వెళ్లేవాడివి. నీ కెందుకుంటాయి సెంటిమెంట్లు. మాలాంటి రూరల్ ఫోక్ కి సెంటిమెంట్లు వుంటాయి'—రవి

'అమ్మబాబోయ్, మీరు మళ్లా పోట్లాటలకిదిగొద్దు. రమేష్ నువ్వు సినిమా చూపించకపోతేమానెగాని రవితో పోట్లాట పెట్టుకోవద్దు. ఏం నిధీ.... నువ్వు టీ కి ఆర్డరు ఇచ్చినట్టున్నావు. వస్తున్నదా లేక వెళ్లిపోదామా?'

'బోయ్ టీ యేదిరా?'—నిధి.

బోయ్ నాలుగు టీ తెచ్చాడు,

'అమ్మయ్య. క్షీరసాగర మథనం జరిగాక అమృతం ఉదయించింది. ఇక సేవించండి'—వేణు.

'ఇంతకీ మనం దేవతలమంటావా? రాక్షసులమంటావా?'—రవి.

'మనకి అమృతం లభించింది కాబట్టి మనం దేవతలమే'—వేణు.

"దేవతలు కావటంకంటే రాక్షసులుకావటమే నాకిష్టం. ఎందుకో దేవతలు అనేమాట నాకో తిట్టులా వినిపిస్తోంది. రాక్షసుల్లోనే ఎక్కువ నొబిలిటీ వుందని పిస్తుంది"—నిధి.

'పతివ్రత అనేమాటలాగ.... తెలుగు సినిమాల్లోని పతివ్రతల్ని చూస్తే వీళ్ళ కంటె పచ్చి ప్రాస్టిట్యూట్స్ నయమనిపిస్తారు'—రవి.

'అదంతా ఫోనీయ్ కాని ఏ పతివ్రతైనా తన పాతివ్రత్య మహిమతో మన కివ్వాళ్ల 'కాగజ్‌కే ఫూల్'అనే సినిమా చూపిస్తే బాగుండును'—వేణు.

"మనం పెళ్లిళ్లు చేసికోకపోవటంవల్ల యెంత ప్రమాదం జరిగిందో గుర్తించావా?"—రవి.

'పెళ్లిచేసికుంటే మనభార్యలు పాతివ్రత్యమహిమతో మనకిప్పుడు సినిమాలు చూపించేవారంటావు ఇట్స్ గుడ్ ఐడియా, వెంటనే తలా ఒక పతివ్రతనిచూచి పెళ్ళిచేసికొందామా?'—నిధి.

'యస్. వెంటనే 'ది హిందూ'-మాట్రిమోనియల్ కాలంకి రాసేద్దాం నల్గురు పతివ్రతలు కావాలి అని'—రవి.

"కాని ఒకచిక్కు. ఒకావిడ పతివ్రతఅని నిర్ణయించడం ఎలా? ఆవిడకి ఇదివరకే పెళ్లి ఐపోతేగదా ఆవిడ పతివ్రత అన్పించుకోవటం- మనం 'పతివ్రతల్ని' చేసికోవాలంటే యిదివరకే పెళ్ళిఅయ్యి పతివ్రతనే సర్టిఫికెట్ తెచ్చుకున్న స్త్రీ అయి వుండాలి. అలాంటి స్త్రీ మళ్లీ మనని పెళ్ళిచేసుకుంటే ఆవిడ ఇక పతివ్రత ఎలా అవుతుంది? పెద్ద విషియస్ సర్కిల్‌లో పడిపోయాం పో"—వేణు

"అసలు ఒక సంగతి ఆలోచించటంలేదు మీరు. ఈ పవిత్ర భారతదేశంలో ఇన్ని సమస్యలున్నాయికదా- తిండి, బట్ట, గూడు లేక ప్రజలు కష్టపడ్తున్నారుకదా! ఎందుకనుకున్నారు? ఇవ్వాళ్లీ ఈ దేశంలో పతివ్రతలకి తగిన ఆదరణ లభించటంలేదు. అందుకని ప్రభుత్వం కొంతమంది స్త్రీలని అగ్నిప్రవేశం చేయించి, బయటకు వచ్చిన

వాళ్ళని పతివ్రతలుగా గుర్తించి వాళ్లసహాయంతో ఈ దేశంలోని సమస్యలన్నీ క్షణంలో సాల్వ్‌చేసి పారవెయ్యవచ్చు"—రవి.

వేణు, నిధి గొల్లున నవ్వారు.

"గ్రేట్ ఐడియా. ఈ విషయం ఏ రాజాజీకో, కె. యమ్. మున్షీకో రాసావంటే నీపేరు భారతదేశమంతా మోగిపోతుంది. ఈ విషయాన్ని రాజాజీ 'స్వరాజ్య'లో, మున్షీ 'భవన్స్ జర్నల్'లో రాసిపారేస్తారు. యం. ఆర్. మసానీ. బలరాజ్ మధోక్ యీ విషయాన్ని పార్లమెంట్‌లో ప్రసంగిస్తారు. 'ది హిందూ'వాడు బ్రహ్మాండమైన ఎడిటోరియల్ రాస్తాడు. నీకు తప్పకుండ పద్మశ్రీ వస్తుంది. అమ్మమ్మ.... రవీ– నీవు జీనియస్సువి. మా పక్కనే వుంటున్నావు కాబట్టి గుర్తించలేక పోతున్నాము"—వేణు

నిధి, రవి, రమేష్‌లు తనివితీరా నవ్వారు.

"ఇవాళ వేణు టెర్రిఫిక్‌ఫామ్‌లో వున్నాడు. మా రూంలో దోమలతో వేగలేకుండా వున్నాం. నువ్వొకసారివచ్చి జోక్స్ వేశావా దోమలన్నీ నవ్వలేకఛస్తాయి" —రవి.

మళ్లా అంతా నవ్వారు.

"కాని ఒక ప్రమాదం. దోమలతోపాటు మీరుకూడా నవ్వలేక ఛస్తే ... ఆ తర్వాత నేను యేడ్వలేక చస్తాను."వేణు.

"అమ్మబాబోయ్ నిజంగానే నవ్వలేక చచ్చేటట్టున్నాం ఈరోజు"— నిధి.

మళ్లా అంతా గొల్లుమన్నారు.

"ఛస్తే చచ్చాంగాని కాగజ్ కే ఫూల్ చూసిచద్దాం. ఎవడిదగ్గరకెడదాం అప్పుకి. అప్పిచ్చువాడు వైద్యుడు.... డాక్టర్ దగ్గరకెళ్లి అడుగుదామా?"—వేణు.

"డాక్టర్ దగ్గరకెందుకు?"—నిధి.

"ఎందుకేమిటి? సుమతీశతకకారుడు చెప్పాడుగా అప్పిచ్చువాడు వైద్యుడని" —వేణు.

మళ్ళా గొల్లుమని నవ్వులు

"ఔను ఐడియా. మొన్న మనకి పరిచయమైనాడే యం. బి. బి యస్. స్టూడెంట్ నారాయణరావు. అతన్ని అడుగుదామా?—రవి.

'ఐడియా. కొత్తగా పరిచయమయ్యాడా। మనమంటే కొంచెం గౌరవం కూడా వున్నట్టుంది. యం,బి,బి,యస్. చదువుతున్నాడంటే తప్పకుండా డబ్బుంటుంది. అతని రూంకెడదాం.

'హల్లో ఓఫైపుందా?' అంటాను నేను.

'రేపే రేపు యిచ్చేస్తాము'—అంటాడు నిధి.

'థ్యాంక్యూ, థ్యాంక్యూ వెరీమచ్'అంటాడు రవి. సెకండ్స్‌లో జరగాలి. అతనికి లేదు అని చెప్పేఛాన్స్ యివ్వద్దు. హూ రెడీ!'—వేణు.

'లోమాషైమ్, 9.30 ఎ.యం.'

'అమ్మబాబోయ్ తొమ్మిదిన్నరే. ఇట్స్ టూ మచ్. వెంటనే వెళ్లిపోవాలి' —రమేష్ లేచాడు.

'మేమూ వస్తున్నాము. నీకే పనులున్నాయనుకున్నావా? మాకూ ఉన్నాయి ....పనులు'—వేణు.

'తొమ్మిదిన్నరేగా అయ్యింది. ఏంచేస్తాం ఇప్పటినుండి రూమ్‌కెళ్లి'—నిధి.

'మా ఫ్రెండొకాయన కెమెరా యిస్తానన్నాడు యీ రోజు. వెంటనే వెళ్ళి తీసికోవాలి'—రమేష్.

'ఓహో! ఈమధ్య రమేష్ ఫొటోగ్రఫీ నేర్చుకుంటున్నాడు కదూ! ఎంత వరకొచ్చింది? నువ్వు ఫోటోలుతీస్తే మనుషులు మనుషుల్లా కన్పిస్తారా?'—వేణు.

రవి గట్టిగా, కసిగా నవ్వాడు.

'ఆ భయమేమీ అక్కర్లేదు నేనీమధ్య తీసిన ఫోటోల్ని చూడలేదన్న మాట'—రమేష్.

'నువ్వు చూపించందే?'—వేణు.

కాస్సేపు అంతా నిశ్శబ్దంగా నడిచారు.

'నన్నడిగితే.... ఆ మెడికో నారాయణరావుకంటె కొంచెం బెటర్ సోర్స్ చెప్తాను'—నిధి.

'అప్పుకేనా? చెప్పు! చెప్పు!! ఎక్కడ?'—వేణు,

'ఆ సోర్స్ నుండి మనకి అప్పు రావడం రవిమీద ఆధారపడి ఉంటుంది' —నిధి.

'ఏమిటా సోర్స్? చెప్పు! నాకు సాధ్యమైతే తప్పకుండా తెస్తాను. కాగజ్ కే ఫూల్ చూడాలని నాక్కూడ ఎంతో యిదిగావుంది'—రవి.

'మీ క్లాసుమేట్ గుర్నాథంగాడ్ని అడగకూడదూ, వాడిదగ్గర డబ్బు ఎప్పుడూ వుంటుంది. వాడు నీకుతప్ప ఈ హాస్టల్లో ఎవరికీ డబ్బు యివ్వడు'—నిధి.

గుర్నాధంపేరు రవికి షాక్‌లా తగిలింది. పొద్దున వాడు చేసిన పని ... వాడిని మరచిపోవాలని- వాడిమొఖం చూడకూడదని- వాడిదగ్గర అప్పుచేయకూడదని ఎన్నిసార్లు ఎన్నిసార్లు ఎంత గట్టిగా అనుకున్నాడో? వాడి జ్ఞాపకమే తనలో కల్గించే మానసిక వికారం- ఆ వికారం కారణంగా తన మనస్సులోకి ఎంత విషం ఎక్కుతున్నదో వీళ్ళు ఊహించలేరు. వీళ్లకి డబ్బుకావాలి. ఒక్కసారి అసహ్యం కల్గింది. తన స్నేహితులమీద- తనమీద- తన చదువుమీద- హాస్టల్‌మీద- ఎక్కడికైనా దూరంగా పారిపోవాలనే సెన్సేషన్ కల్గింది.

'నో-నో-నో- ఐ యామ్ వెరీ సారీ. వాడిసంగతి మీకు తెలీదు. వాడికి కొన్ని వేల మైళ్ల దూరంలో ఉండాలనుకుంటున్నాను. వాడిదగ్గర అప్పుచేసి యిప్పటికే నైతికంగా ఎంతో పతనం చెందాను. ఇంక కాలేను. ప్లీజ్ ఎక్స్‌క్యూజ్ మి'—రవి.

'ఎందుకంత బాధపడ్తావు. అడగకపోతే మానె. నిన్నిప్పుడు అంత బలవంతం ఎవరూ చేయడంలేదు. సిల్లీథింగ్స్‌కు కూడా ఎందుకంత బాధపడ్తావు రవి' —వేణు.

'నీకు తెలియదు నా బాధ. గుర్నాధంగాడు.... నీకు తెలియదు'—రవి.

'మరిక ఎవర్ని పడదాం?'—నిధి.

'అబ్బబ్బ! పోనీయ్ వెధవ సినిమా. ఇలా అప్పులుచేసి సినిమాకెళ్లటం మనకి బాగా అలవాటైపోయింది. ఎగ్జామ్స్ ఇంకా నెలరోజులైనా లేవు. మనమింకా మార్నింగ్‌షోస్ చూస్తున్నాము'—రవి.

'ఇంకా నెలరోజులున్నాయిగా. లాట్ ఆఫ్ టైం. ఎన్నిరోజులుంటే యేం. చదువుతామా? పాడా?'—నిధి.

'ఇంకా నెలరోజులేనా పరీక్షలకు? నేనైతే ఒక్క అక్షరమన్నా చదవలేదు' —వేణు.

'అసలు నాకైతే టెక్స్ట్ బుక్స్ పేర్లుకూడా తెలియవు'—నిధి.

'అది చాలా గర్వించతగ్గ విషయం అన్నట్టుగా చెప్పుతున్నావు'—రవి.

'ఔను. ఆ చెత్త బుక్స్ తెలియకపోవటమే యిష్టం నాకు. 'పురూరవ'— 'ఓ పువ్వు పూసింది' మొదలైన పుస్తకాలు చదివినకళ్లతో ఆ చెత్తపుస్తకాలు చదవటమా? అసలు పరీక్షలకోసం చదవటం అనే ఐడియానే చాల రివల్సివ్‌గా వుంటుంది.'—నిధి.

'ఒకవిధంగా ఆలోచిస్తే చలం పుస్తకాలు మనలను పాడుచేశాయి'—రవి.

'అహాహ- అవి నిజంగా మనల్ని పాడుచేశాయంటే ఎంత బాగుచేశాయో' —నిధి

'రవి ఈరోజు చాలా వింతగా మాట్లాడుతున్నాడే.... నాలుగేళ్లుగా చలం రచనల్ని తాగి బతుకుతున్నాననే రవేనా యిలా మాట్లాడుతున్నది?'—వేణు.

'ఐ కాంట్ హెల్పిట్. చలంగారు మనల్ని యీ ప్రాక్టికల్ వర్ల్డ్‌కి పనికి రాకుండా చేశారు. ఈ చదువులంటే, యూనివర్సిటీలంటే- లెక్చరర్లంటే- పరీక్షలంటే.... బలమైన అపహ్యాన్ని కల్గించాడు. మనం తినటం, తిరగటం, సినిమాలు చూడటం, రేడియో సిలోన్ పాటలు వినటం, మన యూనివర్సిటీ చదువుకి సంబంధం లేని యేవో పుస్తకాలు చదవటం- ఇలా ఉత్త సోమరిపోతులుగా తయారయ్యాము. మన అసమర్థత, సోమరితనాన్ని కప్పిపుచ్చుకోడానికి చలంగారి థీరీస్ చక్కగా పనికొస్తున్నాయి. మనం గడిపే ఈ లైఫ్‌ని ఎస్థెటిక్ లైఫ్ అనో, ఆర్టిస్టిక్ లైఫ్ అనో మనల్ని మనం మోసగించుకుంటున్నాము'—రవి.

'ఆంధ్రదేశమంతా చలంగార్ని తిట్టి తిట్టి విసిగిపోయిన యీ తరుణంలో మనం మళ్ళా చలంగారిమీద దుమారం లేవదీద్దామా?'—వేణు.

'చలంగార్ని తిట్టటంకాదు. చలం చెప్పినట్టుగా జీవించే పరిస్థితులు మనకి లేవంటాను. జస్ట్ వియ్‌కాంట్ ఎఫర్డ్ యిట్. చలం ఎప్పుడూ మనిషి ఆర్థికావసరాల్ని గూర్చి పట్టించుకోలేదు. కాని మనిషి జీవితంలో డబ్బు చాలా ముఖ్యమైంది. మన మెవరమూ అంతడబ్బున్నవాళ్లంకాదు. ఎన్నో ఆశలతో మనలను చదివిస్తున్నారు మన తలిదండ్రులు. వాళ్లు పస్తులుండి- వాళ్లు తమ రక్తమాంసాల్ని మనకు డబ్బుగా పంపిస్తున్నారు. మనమేదో వాళ్లని ఉద్ధరిస్తామని- ఎప్పుడూ ఏవో కష్టాల్తో సతమతమయ్యేవాళ్ల జీవితాల్లో చిరునవ్వులు చిందిస్తామనీ- కాని మనకి టెక్ట్స్ బుక్స్ చెత్త-చదవకూడదు. సినిమాలు కళ. అప్పులుచేసైనా చూడాలి. పరీక్షలు నాన్సెన్స్. అప్పియర్ కాకూడదు. ఒక్కసారి ఆలోచించండి. మనమీద లక్షఆశలతో జీవిస్తున్న ఆ అమాయిక జీవులకు యెంత ఘోరమైన అన్యాయం చేస్తున్నామో మనం ఇంత క్రూరంగా ప్రవర్తిస్తున్నామని గోలచేసే మన అంతరాత్మల్ని చలం పేరు చెప్పి నోరు మూయిస్తున్నాము. చివరకు మనం ఎంతవరకు వచ్చామంటే మనలో ఎవడైనా కాస్త సీరియస్‌గా చదవటం మొదలెడితే వాడేదో తప్పు చేసినట్టు- ఘోరమైన క్రైముచేసినట్టు వాడిని గేళి చేస్తున్నాము. మాక్ చేస్తున్నాం'—రవి.

"అబ్బే! అదేమీలేదు"—వేణు.

"లేకపోవటమేమిటి? ఆమధ్య ఒకరోజు రమేష్ ఆరుగంటలు చదివినానని చెప్పినప్పుడు మనమంతా అతనిమీద ఎన్ని జోక్స్ కట్ చేశాం. మొన్నెప్పుడో నేను మూడుగంటలు చదివినానని చెప్పినప్పుడు నామీదెన్ని జోక్స్ వేశారు మీరంతా. బాగా చదివేవాడంటే మనం వాణ్ని బుక్‌వామ్ అనో- పుస్తకాల్లో బతికే వాడనో- మరేవో పేర్లుపెట్టి వాడినో విలన్‌లా చూడటంలేదూ? మనకి బాగా చదివేవాడు ఒక విలన్. చదవకుండా సినిమాలుచూస్తూ కాలక్షేపం చేసేవాడు హీరో. దిసీజ్ రియల్లీ మోస్ట్ అన్ ఫార్చునేట్"—రవి.

"ఔను. నువ్వు చెప్పేది చాలావరకు నిజమేననిపిస్తున్నది. ఇవ్వాల్టినుంచి అందరము సీరియస్‌గా చదవటం మొదలెడదాం. నో సినిమాలు- నో సాంగ్స్.... ఈ క్యాంటీన్‌లో గంటలు గంటలు కూర్చోవటం మానెయ్యాలి ... నువ్వన్నట్టు మనపై ఆశల్ని పెట్టుకున్న మన పెద్దవాళ్ల కోర్కెల్ని కొన్నైనా తీర్చకపోతే మనం మనని క్షమించుకోలేము"—వేణు.

'కాని ఒకటి ఆలోచించటంలేదు మీరు- చదివితేమాత్రం మనం మనవాళ్లని వుద్ధరిస్తామనే నమ్మకం ఏముంది? ఎం. ఏ లు చదివి ఎల్. డి. సి.లుగా చేస్తున్నవాళ్లని ఎంతమందిని చూపించాలి'—నిధి.

'లాస్టియర్ మాధవ్ ఎంతగా చదివేవాడు. పూర్ ఫెలో ఇప్పుడుఎల్.డి.సి.గా పనిచేస్తున్నాడు. అతన్నిచూస్తే ఫ్రస్ట్రేషన్‌అంటే ఏమిటో తెలుస్తుంది. హి యీజ్ ఫ్రస్ట్రేషన్ ఇన్‌కార్నేట్'—రమేష్.

'అతనికి క్లాస్ రాకపోవడంవల్ల కదా ఎల్. డి. సి. అయ్యింది. మనం సీరియస్‌గా చదివితే క్లాసువస్తుంది. తప్పకుండా వస్తుంది. ఐ యామ్ క్వైట్ కాన్ఫిడెంట్ ఎబౌట్ దట్'—రవి.

'మీ డిపార్టుమెంట్‌లో నీ పొజిషన్ ఎలావుంది? నువ్వంటే మీ ప్రొఫెసర్‌కి ఎలాంటి ఇంప్రెషన్ వుంది'—వేణు.

'మా ప్రొఫెసర్‌కి నాపేరే తెలియదు. అతన్నెప్పుడూ కలిసికోలేదుకూడా' —రవి.

'ఎంత అమాయకుడివి? ప్రొఫెసర్ని కలుసుకోకుండా- ప్రొఫెసరుకు 'లైటు' కొట్టకుండా క్లాసు వస్తుందనుకున్నావా? సింప్లీ యింపాజిబుల్'—వేణు.

'ఇదేమిటి— ప్రతివాడు ఇలా మాట్లాడతారిక్కడ? నాకు క్లాసు రావాలంటే నా ఆన్సర్ పేపర్ ముఖ్యంకాని నేను ప్రొఫెసర్‌కి 'లైటు' కొట్టడం కాదుగదా? మా

క్లాసులో ప్రతివాడు ప్రొఫెసరుకు కాకాపట్టేవాడే. దొంగ నమస్కారాలు. దొంగ వినయాలు. నన్నుకూడా అలాగే వుండమని చెప్పారు చాలామంది. బట్ ఐ హేటిట్. ఐ హేట్ విత్ ఆల్ మై హార్ట్ అండ్ సోల్. నా ఆన్సర్స్‌లో మెరిట్ వుంటే నాకు క్లాసువస్తుంది. లేకపోతే లేదు. అంతేగాని ప్రొఫెసర్‌కీ- రీడర్‌కి కాకాలుపట్టి- కాళ్లు పట్టుకొని తెచ్చుకునే క్లాసు నాకక్కర్లేదు ఐ హేటిట్. ఐ డిటెస్ట్ ఇట్'—రవి.

'మరెక అలాంటప్పుడు మీవాళ్లని ఉద్ధరించాలనే విషయం మరచిపో. ఈ జీవితంలో సక్సెస్ కావాలంటే నానాగడ్డి కరవాల్సిందే. దొంగ నటనలు- దొంగ వినయాలు. కాకా పట్టడాలు. ఇవన్నీ చెయ్యాల్సిందే. అప్పుడే నాలుగు రాళ్ళు సంపాదించగల్గుతాము. అంతేగాని ఐ హేటిట్- ఐ హేటిట్ అని ఐడియల్స్ మాట్లాడితే లాభంలేదు. మాధవ్‌కి థర్డుక్లాసు ఎందుకొచ్చిందనుకున్నావు. వాళ్ల ప్రొఫెసర్‌కి అతనంటే ఇష్టంలేదు'—వేణు.

'ఔను ... వాళ్ల ప్రొఫెసర్ ఏదో రిసర్చ్ ప్రాజెక్ట్ స్టార్ట్‌చేశాడట. మాధవ్‌ని ఆ ప్రాజెక్ట్‌లో డే అండ్ నైట్ వర్క్ చేయమన్నాడట. చాలావరకు చేసాడు. కాని పరీక్షలు దగ్గరౌతున్నప్పుడు వెళ్లటం మానేసాడట. అంతే. అది మనసులో వుంచుకొని అతణ్ణి థర్డుక్లాసులో పడేశాడు. అదే పరీక్షలు ఎంతదగ్గరైనా స్టడీస్‌మానేసి అతని రిసర్చ్‌కి సహాయం చేసినవాళ్లకి మాత్రం ఫస్టుక్లాసులు వచ్చాయి'—రమేష్.

'ఇదంతా వింటుంటే గుండెలు పగిలిపోతున్నాయి. యూనివర్సిటీస్‌లో యింత అన్యాయమా? దేశానికి మోరల్ అండ్ ఇన్‌టెలెక్చ్యువల్ లీడ్ యివ్వాల్సిన యూనివర్సిటీస్ యింత అధఃపాతాళానికి కుంగిపోతున్నాయా.... ఓగాడ్! ఈ దేశాన్ని ఎవడు రక్షించాలి'—రవి.

'మచ్ వర్స్. యూనివర్సిటీల్లో క్లాసులివ్వటం క్యాస్ట్‌మీద. రీజియన్‌మీద, స్టేటస్‌మీదకూడా ఆధారపడి వుంటుంది అఫ్‌కోర్స్ సెక్స్‌మీద ఆధారపడి వుంటుందన్నది జగద్విదితమే అనుకో. ప్రొఫెసర్ బ్రాహ్మడైతే బ్రాహ్మలకే క్లాసు వచ్చేలా చూసుకొంటాడు. రెడ్డి అయితే రెడ్డికే క్లాసువచ్చేలా చూసికొంటాడు. ఆంధ్రవాడైతే ఆంధ్రవాళ్ళకే క్లాసువచ్చేలా చూస్తాడు. ఇవన్నీకాకుండా ఏ కలెక్టర్ కొడుకో అల్లుడో లేక యే మినిష్టర్‌గారి కొడుకో అయితే క్లాసుదానంతటదే వస్తుందనుకో. ఇక అందమైన అమ్మాయైతే చెప్పాల్సిన పనేలేదు. నీకు ఈ క్వాలిఫికేషన్స్‌లో ఏమున్నాయని నువ్వు క్లాసు ఎక్స్‌పెక్ట్ చేస్తున్నావు?'—వేణు.

'ఇప్పుడు తెలిసింది. మా ప్రొఫెసర్‌గాడికి ఆ చలపతిగాడంటే ఎందుకో అంత అభిమానము. చలపతి బాగా డబ్బున్నవాడు. రోజూ కార్లో వస్తాడు. ఎవరో మినిస్టర్‌కి బంధువటకూడా. పైగా వాడు బ్రాహ్మడు. ప్రొఫెసర్ కూడా బ్రాహ్మడే'—రవి

'అమ్మయ్య! ఇన్నాళ్ళకు తెలిసిందా ఆ విషయం. మన యూనివర్శిటీలో యింకోటికూడా గమనించాలి. పాలిటిక్స్. ఒక లీడర్‌కి ఇంకోలీడర్‌కి పడదు. గ్రూప్స్. వాడి చుట్టూ కొంత మంది స్టూడెంట్సు. వీడి చుట్టూ కొంత మంది. తన అపోజిట్ ప్రొఫెసర్‌కి అభిమానులైన స్టూడెంట్స్‌ని నాశనంచేయాలని ప్రయత్నాలు. ఈపాలిటిక్స్‌తో సఫర్ అయ్యేది స్టూడెంట్స్. ఇవీ మన యూనివర్శిటీస్. జెనివిన్ ఎడ్యుకేషన్ తప్ప ప్రపంచంలోని అన్ని ఈవిల్స్‌కీ స్థానం మన యూనివర్శిటీస్.... తెలిసిందా రవిగారూ. ఇలాంటిచోట నీ ఐడియలిజమ్ ఎందుకు పనికొస్తుంది చెప్పు. ఇలాంటి పరిస్థితుల్లో మనకి టూ ఆల్టర్నేటివ్స్– వొకటి మనంకూడా ఆ ఈవిల్స్‌లో అతికి పోవటం– మనంకూడా కాకాపట్టడం. దొంగ వినయాలు నటించటం. మనప్రొఫెసర్‌కి యే కులం యిష్టమైతే మనంకూడా ఆ కులం వాళ్లమేనని చెప్పుకోవటం– ఇక రెండవది, ఇవేవీ పట్టించుకోకుండా వాటన్నిటికి దూరంగా ఎస్కేపిస్ట్స్‌గా తిరగటం. మనమిప్పుడు రెండోది చేస్తున్నాము. మొదటిది చేయగల్గితే రవి అన్నట్లు మన పల్లెటూర్లలోని పెద్దల్ని ఉద్ధరించవచ్చు. కాని చెయ్యగలమా అన్నదే సమస్య. కాకా పట్టడంకూడా ఆర్ట్. దానికీ కొంత ఎఫిసెన్సీ కావాలి. ప్రతివాడు కాకా పట్టటంలో సక్సెస్‌కాలేడు. మనలాంటివాడు ఆపని చేయబోతే బెడిసికొడ్తుంది. దాన్ని ఎంతో జాగ్రత్తగా కల్టివేట్ చేసికోవాలి'—వేణు.

'హౌ టు విన్ ఫ్రెండ్స్ అండ్ ఇన్‌ఫ్లుఎన్స్ పీపుల్‌లాంటి పుస్తకాలుచదివి' —రమేష్.

'ఆ రెండే ఆల్టర్‌నేటివ్స్ అని ఎందుకనుకోవాలి. మూడో అల్టర్నేటివ్ ఎందుకు ఆలోచించవు? కాంట్ వియ్ ఫైట్ దీజ్ ఈవిల్స్. ఇదంతా బయటికీడ్చి ప్రజల్ని ఎడ్యుకేట్ చేస్తే'– రవి. తన కంఠంలోని బలహీనత తనకే స్పష్టంగా తెలుస్తోంది.

'ఇంకా నీ ఐడియల్స్‌ని వదలడం లేదు. మనమా యీ ఈవిల్స్‌ని ఫైట్ చేసేది. ఈ యూనివర్శిటీస్‌లోని ఈవిల్స్‌ని రక్షించేది ఎవరనుకున్నావు. పాలిటీషియన్స్. పాలిటీషియన్స్‌ని రక్షించేది బిగ్ బిజినెస్ మెన్. ఈ వేస్టెడ్ యింటరెస్ట్స్ అన్నీ ఈ దేశంలో చాలాగట్టిగా పాతుకుని వున్నాయి. పవర్ వాళ్ళ చేతుల్లో వుంది. ఈ ఈవిల్స్ అన్ని ఫీల్డ్స్‌లోను ఇలా కంటిన్యూ కావడమే మన పాలిటీషియన్స్‌కి, బిగ్ బిజినెస్‌కి శ్రేయస్కరం, ఎందుకంటే– ఈ ఈవిల్స్‌వల్ల యే క్లాసైతే బాగు పడ్తున్నదో ఆ క్లాసు ఎప్పుడైనా ఈ పాలిటీషియన్స్‌కి– బిగ్ బిజ్‌నెస్‌మెన్‌కి లాయల్‌గా వుండే క్లాసన్నమాట. ఆ క్లాసు అలా ప్రాస్పర్ అయిపోతుండటం జరగాలి. స్వాతం

త్ర్యం వచ్చాక పదిహేను ఏళ్లల్లో పాపం నెహ్రూగారు ఎన్నో ఆశలతో స్టార్ట్ చేసిన పంచవర్ష ప్రణాళికల ఫలితాలు ఏమిటనుకున్నావు. పేదవాడు యింకా పేదవాడై పోతున్నాడు. 'తాతాలు', 'బిర్లాలు' తమ సామ్రాజ్యాన్ని విస్తరింప చేసుకుంటున్నారు. వాళ్లతో ఫైట్ చేయగలమా? ఇంకో విషయం. ప్రజాభిప్రాయాన్ని రిప్రెజెంట్ చేస్తుందనే ప్రెస్‌వాళ్ల చేతుల్లోనే.... సపోజ్.... ఈవిల్స్ అన్నింటిని బట్టబయలుచేస్తూ నువ్వో వ్యాసం రాస్తావనుకో. పెద్ద పేరున్న యే పేపర్లో దాన్ని ప్రచురించరు. ఏ పేపరన్నా జస్ట్ సెన్సేషన్‌కోసం ప్రచురిస్తుందనుకో.... వెంటనే అధికార్లు నీకోసం హంట్ చేయటం మొదలెడతారు. యు విల్ బి డబ్‌డ్ యాజ్ ఎ కమ్యూనిస్టు. మచ్ వర్స్, యాజ్ యన్ ఏజంట్ ఆఫ్ మావ్-సే-టుంగ్. మనమా ఈ ఈవిల్స్‌ని ఫైట్ చేసేది? అందువల్ల మనకున్న కోర్స్ ఒకచే. వాటన్నిటిని పట్టించుకోకుండా హాయిగా సినిమాలు చూడటం- మంచి నావల్స్ చదువుకోవటం- రేడియో సిలోన్‌లో పాటలు వినటం- మనమీద ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రుల్ని మరచిపోవడం- దట్సాల్. అంతకంటే మనమేమీ చేయలేము. అదే మనమిప్పుడు చేస్తున్నాం'-వేణు

'అబ్బబ్బ! ఇదంతా వింటుంటే నిజంగా పిచ్చెక్కుతున్నది. మనం ఇంకో పని ఎందుకు చేయకూడదు? వై నాట్ వియ్ గెట్ అవుట్ ఆఫ్ దిస్ బ్లడీ క్యాంపస్' -రవి.

'వెళ్లిపోయి ఏంచేద్దామని'-నిధి.

'సమ్ బ్లడీ జాబ్. కనీసం బి. ఏ. ప్యాసయ్యాముగదా ఏదైనా ఉద్యోగం దొరకదా? ఏ స్కూల్ మాస్టర్‌గానో, ఎల్. డి. సీ. గానో ఉంటూ మనవాళ్లని ఆదుకోవటం న్యాయం కాదంటావా? ఎం.ఏ చదువుతున్నామని పోజులుకొడ్తూ మనవాళ్ళల్లో యింకా ఆశలు పెంచటంకంటె ఇది బెటర్ కాదా' రవి.

'అబ్బ! స్కూల్ మాస్టర్‌గానో, ఎల్. డి. సీ. గానో మారిపోవడమా? అప్పుడే.... అప్పుడే. మనని ఆ స్థితికి దిగజార్చుకోవాలా? ఒక్కసారి ఎల్. డి. సీ గా మారామంటే ఇక జీవితంలో మళ్లీ కోలుకోలేము. పోయినసారి సమ్మర్‌లో పూరికే వుండటం దేనికని ఒక రెండు నెలలు ఎల్. డి. సి.గా చేశాను. ప్రపంచంలో ఏమన్నా కావచ్చు కాని ఎల్ డి.సి మాత్రం కాకూడదు. స్వాతంత్ర్యాన్ని, ఆత్మాభిమానాన్ని, జీవించాలనే కాంక్షని పూర్తిగా చంపుకోవాలి. వాట్ ఎ డిగ్రిడేషన్? వాట్ యన్ అట్టర్ డిమోరలైజేషన్. మనిషి మానవత్వం అనే విలువలు పూర్తిగా నాశనమైపోతా యక్కడ. మనిషికి ఒక ఇన్‌సిగ్నిఫికంట్ ఇన్‌సెక్ట్‌కి భేదం లేదక్కడ. యు విల్ బి

ట్రీటెడ్ లైక్ ఎ ఫైల్, నాట్ యాజ్ ఎ మ్యాన్. నీ పేరుకూడా బి వన్ అనో బి టూ అనో మారిపోతుంది. అదో నైట్ మేర్. ఆ షాక్ నుండి నేనింకా కోలుకోలేదు'-నిధి

'మరి ఏంచేద్దామంటారు. హాస్టల్లో వుంటూ, డబ్బంతా ఖర్చుపెడ్తూ ఇంత కాలం యిలా మన వాళ్లమీద పారసైట్స్‌గా బతుకుదామా? ఇవన్నీ ఆలోచిస్తుంటే బుర్ర బద్దలౌతుంది. నన్నీమధ్య ఒక ఐడియా హంట్ చేస్తున్నది. నేను మా పేరెంట్స్‌ను మోసంచేస్తున్నాననే భావం. నేను ఖర్చుపెడ్తున్న ప్రతి నయాపైసలో వాళ్ల మెహాలేకన్పిస్తున్నాయి. ఐ యామ్ ఫీలింగ్ టెర్రిబ్లీ గిల్టీ ఏంచేయమంటారునన్ను'-రవి

'నన్నడిగితే నువ్వావిషయాన్ని బాగా ఎక్జాజిరేట్ చేసికొని బాధపడ్తున్నావు. మన పేరెంట్స్ కష్టపడ్తున్నారు. నిజమే. కాని వాళ్లు సుఖపడిందెప్పుడు? కష్టపడటం అన్నది వాళ్ల జీవితవిధానం. ఇటీజ్ ఎ వే ఆఫ్ లైఫ్ విత్ దెమ్. మన తలిదండ్రులు చాలావరకు చిన్నపాటి వ్యవసాయదారులు. వాళ్ల పరిస్థితి బాగుపడాలంటే ఈదేశంలో రాడికల్ సోషియో, ఎకానమిక్ రిఫామ్స్‌రావాలి. అంతేగాని మనం యల్.డి సీ.లుగా మారితేనో, స్కూల్ మాస్టర్లమైతేనో వాళ్లని ఉద్ధరిస్తామనుకోవటం భ్రమ. ఉత్త భ్రమ. మనల్ని మనం తృప్తిపరచుకోవటానికి మనం కల్పించుకుంటున్న ఇల్యూషన్—దట్సాల్'—నిధి.

'నన్నడిగితే మనని మనం తృప్తి పరచుకోడానికి మన గిల్ట్‌ని రేషనలైజ్ చేసికొంటున్నాము వాళ్లు పుట్టినప్పటినుండి కష్టాలు పడ్తున్నారు. నిజమే. కాని వాళ్ల కష్టాల్ని ఎక్కువచేయడానికి మనం కారణం కాదంటావా? వాళ్లు మనకోసం అప్పులు చేస్తున్నారు. విశ్రాంతి తీసికోవాల్సిన వయస్సులోకూడా రాత్రింబవళ్లు మనకోసం కష్టపడి ఏవో పనులు చేస్తున్నారు, ఇలా వాళ్ళ కష్టాల్ని ఎక్కువచేయడానికి మనం కొంతవరకైనా కారణం కాదంటావా?'—రవి

'మనని కన్నారు కాబట్టి వాళ్లు ఆ మాత్రం కష్టపడాల్సిందే. మనని ఈ మాత్రం సుఖపెట్టేబాధ్యత వాళ్ళమీద లేదంటావా? ఎవరికోసం కన్నారు? యౌవనం లోని వాళ్ళ ప్లెజర్‌కోసం- వాళ్ళ నరాల అవసరం తీర్చుకోవడానికి కన్నారు'—నిధి.

'దటీజ్ టూమచ్ నిధీ. ప్లీజ్ డోంటాక్ లైక్‌దట్. ఐ కాంట్ బేరిట్. ఐ కాంట్ బేరిట్'—రవి.

క్యాంటీన్‌నుండి హాస్టలుకు ఎప్పుడో చేరారు. మాటలతో హాస్టల్ బయటే వుండిపోయారు. రమేష్ ఎప్పుడో వెళ్లిపోయాడు. తనూ వెళ్లిపోవాలి. ఇప్పటికే చాలా ఆలస్యంచేశాడు. ఇవ్వాళ పదిన్నరకు క్లాసుందని గుర్నాథంగాడు చెప్పాడు.

'మన కన్వర్‌జేషన్ చాలాదూరం వెళ్లింది. యిక పెడదాంపదండి'—వేణు,

రవి కదిలాడు. ఎవరికోసం కన్నారు? యౌవనంలోని వాళ్ల ప్లెజర్ కోసమా? టూ మచ్— టూ మచ్. అమ్మకు తనమీద అంత ప్రేమ. తనకోసం తన సర్వస్వాన్ని ధారపోసే అమ్మ. తన నందుకోసమేకన్నదా? ఓ! టూ మచ్. నిధి రెచ్చెడ్ ఫెలో. చిన్నప్పుడే నిధి తల్లిని పోగొట్టుకున్నాడట. తండ్రికూడా నిధి నెప్పుడూ ప్రేమగా చూడలేదట. అందుకే అలా మాట్లాడతాడు. తల్లిప్రేమలోని ఔన్నత్యం ఏమిటో అతనికి తెలియదు. పైగా చలం ఐడియాస్ బాగా తలకెక్కాయి. ఎక్కడో చలం కూడా యిలాగే రాసినట్లు జ్ఞాపకం. చలం.... చలం.... చలం రాసిన ప్రతి వాక్యం సత్యమని నమ్మిన తను— యేమైంది తనకివ్వాళ. తను యింతకాలం జీవించిన జీవిత మంతా ఉత్త యిల్యూషన్‌గా తేలిపోతున్న దేమిటి? రూమ్ వేపు నడుస్తున్నారు. మళ్లా ట్యూబ్‌లైట్లు ఎవరో వేశారు. స్విచ్ ఆఫ్ చేశాడు. రూమ్ నెంబర్ 10.... 9... 8.... 6 తన రూమ్ నెంబర్ 4 కి వస్తున్నాడు. ఆచారి బయటకొచ్చి రూమ్‌కి తాళం వేస్తు న్నాడు. ఆచారి రూమ్‌కి తాళం వేస్తున్నాడంటే సరిగ్గా పదిగంటలైందన్నమాట. నీట్‌గా తయారై కాలేజీకి వెళ్తున్నాడు. అతని ముఖంలో ఎంత ప్రశాంతత. తనకెలావస్తుందా ప్రశాంతత. రూమ్ తాళంతీసాడు, ఐదున్నరికు లేచాడు' ఇంతవరకు ఏంచేశాడు? ఏం చేశాడు? టైమంతా వేస్ట్ చేశాడు. గంటల తరబడి మాటలు. ఏం వొరుగుతుందా మాటలవల్ల? కుర్చీమీద కూర్చున్నాడు. ఇప్పుడేంచేయాలి తను. పదిన్నరకేదో క్లాసుందన్నాడు గుర్నాథంగాడు. వెళ్ళటమా! టేబిల్‌మీదున్న గడియారంకేసిచూశాడు. రెండు నిమిషాలు తక్కువ పడి. ఇప్పుడింక క్లాసేం అందుతుంది? 'కాగజ్‌కేఫూల్' మార్నింగ్ షొ ఎప్పుడో! బహుశః పన్నెండింటికయ్యుంటుంది. వెడితే బావుండేది. ఇట్స్ యే గ్రేట్ పిక్చర్. కాని డబ్బు.... డబ్బు .. డబ్బు....అమ్మ నాన్న పంపించే డబ్బుల్ని మంచినీళ్ళలా ఖర్చుచేసాడు. మెస్‌బిల్... మూడునెలల మెస్‌బిల్ ఎలాకట్టాలి? ఖాన్‌గాడు ఎంత దురుసుగా మాట్లాడాడు. మెస్‌బిల్ కట్టకపోతే తనకి హాల్‌టికట్ రాదు. హాల్‌టికట్ లేకుండా పరీక్షలేదు. పరీక్ష! చలపతిగాడితో పోటీ చేయాలనుకున్నాడు, వాడిని బీట్ చేయాలనుకున్నాడు కాని చలపతిగాడితో తను పోటీచేయగలడా? డబ్బున్న వాడు. రోజూ కారుతో— నలగని తళతళ మెరిసే టర్లిన్ సూట్లతో వచ్చే చలపతి. ఆ సూట్లతో ప్రొఫెసర్ కళ్లు మిరుమిట్లుగొలిపే చలపతి. వాడితో తను పోట్లాడగలడా? బట్టలైనా సరిగాలేని తను— మెస్‌బిల్ కట్టలేని తను చలపతిగాడిముందు నిలువగలడా? నిలిచి ఫైట్ చేయగలడా? పీపుల్ ఫైటింగ్ ఇన్ మెకాంగ్ డెల్టా— దే ఆర్ మై పీపుల్— యస్— వియత్కాంగ్ గెరిల్లా ఎలా పోట్లాడుతున్నాడు అమెరికన్స్‌తో? ... అమెరికా.... ప్రపంచంలోకెల్లా శక్తివంతమైన అమెరికాతో— వియత్కాంగ్ గొరిల్లా— ఆసియా

దేశస్థుడు. పేదవాడు.... ఏ ఆయుధాలు లేనివాడు. కేవలం 'విల్‌పవర్', తన స్వాతంత్ర్యాన్ని రక్షించుకోవాలనే విల్‌పవర్‌తో వియత్నాంగ్ గెరిల్లా మైటీయెస్టుఫోర్స్ ఆన్ ఎర్త్‌తో పోట్లాడుతున్నాడు. తనకెందుకులేదు ఆ విల్ పవర్? చలపతితో తనెందుకు పోట్లాడలేడు? వియత్కాంగ్ గొరిల్లా. హ్యాట్స్ ఆఫ్ టు యు. స్వాతంత్ర్యాన్ని రక్షించుకోవాలనే స్ట్రాంగ్ విల్‌పవర్ ముందు ప్రపంచంలోని ఎంత శక్తివంతమైన ఫోర్స్‌కూడా నిలువలేదనే గొప్ప సత్యానికి సింబల్– వియత్కాంగ్ గొరిల్లా. ఒక్క వియత్నాంగ్ గొరిల్లా విల్‌పవర్‌లో తనకి శతాంశమైనా వుంటే తను చలపతితో పోటీచేసేవాడు కాదా? విల్‌పవర్– ఎలా వస్తుందా విల్‌పవర్. ఎవరుకల్గిస్తారు తనలో ఆ విల్‌పవర్? యే ఐడియల్ కల్గిస్తుంది తనలో ఆ విల్‌పవర్? లాభంలేదు. మళ్లా ఏదో ఆలోచిస్తున్నాను. టైమంతా వేస్టు చేస్తున్నాను. కమాన్? చదవాలి. ఇంత సేపు చేతిలోవున్న తాళాన్ని టేబుల్ మీద పెడ్తూ తను ఇంత సేపు దానితో చేసిన పనిని జ్ఞాపకం చేసికున్నాడు. తాళాన్ని వేశాడు. తీశాడు– వేశాడు- తీశాడు– వేశాడు- తీశాడు. ఇలా ఎందుకు చేశాడు తను? ఉత్త అర్థంలేని పనేనా అది? లేక దానికేమైనా అర్థం వుందా? ఏం చెయ్యాలిప్పుడు తను. ఏం చెయ్యాలి? క్లాసుకి ఎలాగు టైమైపోయింది. కూర్చుని చదువుకోవటమా? టెక్స్టుబుక్స్ హారిబుల్. ఒక్క వాక్యంకూడా చదువలేడిప్పుడు. ఏం చెయ్యాలి ఇప్పుడు మరి. కాగజ్‌కే ఫూల్‌కి వెడితే. నిజంగా రెండు మూడుగంటలు హాయిగా గడుస్తాయి. కాని డబ్బు ... డబ్బు.... మెస్‌బిల్ .... మెస్‌బిల్ కట్టకపోతే ఇవాళ్టినుండి తిండి వుండదు. ఆ విషయం మరచే పోయాడు. తిండి వుండదు. ఏం తింటాడు? ఎక్కడ తింటాడు! ఆకలి.... ఆకలి. ఆకలితో అలమటించి చచ్చిపోతాడు. అంతేనా? హోటలుకెళ్లి తిందామంటే డబ్బేది? డబ్బు .. డబ్బు.... తనదగ్గర డబ్బు ఎప్పుడూ ఉండదు. ఇంటినుండి డబ్బొచ్చిన మరుక్షణంలో అయిపోతుంది. డబ్బు రావటంతోటే సినిమాలకి, హోటళ్ళకి ... యింకా ఏవేవో కొంటాడు. కాస్ట్లీగూడ్స్. కాస్ట్లీ టూత్‌పేస్ట్స్. కాస్ట్లీ పౌడర్స్. ఎందుకు తనకి. తను పేదవాడు. ఈనాటి నుండి తను పేదవాడిలా జీవిస్తాడు. వెర్రిగా తనచుట్టూ వున్నవాళ్ళని అనుకరించబోయాడు. డర్టీ ఫెలోస్. ఈ హాస్టల్లో ప్రతివాడూ లక్షాధికారుల్లాగ పోజుకొట్టేవాళ్లే. వకడ్నిచూసి వకడు. కాస్ట్లీ థింగ్స్ కొనడంపట్ల పోజ్. 'నేను పియర్స్ తప్ప మరే సోపు వాడను.' 'నేను సింథాల్‌తప్ప మరేసోపు వాడను.' 'నేను 7° క్లాక్ బ్లేడు లేకపోతే షేవ్ చేసికోవడమే మానేస్తాను.' నేను 'క్యూటికూర' పౌడర్ ఎప్పుడూ వాడతాను. 'నేను ష్యాషన్స్‌లోతప్ప మరోచోట బట్టలు వేయను,' 'నేను సిటీకెళ్తే 'క్వాలిటీ' లోతప్ప మరోచోట కాఫీ తాగను.' 'ఫస్టుక్లాసు రిజర్వుడులో కూర్చుని చూస్తేనే నాకు సినిమా చూసినట్లుంటుంది' 'టెర్లిన్ బట్టలుతప్ప కాటన్ తొడగను' హారిబుల్ ఫెలోస్,

'స్నాబిష్ ఫెలోస్.' 'వైన్ గ్లోరియస్ ఫెలోస్.' ప్రతివాడు తననితాను మోసగించుకునే వాడే. ప్రతివాడు తనకంటె అధికుణ్ణి అనుకరించబోయేవాడే. తనూ చేరిపోయాడు. ఎలా? ఎలా? ఎలా? ఈ ప్రపంచంనుండి ఎలా బయటపడాలి? ఈ విషవలయంనుంచి ఈ విషియస్ సర్కిల్‌నుండి ఎలా బయటపడాలి. చదవాలి. రాత్రింబవళ్లు చదవాలి. చదివితే తప్పకుండా తనకి ఫస్ట్‌క్లాసు వస్తుంది. తనకు నమ్మకంఉంది. కాని ప్రొఫెసర్ తనకి ఫస్ట్‌క్లాసు యిస్తాడా? ప్రొఫెసర్‌కి తను తెలియనే తెలియదు. తను బ్రాహ్మణుడు కాడు. తనకి డబ్బులేదు. హోదాలేదు. తను కార్లలో కాలేజీకి వెళ్ళటంలేదు. తన కెవడిస్తాడు ఫస్ట్‌క్లాసు? హారిబుల్. అది యూనివర్సిటీకాదు నరకం. అక్కడున్న వాళ్ళంతా యములు. ప్రతివాడు ఎవడి రక్తం తాగుదామాఅని ఆలోచించేవాడే. తన జేబులు ఎలా నింపుకుందామా అని ఆలోచించేవాడే. వాళ్లు ఈ దేశానికి మోరల్ అండ్ ఇంటలెక్చువల్ లీడ్ ఇచ్చేవాళ్ళు. ఎలా? ఎలా? వీళ్ళల్లో తనూ చేరిపోవాలా? వీళ్ళ లాగ తనూ కాకాలకీ, ఫోజులకీ, నటనలకీ అలవాటుపడాలా? యేంచేయాలితను? ఏం చేయాలి తను? బుర్ర బద్దలయ్యేట్టుంది. ఎలా? ఎలా? ఈ పద్మవ్యూహంనుండి ఎలా బయటపడాలి? అసలు ఇవన్నీ వదిలేసి తనఊరికి వెళ్లిపోతే.... నాన్నకి వ్యవసాయంలో సహాయపడితే.... పల్లెటూర్లో.... వ్యవసాయమా? ఉన్న రెండెకరాలతో తరతరాలుగా కుస్తీపడుతున్నారు. అమ్మా నాన్నా. అప్పుల్లో మునిగి తేలుతున్నారు. వాళ్ళ రక్తాన్ని తాగుతున్నాడు ఆవూరి షావుకారు. పైగా ఈమధ్య తన ఊర్లో రాజకీయాలు. ప్రతి వాడు నాయకుడే. ప్రతివాడు పేదరైతుని బెదిరించేవాడే. ప్రతివాడు ఎదుటి వాడిని దోచుకోవాలనుకునేవాడే. ఈ రోజుల్లో పల్లెటూర్లు ... ఎలక్షన్లు- కల్లు సారాలు- పోట్లా టలు- తలకాయలు- ఎగిరిపోవడాలు, పంచాయితీ మెంబరు కావటానికి ఎన్ని ఎత్తులు- ఎన్ని కుట్రలు. ఎంత కుళ్ళు ప్రతివాడిలో- ఆ వాతావరణంలో తను యిమడగలడా? తనూ వో ఛోటా నాయకుడు కావాలి. తనూ ఓ పార్టీని తయారుచేయాలి, తనూ ఓ గ్రూప్‌ని కూడగట్టుకోవాలి. ప్రాణాలు తీయాలి ప్రాణాలు పోగొట్టుకోవాలి, చెయ్య గలడా ఆ పని? ఆ వాతావరణంలో యిమడగలడా? లేదు. లే ... తనాపని చేయలేడు. తను ఎందుకూ పనికిరాడు. ఇటు యూనివర్సిటీలోను, అటు పల్లెటూరులోను అసలు తనేం చేయాలి? ఎందుకు జీవించాలి? అమ్మ ... అమ్మ ... రాత్రి కలలో అమ్మచిత్రం. ఈ కల ఎంతకూ జ్ఞాపకంరాలేదు. ఇప్పుడు ఏ ప్రయత్నంలేకుండానే జ్ఞాపకంవచ్చింది. కలలో అమ్మ- తనకేసి జాలిగాచూసే అమ్మ. తను కొట్టుకుపోతున్నాడు. నీళ్ళల్లోపడి- క్కడో అడవిలోపడి— చెట్లమధ్య— గుట్టల మధ్య— కొండచిలువల మధ్య— పాముల మధ్య— తేళ్లమధ్యపడి కొట్టుకుపోతున్నాడు. ఆ క్షణంలో అమ్మ. చాల చిత్రమైనకల. అమ్మ తనతో మాట్లాడదు. అమ్మ- అమ్మ... అమ్మ ప్రేమంతా ఉత్తదే? యౌవన

లోని ప్లెజర్ కోసమే. నరాల అవసరం తీర్చుకోవటానికేనా తనను కన్నది? హారిబుల్ భరించలేడు! టార్చర్! ఈ చిత్రహింసని భరించలేడు. పారిపోవాలి ఎక్కడికైనా పారిపోవాలి. లేదా ఎండ్రిన్ అయినా, ఎలుకల మందైనా తాగాలి! ఔను తను చస్తే ఏమౌతుంది ఈ హాస్టల్‌వాళ్ళు డైనింగ్‌హాల్‌కి వెళ్ళి కడుపునిండా మేయడంమానేస్తారా? సినిమాలకి వెళ్లడం మానేస్తారా? రేపు యూనివర్సిటీకి సెలవిస్తారా? కండోలెన్స్ మీటింగ్ పెట్టి రెండు నిముషాలు నిశ్శబ్దంగా నిల్చుంటారా? తననుగురించి ఎవరేమను కుంటారో?

"పూర్ ఫెలో. చచ్చాడా?" అంటుంది కాటోలు నళిని..... ఎంత గర్వం! తను అందంగా ఉంటుందని, యూనివర్సిటీ అంతా తనముందు మోకరిల్లుతుందని ... వెంటుకలు నెరుస్తున్నా తనకేసి ప్రొఫెసర్ ఆశగా చూస్తాడని...

"హూ ఈజ్ రవి. ఐ నెవర్ న్యూ హిమ్ ఎటాల్. పూర్ ఫెలో" అంటాడేమో 'ప్రొఫెసర్' స్టైలిష్‌గా

"రవి డైడ్? వెల్‌డన్. ది ఫెలో నెవర్ రికగ్నైజ్డ్ మి యాజ్ ది మోస్ట్ బ్రిలియంట్ స్టూడెంట్ ఆఫ్ ది క్లాస్. ది ఫెలో వాజ్ ఎర్రొగాంట్ అండ్ స్టబ్బర్న్" అంటాడు చలపతిగాడు.

వెధవకి తెలుగొచ్చినా తెలుగు మాట్లాడడు

కిరణ్మయి . కిరణ్మయి ఏమంటుందో? రవి చనిపోయాడా? వో ఐకాంట్ బిలీవ్. ఐ కాంట్ బిలీవిట్ అంటుందా? పాపం వేణు- వేణు తను చనిపోతే ఏమంటాడో.... 'దొంగలంజ కొడుకులవలే మెసలే ధూర్త లోకంలో నిలబడజాలక తల వంచుకు వెళ్లిపోయావా నేస్తం!' అంటాడా? రవి కళ్ళల్లో కన్నీళ్ళు గిర్రున తిరిగాయి. కాని అమ్మ.... అమ్మ ఏమంటుంది? తను లేని అమ్మ ... గుండెపగిలి చచ్చిపోదూ? తనని తన రెండుకళ్ళుగా చూసికొంటున్న అమ్మ.... లేదు.... లేదు. తను చనిపోవటానికి వీల్లేదు. తను బతికి తీరుతాడు. అమ్మకోసం తను చావడు. చావకూడదు. ఇదేమిటి? ఇవ్వాళ్ళ తనింత పిరికివాడుగా మారిపోతున్నాడు. టైమ్ .. టైమ్ .. టైమ్ నడవదు. ఏం చెయ్యాలి. గడియారముకేసి చూశాడు. 10-15. ఇంతసేపూ 15 నిముషాలేనా? లేచి స్నానంచేస్తే. యస్! స్నానంచేసి లైబ్రరీకెళ్ళి చదువుకుంటే-లైబ్రరీలో చాలా కామ్‌గా ఉంటుంది? చదువుకోవచ్చు. ఒక రెండుగంటలు చదువుకొని డైనింగ్ హాలు టైమ్‌వరకు రావచ్చు. డైనింగ్‌హాలేమిటి? ఈరోజునుండి తనకక్కడ స్థానం లేదు. మరిచే పోతున్నాడు. ఇవ్వాళ తిండి ... తిండెలా? ఇంకాస్సేపైతే కడుపులో పాములు- తేళ్ళు పడగెత్తుతాయి ఏం చేయాలి? ఆకలినుండి ఎలా తప్పించుకోవాలి? తలుపు చప్పుడు ... బయటెవరో తలుపు కొడ్తున్నారు. 'యస్ కమిన్'అన్నాడు.

తలుపు తీసికొని వేణు వచ్చాడు.

"ఏం చేస్తున్నావు"—వేణు.

"ఏమీలేదు. ఉరిపోసుకొని చనిపోవటమా? సముద్రంలో పడిపోవడమా? అని ఆలోచిస్తున్నాను. అఫ్‌కోర్స్ ఈ ఊళ్లో సముద్రం లేదనుకో."రవి తేలిగ్గా నవ్వటానికి ప్రయత్నిస్తూ ....

"అంతవరకొచ్చిందా! సమస్యల్ని కొంచెం ఎక్జాజిరేట్ చేసికోవటం అలవాటయిందనిపిస్తుంది మనకి. నిజం ఏమిటో తెలిసికోలేక పోతున్నాం. మన మనస్సు కల్పించుకొన్న ఊహా ప్రపంచంలోతప్ప జీవించలేకపోతున్నాము. దట్ ఎక్స్‌ప్లేన్స్ అవర్ ట్రాజిడీ అనుకుంటాను"—వేణు.

"ఏది ఊహా ప్రపంచమో.... యేది నిజమైన ప్రపంచమో తెలిసికోవటం ఎలా? ఈ సినిమా డైలాగులకేమిగాని, ఇవ్వాళ కాలేజీ లేదు? వెళ్ళలేదు?"—రవి.

"కాలేజి ఎందుకు లేదు? టైం అయిపోయిందని వెళ్ళలేదు. రూమ్‌లో కూర్చొని చదువుదామనుకున్నాను. ఇంతసేపు ఆ ప్రయత్నమే చేశాను. కాని ఒక్క వాక్యంకూడా చదువలేక పోయాను. ఈ రెస్ట్‌లెస్‌నెస్ మనని ఎలా పీడుతుందో అర్థం కావడంలేదు"—వేణు

ఇద్దరూ కాస్సేపు నిశ్శబ్దం. సరిగ్గా తాను ఏస్థితిలో వున్నాడో వేణుకూడా అలాంటి స్థితిలోనే ఉన్నాడనిపించింది. ఎందుకో ఒక్కసారి వేణుని తన హృదయానికి హత్తుకోవాలనిపించింది. గొంతు నెమ్మదిగా పూడుకుపోతుంది. గుండె గొంతుకలోన కొట్లాడే క్షణమది....

"పోనీ పిక్చర్‌కి వెళ్ళకూడదూ. కాగజ్‌కే ఫూల్.... కడుపునిండా ఏడ్చేసి రావచ్చు వెడదామా?"—వేణు

"కమాన్.... వెళదాం. ఈరూంలో ఇంకాస్సేపుకూర్చుంటే పిచ్చాసుపత్రికి వెళ్లాల్సిన గతి పట్టేట్టుంది. కాని డబ్బుమాట. కనీసం ఐదురూపాయలైనా కావాలికద"—రవి.

'మనదగ్గర అవసరమొస్తే అమ్మడానికైనా కొన్ని విలువైన వస్తువులు లేవు. రింగో- రిస్టువాచో— యిల్లాంటివి. సాగర్‌ని అడుగుదామా? రెండు మూడు రోజుల కిందట అతనికి ఎం.ఓ వచ్చినట్లు గుర్తు. ఉంటే తప్పకుండా యిస్తాడు. పద!'—వేణు

వేణు లేచాడు. రవి లేచాడు. రవి రూమ్‌కి తాళంవేశాడు. సాగర్ రూం నెంబరు 68లో ఉంటాడు. అప్‌స్టేర్స్... మెట్లెక్కి పోవాలి ఇద్దరూ నిశ్శబ్దంగా....

సాగర్ డబ్బిస్తే బావుండును. ఈ నరకంనుండి కొంతకాలం పారిపోవచ్చు. సాగర్ వుంటే తప్పకుండా ఇస్తాడు. వేణు అన్నా, తనన్నా కొంత గౌరవంవుంది. ఉత్త అమాయకులని, యేవో పిచ్చి ఆదర్శాలుకల వాళ్ళని.... అది గౌరవంకంటే ఎక్కువ జాలి. హాస్టలంతా నిశ్శబ్దంగా ఉంది. ఎక్కడో దూరంగా ట్రాన్సిస్టర్ మోగుతున్న చప్పుడు. గోడలకున్న ఎలక్ట్రిక్ స్విచ్‌లమీద తన ప్రమేయంలేకుండానే తన చేతులు పడటం— స్విచ్‌ని ఆన్‌చేయటం— ఆఫ్‌చేయటం— ఆన్‌చేయటం— ఆఫ్‌చేయటం—గమనిస్తూనేవున్నాడు. వేణు యిదేమీ చూడటంలేదు. ఏదో దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు. పూర్ వేణు- సరిగ్గా తనలాంటివాడే వేణుకూడా. సాగర్ రూమ్‌ని సమీపించాడు. రూం లోపలనుండి పెద్ద నవ్వులు- కేరింతలు విన్పిస్తున్నాయి. చాలామంది వున్నట్లున్నారు. అంతమంది మధ్య ఏంబావుంటుంది. తలుపులు తీసేవున్నాయి.

'హల్లో కమాన్ వేణు' అంటున్నాడు సాగర్,

ఐదారుగురు కూర్చొని పేకాడుతున్నారు. ఆ ఐదారుగుర్లో రంగారెడ్డి, శ్రీశైలం ఉండటం చాలా ఆశ్చర్యపరచింది. ప్లేయర్స్ సిగరెట్ ముట్టిస్తూ, ముక్కల్ని కలుపుతున్న రంగారెడ్డి....

'హలో కామ్రేడ్స్, గుడ్ మార్నింగ్' అన్నాడు. అతని కంఠంలోని హేళన కొట్టవచ్చినట్టు కన్పించింది. తనని, వేణుని ఎప్పుడు కన్పించినా 'కామ్రేడ్స్' అని పిలవటం అతనికి అలవాటే. పేకాడుతున్న ఆ ఐదారుగురిముందు డబ్బుకుప్పలు కుప్పలుగా పడివుంది. అందులోనుండి వెంటనే ఓ పదిరూపాయల నోటు దొంగిలించి పారిపోతే! వారికి ఒక పదిరూపాయలనోటు లెక్కా? ముఖ్యంగా రంగారెడ్డికి. డబ్బు మంచినీళ్ళలా ఖర్చుపెట్టేస్తాడు. శ్రీశైలం రంగారెడ్డికి నమ్మినబంటు. వాళ్లిద్దరికి ఈ హాస్టల్లోను, మొత్తం యూనివర్సిటి కాంపస్‌లోను ఎదురులేదు. అంగబలం, ఆర్థిక బలం చేతినిండా వున్నవాళ్ళు. సాగర్‌కీ రెడ్డి అంటే అభిమానం. రెడ్డిలాగ అగ్రెసివ్‌గా వుంటేనే లోకంలో బతుకగలం అనే నమ్మకం అతనిలో ఏర్పడింది,

'కమాన్ కూర్చోండి' అన్నాడు సాగర్, తను కూర్చున్న కుర్చీమీదినుంచి లేచి మంచం మీద కూర్చుంటూ... వేణు రవి కూర్చున్నారు.

(సశేషం)

[యీ నవల పూర్తిగా పుస్తకరూపంలో త్వరలో వెలువడుతుంది. సం॥]

సమీక్ష: | మొట్టమొదటి కన్యాశుల్కము

కొడవటిగంటి కుటుంబరావు

ఈ పుస్తకంలో ఎన్ని లోపాలున్నా దీన్ని నేను ప్రశంసనీయమైన ప్రచురణగా భావిస్తున్నాను. మహనీయుడు గురజాడ అప్పారావు రచించిన అపూర్వనాటకం అనేక కారణాలవల్ల ఈ కాలపు విద్యావంతుల స్మృతిపథంలోకి రాకుండా పోయినంతపని జరిగింది. దాన్ని అమూల్యమైన రత్నంగా పరిగణించేవారి సంఖ్య రానురాను తగ్గిపోతూ వచ్చింది. అందులోనూ కన్యాశుల్కం తొలి ముద్రణ బొత్తిగా మందులోకి రాకుండా పోయింది. కిందటి శతాబ్దంలో అచ్చయిన ఆ రచనను సంపాదించి ప్రచురించినఘనత బంగోరె (బండి గోపాలరెడ్డి) గారికీ, ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రికకూ దక్కింది. బంగోరె కృషి విపుల వ్యాఖ్యాన వివరణ సహితమైన గ్రంథంగా వెలువడటం మరింత ప్రశంసనీయం. ఈ కృషికి ప్రేరేపకులు కె. వి. రమణారెడ్డీ, పర్యవేక్షకులు ఆరుద్రా.

న్యాయానికి ఈకృషి అంతా కన్యాశుల్కం రెండవముద్రణపైన జరగవలసింది. ఎమెస్కోవారి దయవల్ల రెండవ కన్యాశుల్కం— ప్రపంచానికి ఇదే అసలైన కన్యాశుల్కం— అందరికీ లభ్యంగా ఉన్నది గనకనూ, ఈ కృషితో మొదటి కన్యాశుల్కం పునరుజ్జీవిత మవుతున్నది గనకనూ, ఇందులో రెండు కన్యాశుల్కాలకు సంబంధించిన అనేక విషయాలు విశదపరిచి ఉన్నాయిగనకనూ ఈ పుస్తకం అమూల్యమనిపించుకోదగి ఉన్నది.

ఇందులో గురజాడ రెండు కన్యాశుల్కాలకూరాసిన ఇంగ్లీషు ఉపోద్ఘాతాలున్నాయి. ఈ ఉపోద్ఘాతాలవల్ల మనకు రచయిత ఆశయామా, దృక్పథమూ తెలుస్తున్నాయి.

విజయనగరం మహారాజా (ఆనందగజపతి) గారు విశాఖ జిల్లాలో లెక్కలు తీయించగా.(1890కి పూర్వంకావాలి)మూడేళ్ల కాలంలో బ్రాహ్మణులలో 1,034 శుల్క వివాహాలు— సుమారు రోజుకొకటి చొప్పున— జరిగినట్టు తేలింది. ఇవి లెక్కకువచ్చినవి; రానివి ఎన్ని ఉన్నాయోమరి. వీటిలో 188 వివాహాలు అతి బాల్య వివాహాలు. అంటే వధువులు 1 సంవత్సరంనుంచి 5 సంవత్సరాల వయసుగలవాళ్లు. వధువు ధర 350—400 నుంచి ఉన్నది. కడుపులో ఉన్నపిల్లలకుకూడా బేరాలు కుదిరినట్టుతెలుస్తుంది. ఈ పరిస్థితులను దుయ్యబట్టటానికే మొదటి కన్యాశుల్కం పుట్టింది.

ఇది గురజాడవారి సామాజిక ఆశయం. ఆయనను కన్యాశుల్క రచనకు ప్రేరేపించిన సాహిత్యపరమైన ఆశయంకూడా లేకపోలేదు. రెండవ కన్యాశుల్క పీఠికలో ఆయన ఇలా చెప్పాడు: 'తెలుగులో కొత్త సాహిత్యభాషను పెంపొందించడం చర్చల ద్వారా జరిగేదికాదని నేనెరుగుదును. ఒక గొప్ప రచయిత ఆ భాషను రచించి సృష్టించాలి. నేను అతనికి రంగం సిద్ధం చేస్తాను.'

కాని అప్పారావే ఆ గొప్ప రచయిత కావటం జరిగింది. కన్యాశుల్కమే కొత్త సాహిత్యభాషకు ప్రమాణగ్రంథంకూడా అయికూర్చుంది. దానిని ఆరుద్ర, 'ఆధునిక కావ్యాలలో అనన్యం, అనితరసాధ్యం' అన్నాడు.

ఈ పుస్తకానికి ఆరుద్ర 'అభిఘారము', 'మధురవాణిపాత్ర: ఒక పరిశీలన-ఒక పరిశోధన', 'పునఃపరిశీలన: పునఃపరిశోధన' చేర్చారు. కె. వి. రమణారెడ్డి 'ఒకటి రెండు మాటలు' జతపరిచారు. తరువాత బంగోరె 'ముందుమాటలు' ఉన్నాయి.

ఈ వ్యాసాలలో అనేకవిషయాలు క్షుణ్ణంగా చర్చించబడ్డాయి. రెండు కన్యాశుల్కాలకూగల తేడాలు; తొలికూర్పు రచనాకాలం; మొదటి కన్యాశుల్కం మొదటిసారి ప్రచురించినతేదీ; కన్యాశుల్కానికీ వీరేశలింగం పంతులుగారి బ్రాహ్మ వివాహానికీగల పోలికలు, ఇత్యాది.

ఆరుద్రచేసిన మధురవాణి పాత్ర పరిశీలన చాలా సమర్థవంతంగా వున్నది. ఇది 1956 జనవరిలో 'పరిశోధన'లో ప్రచురితమైన వ్యాసం. మధురవాణి పాత్ర అంటే రెండో కన్యాశుల్కంలోని పాత్రేనని వేరే చెప్పనవసరంలేదు. మొదటి మధురవాణిని గురించి అప్పారావే, 'వర్ణించలేని హేయమైన నడవడికగలది. ఆ పాత్రకు ఎట్టి వన్నెలూ చిన్నెలూ లేవు. నాటకం రచిస్తున్నకొద్దీ మధురవాణి పాత్రపట్ల నాకున్న దృక్పథం మారుతూ వచ్చిందని చెప్పక తప్పదు.' రెండో మధురవాణిగురించి ఆరుద్ర అభిప్రాయం: 'అనన్యసాధ్యమైన అతి సజీవ, అద్భుతపాత్ర.... ఆంధ్రసాహిత్యంలో ఆచంద్రార్కం నిలవగలది.

మొదటి కన్యాశుల్కం రచించిన అనంతరం అప్పారావు మరిరెండు వేశ్యపాత్రలను సృష్టించాడు—'కొండుభట్టీయం'లో మంజువాణి, 'స్టాపింగ్ టు రేజ్'అనేఇంగ్లీషు కథలో సరళా. ఈ పాత్రలు మధురవాణియొక్క పరిణామ దశలనీ: రెండో కన్యాశుల్కంనాటికి ఈ పరిణతి పరిపూర్ణమయిందనీ ఆరుద్ర అంటారు. సరళకూ మధురవాణికీ, రంగనాథయ్యరుకూ, సౌజన్యారావు పంతులుకూ గల సామ్యాలను ఆరుద్ర వివరించారు.

(ఒక్క చిన్న విషయంలో మాత్రం నేను ఆరుద్రగారితో ఏకీభవించలేకుండా ఉన్నాను. మధురవాణి రామప్పంతుల్నీ, గిరీశాన్నీ ముట్టుకోనివ్వకపోవటంలో ఆరుద్ర 'నీతి' చూశారు. నాకది కనిపించటంలేదు. మధురవాణిలో లేకితనంలేదు. రామప్పంతులు సొమ్మిచ్చినదాక అతన్ని తాకనివ్వదు; గిరీశంతో తెగతెంపులు చేసుకున్నదాకా తాను పరాధీనురాలనేనని ఎత్తు వేస్తుంది. రామప్పంతులు మంచంకింద ఉండగా గిరీశాన్ని తాకనివ్వకపోవటం సహజమేగదా. తనకు డబ్బుముట్టి, గిరీశం ఉడాయించాక ఆ మధురవాణే రామప్పంతుల్ని కావిలించుకుని, తల ముద్దుపెట్టుకుంటుంది. గిరీశంతో తెగతెంపులూ లేవు, ఏమీలేదు.)

పునఃపరిశీలన వ్యాసంలో ఆరుద్ర, అప్పారావు జీవితంలో మధురవాణిపాత్ర సృష్టికిగల బీజాలు వివరించారు. ఆనందగజపతి ఉంచుకున్న రామస్వామి(రామతిలకం) అన్న వేశ్య యోగక్షేమాలు అప్పారావే చూసేవాడు. ఆమెను గురించి తన డైరీలలో కూడా రాసుకున్నాడు తాను మూడు నాలుగుసార్లు ఇద్దరు సానివాళ్ల ఇళ్లకు వెళ్లాననీ, వారితో చర్చించాననీ, అందులో ఒకతె తనను వాదంలో ఓడించ యత్నించిందనీ (మధురవాణి సౌజన్యారావునులాగ) అప్పారావు అన్నాడట.

రెండవ మధురవాణి పాత్ర సృష్టిగురించి నేనొక 'వైల్డ్ గెస్ చేశాను.' రెండవ మధురవాణిపాత్ర అప్పారావు మెదడులో మొదటినుంచీ వున్నదనే నా అనుమానం. మొదటి మధురవాణి ఆ పాత్ర కానేకాదు. 1897 జనవరిలో మొదటి కన్యాశుల్కం అచ్చయింది. దాన్ని 1892 లోనే ఆ రూపంలో ఆడారు. ఆ అయిదేళ్ల కాలంలోనూ నాటకం మారినట్టులేదు. 1897 మే నెలలో ఆనందగజపతి పరమపదించాడు. అప్పారావు తలలోవున్న అసలు మధురవాణి మంజువాణిగానూ, సరళగానూ రిహార్స్ చేసుకుని 1909 నాటికి రెండో కన్యాశుల్కంలో అవతరించింది. మంజువాణి, సరళపాత్రలు రెండూ ఆనందగజపతి నిర్యాణంతరువాత సృష్టిఅయినవే. ఇందులో ఏదన్నా రహస్యం ఉందా? పరిశోధకులు చూడవచ్చు.

కె.వి. రమణారెడ్డి, మొదటి కన్యాశుల్కం ప్రతికోసం బంగోరె నాలుగైదు సంవత్సరాలు పడినపాట్లగురించి చెప్పి, ఈ పుస్తకాన్ని తొందరపడి, అసమగ్రంగా అచ్చువేసారంటున్నారు. బంగోరె కృషి అసమగ్రమేకాదు, అక్కడక్కడా దోషాలతో కూడుకునికూడా ఉన్నది. కాని బంగోరెను నేను అధిక్షేపించలేను. నాలుగైదేళ్లు శ్రమించినవాడు తన శ్రమసఫలంకావాలని తొందరపడటం అస్వాభావికం కాదు. అదీగాక ఈయనకృషితో కన్యాశుల్కంగురించినపని ముగుస్తుందని ఎన్నడూ అనుకోలేదు. అనంతంగా జరగవలసిన కృషిలోని మొదటిమెట్లలో ఇది ఒకటి అనే అతని నమ్మకం.

బంగోరె ఫిబ్రివరిలో కాటోలు నాదగ్గరికి వచ్చి తనకు తెలియని పది పన్నెండు అంశా లకున్న వివరాలు అడిగాడు. నేను ఒక్కదానికీ సమాధానం యివ్వలేక పోయినాను. అందులో కొన్నిటికి వివరాలు ఇతరులనుంచి సంపాదించి నెలతిరగకుండా ఈ పుస్తకాన్ని వెలువరించాడు. దీన్నిబట్టే బంగోరె యెంత చురుకుగా పనిచేసినదీ తెలుసుకోవచ్చు. ఈ పుస్తకంలో వెయ్యి అవకతవకలున్నా నేను బంగోరె కృషినిగురించి తేలికగామాట్లాడ లేను. కన్యాశుల్కం తరిగేదీ, అరిగేదీ కాదు. ఇలాటి పుస్తకాలు యింకా వంద రానివ్వండి బంగోరె చేసిన పొరపాట్లను యితరులు సరిచేయవచ్చు; ఇతరులు చూపి నట్టయితే బంగోరెయే సవరించుకుంటాడేమో.

'ముందుమాటలు' లో బంగోరె తాను పడిన శ్రిమ వివరిస్తూ అనేక విషయాలు ప్రిస్తావించాడు.

గురజాడ అనేమాటను కొందరు 'గురుజాడ' చేశారు— పుస్తకాన్ని 'పుస్తుకం', అవసరాన్ని 'అవుసరం', కొడవటిగంటిని 'కొడుపటిగంటి' చేసినట్టు.

గురజాడ 21—9—1862న పుట్టినట్టు రుజువు చెయ్యటానికే చాలా శ్రిమపడవలసి వచ్చింది,

మొదటి కన్యాశుల్కం ఏరోజు వెలువడింది? దానికి పీఠికరాసినతేది 1-1-1897. 31-1-1897న దాని కాపీ ఒకటి ఎవరికో బహూకరించబడింది. ఆమధ్య రెండుమూడు రోజులలో అది వెలువడిఉండాలి. 21న అది'పీపుల్స్ ఫ్రెండ్'అనే పత్రికలో సమీక్షించ బడింది. 'తెలుగు హార్ప్' అనే మరొక పత్రిక 26—8—1892 న దాని ప్రదర్శనను సమీక్షించింది.

కన్యాశుల్కాన్ని సమకాలిక ప్రపంచనాటక సాహిత్యంతో పోల్చటానికి బంగోరె ప్రయత్నించాడు ప్రపంచసాహిత్యంమాట ఎట్లావున్నా భారతీయ నాటక సాహిత్యంలో కన్యాశుల్కానికి సరితూగగల నాటకం రాలేదన్నది నిర్వివాదాంశం.

కన్యాశుల్కం కువిమర్శలకూ, సద్విమర్శలకు కూడా గురిఅయింది. అది నాటకంకాదు, ప్రిహసనం అన్నారు. అందులో లేని తప్పులు పట్టారు. ఈ నాటకం మీద శ్రీపాద కామేశ్వరరావుగారు భారతిలో సుదీర్ఘమైన వ్యాసంరాస్తూ, ఎలాచూసినా ఇది గొప్ప నాటకమని నిరూపించటమేగాక, ఈనాటకాన్ని ఆమోదించనివారిలో మూడు రకాలను సూచించారు, వాడుకభాష గిట్టనివాళ్లూ, గిరీశం బుచ్చమ్మను లేవదీసుకపోవ టాన్ని సహించలేనివాళ్లూ, హాస్యమంటే సరిపడనివాళ్లూను. దీనికి నాలుగో రకాన్ని నేను చేర్చదలిచాను— ఎందులో గొప్పతనం ఉన్నట్టు పదిమందీ చెప్పుతున్నా, తేళ్లూ, జెర్రిలూ పాకినట్టు బాధపడేవాళ్లు.

సోమయాజుల వెంకట రామమూర్తిగారు కన్యాశుల్కం జరిగిన కాలాన్ని నిర్ణయించటానికి చిత్రమైనకృషి చేశారు కోర్టులో సాక్ష్యం ప్రకారం బుచ్చమ్మ పుట్టినది భావ నామ సంవత్సరంలో– అంటే 1874-75లో. బుచ్చమ్మకు పదహారేళ్లంటే కన్యాశుల్కం సంఘటనలు 1890లో జరిగాయి. 1890 డిసెంబరు(క్రిస్మస్‌సెలవుల్లో)నాటకం ఆరంభమవుతున్నది. నాటక సంఘటనలన్నీ జరగటానికి 15 రోజులు పట్టింది, సరిగా మధ్యలో గిరీశం బుచ్చమ్మను లేవదీసుకుపోతాడు.

బంగోరె ముందుమాటలలో ఈవిషయాలేగాక ఇంకా అనేకవిషయాలుతెలిపాడు. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారిలా అన్నారుట: 'కన్యాశుల్కంలో ప్రతి వాక్యానికీ కొన్ని పేజీల వ్యాఖ్యానం చెయ్యగల మనీషి .... శ్రీ భమిడిపాటి కామేశ్వరరావు. కన్యాశుల్కం తలంపుకివస్తే– అధవా– ఆ పేరు చెబితే వారిశరీరం ఆపాదమస్తకమూ పులకరిస్తుంది.' భమిడిపాటి కామేశ్వరరావుగారు గిరీశం స్వగతం ఏనాడో రికార్డు యిచ్చిన సంగతి ఈనాడు చాలామందికి తెలియకపోవచ్చు. కాని ఈనాడుకూడా కన్యాశుల్కం పేరువింటే పులకించేవాళ్లు కొంతమంది ఉన్నారు; విజయ విలాసానికి తాపీవారు రాసినట్టుగా కన్యాశుల్కానికికూడా సమర్థుడొకడు వచ్చి వ్యాఖ్యానం రాసిననాడు మనమందరము 'తెలియనివాడనై మెలగితిన్' అనుకోక తప్పదు.

పేటూరి శివరామశాస్త్రిగారు అన్నిటికన్నా వింతవిషయం ఒకటి బయటపెట్టారట. అముద్రితగ్రంథ చింతామణిలో వారికి కన్యాశుల్కంలోని ఒక సీసపద్యం కనపడిందట. ఇదేమిటని వారు అప్పారావుగారిని అడిగితే, అప్పారావుగారు తాను కన్యాశుల్కాన్ని మొట్టమొదట గ్రాంధికభాషలోనే రాసి, అసంతృప్తి చెంది వాడుకభాషలో మళ్లా రాసినట్టు చెప్పాడట!

1892 ఆగస్టులో కన్యాశుల్కం ఆడినప్పుడు ఆ నాటకానికి ఆస్థానవిద్వాంసుడు ముడుంబై వరాహ నరసింహస్వామి సంస్కృతంలో నాందీప్రస్తావనలు రాసి చదివించాడు. ఎవరికోసం ఈ అర్థంగాని, నిస్సారమైన, అతిశయోక్తులతోకూడిన నాందీప్రస్తావనలు రాయటమూ, చదవటమూ జరిగిందో ఊహించటం కష్టం.

ఈ వ్యాసాలన్నీ అయినతరవాత మొదటి కన్యాశుల్క నాటకం ఉన్నది. నాటకంతోబాటే వివరణలూ, వ్యాఖ్యానాలూ, అక్కడక్కడా విమర్శలూ ఉన్నాయి. వీటిలో రెండు కన్యాశుల్కాలమధ్య ఉండేతేడాలు– ఉదా: గిరీశం డాన్సింగ్ గర్ల్‌కింద ఖర్చుపెట్టినది 10 రూపాయలనుంచి 20కి పెరిగింది– ఉన్నాయి. పూర్ రిచర్డు యెవరన్నటువంటి సమస్యలున్నాయి. ఇండియాలో కరెన్సీ నోట్ల జారీ ఎప్పటినుంచి జరిగిందన్న లాంటి సామాన్యవిషయాలుకూడా ఉన్నాయి.

19 వ పేజీలో బంగోరె ఉదహరించిన కె. వి. రమణారెడ్డి మాటలు దాదాపు ప్రతి ఒక్కరినీ దిగ్భ్రమలో ముంచజాలి ఉన్నాయి: 'వీరేశలింగంగారు లేవనెత్తిన సంఘ సంస్కరణ బావుటాకు వొక సమగ్రి సుందరమైన కళారూపమైన జోహారే కన్యాశుల్కమని తోస్తుంది. ఇందువల్లనేమో– నన్నడిగితే కన్యాశుల్క నాటకనాయకుడు కందుకూరి వీరేశలింగం పంతులంటాను.'

రమణారెడ్డి ఇలా అనటానికి ఏమాత్రమూ ఆధారం కనబడదు. వీరేశలింగం గారు సంస్కరణోద్యమాలు నడిపాడు, అప్పారావు సంఘ సంస్కరణను గాఢంగా వాంఛించాడు. ఆపైన యిద్దరికీ పోలిక ఏమీ లేదు. సంఘ సంస్కరణ విషయంలో వీరేశలింగం యోధుడు. ఆయనకు సాధ్యమైనన్ని విధవా వివాహాలు చెయ్యటం పరమార్థం. అప్పారావు కళాకారుడు; తన కళద్వారా సంఘంలోని కుళ్ళును గురించి ప్రజల కళ్ళు తెరవటమే ఆయన పరమార్థం. వీరేశలింగంగారు జీవితంలో మూఢాచారాలన్నిటితోనూ పోరాడాడు; మూఢ విశ్వాసాలన్నిటినీ దుమ్మెత్తిపోశాడు; అధికారుల లంచగొండితనాన్ని తీవ్రంగా ఖండించటమేగాక ఒకరిని ఆత్మహత్య చేసుకునే దాకా తోశాడు; భూతవైద్యులను హడలగొట్టేశాడు; ఛాందస బ్రాహ్మల జీవితంలోని కుళ్ళును చించి చెండాడాడు. వీరేశలింగంగారు సంఘంలోచూసిన అన్నిరకాల కుళ్లూ కన్యాశుల్కంలో ఉన్నది. కాని గురజాడ వీటి నగ్నస్వరూపాన్ని మనకుచూపి మనకో వాటిపై రోతపుట్టించాడు. కన్యాశుల్కంలో ఇద్దరు వితంతువులు-బుచ్చమ్మా, మీనాక్షీ- ఉన్నారు. ఇద్దరిలో ఏ ఒక్కరికీ అప్పారావు పెళ్లిచెయ్యలేదు. వీరేశలింగంగారైతే గిరీశానికీ, బుచ్చమ్మకూ పెళ్లి చెయ్యకుండా విడిచిపెడతారా? ఒక్కనాటికి విడవరు అక్కడే అప్పారావుకూ, వీరేశలింగానికీ ఉన్న తేడా. ఒక విధవా వివాహం చెయ్యగలందులకు అప్పారావు తనకు వివాహంపట్ల గల పవిత్ర భావాలను వదులుకోలేడు. వేశ్యావృత్తిలో ఉన్న మధురవాణి సౌజన్యారావుతో మాట్లాడుతూ, 'పెళ్లిచేసుకోగోరిన వేశ్యలకు కోరదగిన వరులు దొరకడం ఎలాగండీ? లేక యెట్టివారైనా సరే అని తమ అభిప్రాయమా అండీ?' అని అడుగుతుంది. వివాహంగురించి ఆమెకున్న ఘనమైన అభిప్రాయంలో వెయ్యోవంతు అగ్నిహోత్రావధాన్లుకూ, లుబ్ధావధాన్లుకూ లేకపోయిందన్నమాట అటుంచి, వీరేశలింగంగారివెంట సంఘ సంస్కరణోద్యమంలో తిరిగిన అనేకమంది యువకులకుగూడా లేకపోయిందన్న చేదునిజాన్ని మనం గుర్తించాలి. అలాంటి యువకుడే గిరీశం అతనికి 'విడోమారియేజి' ఒక పరమార్థం అటువంటి వాడినోట సంస్కరణభావాలు పలికించి సంఘసంస్కరణోద్యమాన్ని అప్పారావు అపహాస్యంపాలు చేశాడంటే అందుకు అప్పారావును ఎలా తప్పుపట్టటం. ఉద్యమాలలో తిరిగినవారికీ, ఊకదంపుడు సంస్కరణభావాలు ప్రకటించేవాళ్లకూ తాము సంస్కరించే

సమస్యయొక్క స్వరూపమే తెలీదు. గిరీశం 'లఫూట్'అనుకుందాం. ఆంటీనాచ్ వ్రత నిష్ఠాపరుడైన సౌజన్యారావు చాలా పెద్దమనిషి. కాని పైన మధురవాణి అడిగినప్రశ్నకు ఆయన 'యీసంగతి యింకా నేను బాగా ఆలోచించలేదు. వేశ్యలు విద్యలునేర్చి, ఇతర వృత్తులవల్ల సత్కాలక్షేపం చెయ్యరాదా?'అంటాడు. వాళ్లపెళ్ళిసమస్య- తానుతెచ్చినదే!- గాలికి వదిలేసి! దాంపత్య జీవితానికి వృత్తి– పాటా, ఆటా మినహాగా– ప్రత్యామ్నాయమైనట్టు.

ప్రతి సూక్ష్మ విషయాన్ని యెంతో సునిశితంగా చూసిన మనిషి అప్పారావు. పూజారి గవరయ్య ఉత్తుత్త ఆడదాని దయ్యాన్ని, దాని ఊహా భర్త దయ్యాన్ని సీసాలో పట్టటంతో వీరేశలింగంగారు భూతవైద్యులమీద పెట్టిన రంకెలుచూస్తే నిజమైన కళాకారుడెవరు తక్షణం తెలిసిపోతుంది. అటువంటి అప్పారావు రచించిన నాటకానికి వీరేశలింగంగారు నాయకుడనటం, మృదువుగా చెప్పాలంటే, హాస్యాస్పదం.

నేనీమాటలంటున్నది వీరేశలింగంగారిని హీనపరచటానికీ, అప్పారావుగారిని గొప్ప చెయ్యటానికీ కాదు; సంఘ సంస్కర్తలుగా ఎవరిది మంచిపద్ధతో తేల్చుకోవటానికికూడా కాదు. వీరేశలింగంగారు కార్యవాది, అప్పారావుగారు కళాకారుడు. కన్యాశుల్కాన్ని గురించి ముచ్చటించుకునేటప్పుడు అప్పారావును కళాకారుడుగానే అంచనా కట్టాలిగాని, ఉద్యమాలకు నాయకుడైనవాడితో ముడిపెట్టరాదు. కన్యాశుల్కంలోని బుచ్చమ్మనూ, మీనాక్షినీ గురించి తెలుసుకున్న ఫలితంగా ఒక్క విధవావివాహము జరిగి ఉండకపోవచ్చును దానికి దోహదంచేసినది నిజానికి వీరేశలింగం ఉద్యమమే. అలాగే వీరేశలింగంగారు ఎన్ని విధవా వివాహాలుచేసినా అలాటి వివాహాలవల్ల ఏర్పడే సమస్యలు జనానికి పట్టకపోవచ్చును. కొన్ని విధవా వివాహాల పరిణామంచూసి, 'విధవలు పెళ్లాడితే ఇంతే,' అనేవారున్నారు. విధవా వివాహాలతో సమ్మిళితమై వివాహ సమస్య ఒకటికూడా ఉన్నది. దాన్ని కన్యాశుల్కం స్పష్టంచేసినట్టుగా రిచువల్ విధవా వివాహాలు స్పష్టంచేయలేవు. సంస్కరణోద్యమంద్వారా జరిగే విధవా వివాహాలకన్న కొన్ని వందలరెట్లు హేయమైనవి శుల్కవివాహాలు దాన్ని యితివృత్తంగా తీసుకున్న అప్పారావు శుల్కవివాహాలతోబాటు విధవా వివాహాలను గురించీ, వేశ్యావివాహాలనుగురించికూడ మనను ప్రశాంతంగా ఆలోచించేట్టుచేశాడు.

వ్యాఖ్యానాలలో బంగోరె చేసిన అపకతవకలు కొన్ని ఎత్తి చూపి యీ సమీక్ష ముగిస్తాను.

లుబ్ధావధాన్లు పోలీసులతో చెప్పి పన్నువేయించటం అన్నమాటలు అంటాడు. 'పోలీసులతోచెప్పి పన్నువేయించడమేమిటి?'అని బంగోరెప్రశ్న. 'జుల్మానా', 'ఫైన్'

అన్నమాటలు బుద్ధావధాన్లుకు తెలీవు. పన్నులన్నీ అకృత్రిమ వసూళ్లేఅని ఆ బుడ్డి నమ్మకం. (పేజి 33)

శిష్యుడు మీనాక్షితో, 'తలపెంచుకుని తాంబూలం వేసుకుని పరసాలుచేసే వెధవ ముండకంటె నయంగద.' అన్నమాట మీనాక్షికే తగులుతుందని బంగోరెకు తట్టక పోవటం వింతగాఉన్నది. మీనాక్షి వెంటనే 'చూశావురా, నాన్నా- దీనమ్మకడుపుకాలా యెలాగంటుందో.'అనికూడా అంటుందిగద. (పేజి 60)

దుకాణదారు. 'యీవేళే చెన్నపట్నంనుంచి ఫస్టురకం బ్రాందీ వచ్చింది,' అన టాన్నిబట్టి బంగోరె ఆరోజుల్లో స్మగ్లింగ్ ఉన్నదని భావించటం అనవసరం. ఫస్టురకం బ్రాందీ విదేశాలనుంచి దిగుమతి కావలసిందే, ఆనాటి మద్రాసురాష్ట్రానికి మద్రాసు నుంచి దిగవలసిందే. (పేజి 68)

రామ: 'ప్రతివాడికీ సలహా చెప్పడానికి చాతవుతుందండీ? అందులో యీ యింగ్లీషు చదువుకున్న అయ్యవార్లని సలహాఅడిగితే....దొంగసాక్షాలు కూడవంటారు.' ఇది స్పష్టంగా గిరీశాన్నిగురించి అన్నముక్క. అగ్నిహోత్రావధాన్లుకు సలహాదారుగా ఉండటానికి రామప్పంతులు గిరీశంతో పోటీపడుతున్నాడు. (పేజీ 78)

100 పేజీలో సౌజన్యారావు అనటానికి సంజీవరావు అని ఉన్నది. ఇటువంటి తప్పులు కన్యాశుల్కంలో దొరక్కపోవు. రెండవ కన్యాశుల్కంలో బుద్ధావధాన్లుపెళ్లి జరిగినగుడి కోదండరామస్వామిది. రామప్పంతులు కొండిబొట్లును'పట్టాభిరామస్వామి' మీద ప్రమాణం చెయ్యమంటాడు.

అయితే రామప్పంతులు మధురవాణిని 'లక్ష్మి! లక్ష్మి!' అని పిలవటం యిలాటి తప్పులలో చేరుతుందో చేరదో స్పష్టంగా తెలియటంలేదు. మొదటి కన్యాశుల్కంలో నైనా 'మహాలక్ష్మి గిరీశం ఉంచుకున్న వేశ్య, రామప్పంతులుంచుకున్నది కాదు. 'మధురం! మధురం!' అని పిలవటానికి రామప్పంతులుకు సంకోచం ఉండొచ్చు-

వీధిలో వాళ్లంతా వింటారు; తాను ఉంచుకున్న మనిషి పేరు పదిమందికీ తెలియటం యిష్టంలేకపోయి ఉండొచ్చు. మరేకారణమైనా కావచ్చు.

గ్రంథంచివరను అనుబంధంలో అనేకవిషయాలు వివరించబడ్డాయి. ఇవన్నీ కన్యాశుల్కం పారాయణలో రసస్ఫూర్తికి దోహదం చేస్తాయనికూడా చెప్పలేం. కాని ఒక్క విషయం ఎలాటి సందేహంలేదు; ఎన్నిలోపాలున్నా బంగోరె ఎంతో ప్రేమాను రాగాలతో తయారుచేసిన పుస్తకమిది ఇది కన్యాశుల్కానికి తొలివ్యాఖ్యగా ఉద్దేశించ బడిందిగాని, తుదివ్యాఖ్యమాత్రం కాదు. దీనిలోని లోపాలను సవరించటంతోబాటు బంగోరె కృషిని ముందుకు తీసుకుపోవటం సద్విమర్శకుల కర్తవ్యం.

ఖడ్గసృష్టి - రస (కుస్తీ) పట్లు | కె. వి. రమణారెడ్డి

"....విమర్శనము విమర్శకుని చిత్తవృత్తిననుసరించి యుండుననుట స్పష్టము. అయినను, గుణము గుణముగాను దోషము దోషముగాను వర్ణించుట యుత్తమపద్ధతి యనియు, గుణముమాత్రము ప్రకటించి దోషము గప్పిపుచ్చుట మధ్యమపద్ధతియనియు దోషముమాత్రము విశదీకరించి గుణము మఱుఁగు పఱచుట యధమ పద్ధతియనియు, గుణమును దోషముఁగానో దోషమును గుణముఁగానో వెల్లడించుట యధమాధమ పద్ధతి యనియు లోకజ్ఞులు చెప్పుదురు. కొంత కాలమునుండి తెలుఁగులో విమర్శనములేదను లోపము తీర్చుటకోయన పోఁకకుప్పబెట్టెఁడన్నట్లు వెడలుచున్న విమర్శనములలోఁ గొన్ని కడపటి మూఁడు పద్ధతుల కుదాహరణముగా నున్నవని ప్రాజ్ఞలోకము తలంచు చున్నది. విమర్శకుఁడు సహృదయుఁడుగానిచో భాషకిట్టి యనర్థములుప్పతిల్లునుగదా!"

—మల్లాది సూర్యనారాయణశాస్త్రి (కవిత్వ తత్త్వవిచారము-పీఠిక)

శ్రీ శ్రీగారి 'ఖడ్గసృష్టి' గేయ సంకలనం గురించి ఇంతవరకూసాగిన వాదోప వాదాలు చివరకు పరస్పర జయాకాంక్షలుగా పరిణమించి, అసలు విషయానికి దాదాపు శ్రీకారం చుట్టివేశాయి. ఇది నిజంగా విచారకరమైన పరిణామం. తెలుగులో కావ్య విమర్శ ఇప్పటికీ ఈ వైయక్తికాంక్షను విడనాడలేకపోతున్నది. ఎత్తిపొడుపులూ మూతి విరుపులూ జబ్బ చరుపులూ విమర్శలో ఇంకా కనిపిస్తూ వినిపిస్తూ ఉన్నాయి. అవతలి వాడికి లేని motives ఆపాదించడం, వాడి వాక్యాలను సందర్భంనుంచి తప్పించి వికృతార్థాలు లాగడం, వాడి మాటలకు గోతులుతీసి వాడుద్దేశించని భావాలను వెలికి లాగడం— ఇదీ తంతు. పైగా ఇది 'కుస్తీ' అంటారు. అస్మదీయుడనేమాటకూ అస్మా దృశుడనే మాటకూ అంతరమెంచక తిక్క-పతనాన్ని అవతలివాడి నెత్తికెత్తడం, ఏదో complex ఉన్నదని నిరూపింపజూడడం—ఇవన్నీ ఈ చర్చలో నిజానికి అనవసరమైనా వీలున్నచోటెల్లా వాటిని చొప్పిస్తున్నారు.

ఇంతకూ వెంకటేశ్వరరావుగారితోటిగాని మరొకరితోటిగాని నాకున్న పేచీ ఏ విషయంలో?

'ఖడ్గసృష్టి' సంకలనంలోని ఏ గేయంకూడా 'మహాప్రస్థానం' సంకలనంలోని ఏ గేయానికీ దీటురాదంటారు వారు. ఆ శ్రేణిలోకి వెళ్లి సమాసనం పొందగలవి తప్పని

సరిగా రెండు మూడున్నాయి అంటాను నేను. ఈ విషయంలో రాజీలేదంటారు వారు. మంచిదే. మీ ఉద్దేశాలను మీరట్టిపెట్టుకోవచ్చు, నా ఉద్దేశాలను నేనట్టిపెట్టుకొంటానుఅని నేనంటాను.

దీని చుట్టుపట్లమాత్రమే సాగవలసిన చర్చలో 'అలంకార సంసార స్పృహలేని కణ్వులు'వంటి ఎత్తిపొడుపులకు దిగడమెందుకో నాకర్థంకాదు. అలంకారశాస్త్రాన్నంతటినీ ఆపోసనపట్టిన అగస్త్యువిలా ఈ పద్ధతి ఎందుకో? తాము నేర్చింది గొప్ప విద్యే కావచ్చు. విద్య వినయాన్నితేనప్పుడు విరప్రీగడమొక్కటే మిగులుతుంది. పైగా ఇది ఎంతదూరం పోయిందంటే, అవతలివాడు తనవిచూచీ తన ప్రతాపంచూచి భయపడిపోయి 'తప్పుకోవడం' మొదలుపెట్టినట్లు భ్రమపడుతున్నారు. మరి ఈ కాంప్లెక్స్ ఏమిటో? తిక్కనతనం తమ సొత్తైవుండగా అవతలివాడు దాన్ని claim చేస్తున్నాడనుకొని కుస్తీకిదిగే మనస్తత్వమేమో ఇది!

ఈ చర్చ సందర్భంగా నాలో మెదిలిన అనుమానాల గురించి మరో పత్రికలో రాసిన వ్యాసాలనుకూడా జవిరిసందిట పెట్టుకొని వచ్చి యీ కళ్లాంలో పిడివేటుకొడుతున్నారు. ఇంతచేసీ వారు రాల్చినది గింజలు కాదు, నిందలుమాత్రమే. లేకుంటే, నేను పేర్కొన్నంతవరకూ శాండ్‌బర్గ్ ముక్కూ మొగమూ తెలియనివారు అప్పటికప్పుడు Harvest poems కు శాండ్‌బర్గ్ పీఠికచూసి సర్దుకొన్నారు. మొదటే తాము చదివి వేసినట్లు బుకాయించడ మెందుకో? విమర్శకుల దాక్షిణ్యంగురించిన నా అభిప్రాయానికి తార్కాణగా శాండ్‌బర్గ్ వాక్యాన్ని నేనెత్తిచూపడం జరిగింది అంతేగాని. నా అభిప్రాయాన్ని ఆ కవికి నేనాపాదించలేదు. ఆపాదించావంటున్నారు వెంకటేశ్వరరావుగారు. New critics అని అమెరికాలో బయల్వెడలిన విమర్శకుల విసుర్లుగురించి శాండ్‌బర్గ్ ఏమనుకున్నాడో రావుగారికి మళ్లీ నేను చూపినదాకా తెలియదనుకొంటాను. విమర్శకులలో Good Guys కవిని అర్థంచేసుకొని రాస్తారు. Bad Guys అపార్థం చేసుకొని రాస్తారు అలాంటి bad guy చేసిన విమర్శ తనకు బాధగలిగించినప్పుడు శాండ్‌బర్గ్ యిలా అనేవాడట.

I remember lying on the green grass of Grant Park one summer after-noon and hearing Vachel Lindsay laugh and expostulate, 'It is a wonderful thing to be a poet and not a jack ass.'

* * *

'విరోధివల్లకూడ కలుగని ముప్పు గొప్పతనానికి అనుచరవలయం కలిగించగలదు'అన్నారు తమ వ్యాసాన్ని ముగిస్తూ వెంకటేశ్వరరావుగారు వ్యాసానికంతటికీ

ఇది ఒక్కటే మంచిమాట. అలాంటి అనుచరవలయంలో నేనెప్పుడూ లేనని ఆయనకు తెలియదు. 'నిటారుగా నిలబడు నేస్తం....' చరణాన్ని వ్యాఖ్యానించే taste శ్రీ శ్రీకి మంచి చెయ్యదన్నారు. శ్రీశ్రీ కవిత్వతత్వాన్ని వివరించేక్రమంలో ఆయన సామాజిక భావనను నిరూపించే క్రమంలో. ఈ చరణమొక్కటేగాక మరెన్నో చరణాలు నా వ్యాసంలో ప్రస్తావనకు వచ్చినమాట నిజం. 'సమాజాన్ని శ్రీ శ్రీ దర్శించిన క్రమం ఇది' అంటూ ఉపక్రమించి ఈ చరణాలను ఉటంకించాను. అంతేగాని, 'ఖడ్గసృష్టి'లోని ఉత్తమ కవిత్వ పదార్థానికి యివి, ఇవే సూచికలని నేననలేదు. అననిదానిని అన్నానని మొండికిబడి నిందించడమే వెంకటేశ్వరరావుగారి విమర్శతరహా.

'ఖడ్గసృష్టి'లో నా దృష్టికి బాగున్నాయని నేను పేర్కొని ఉన్న 'సంకల్పం', 'గాంధీజీ', 'విషాదాంధ్ర' గేయాలలో Felt emotion లేదుకాబట్టి బాగాలేవని వెంకటేశ్వరరావుగారంటున్నారు. Felt emotion ఉన్నదీ లేనిదీ తేల్చుకోవడమెట్లా? విమర్శకుడు ఉన్నదంటే ఉండడమూ లేదంటే లేకపోవడమూనా, లేక ఆ కావ్యంలో నిక్షిప్తమైఉన్న కవి అనుభూతి తీవ్రత, దాన్ని వెలువరించే మేలిమాటల ఎంపిక, maudlin emotion ను సులభంగా పట్టి యివ్వగల అతి నగిషీ పనులూ కృత్రిమ ప్రాసలూ వగైరా లేకపోవడమూనా? ఇవి ఏవీ అలవోకగా రాసిన గేయాలుకావు. స్వాతంత్ర్య దినోత్సవ సంరంభంలో కలిసిపోయి చిరదాస్యవిమోచనవేళ స్వదేశీయుల నుద్దేశించి చేసిన రచన ఒకటి. అందులోని కవి అనుభూతి ఈషణ్మాత్రమైనా తెచ్చి పెట్టుకొన్నది కాదని ఆ వాగ్ధారే తెలుపుతుంది. ఒక మహోద్రేకం పట్టున చిక్కనప్పటి నత్తిమాటలుకావివి. ఆ ఉద్రేకాన్ని అదుపులోకి తెచ్చుకొని స్పష్టంగా శక్తివంతంగా చెప్పిన యీ కవిత్వానికి ప్రవక్తృత్వం ఉన్నంతమాత్రాన అది కవిత్వంగా తక్కువస్థాయికి చెందుతుందని నేననుకోను. అర్థప్రోక్తమన్నా, ఈసపు నీతికథలాగున్నదన్నా ఆ కావ్యాల బాహ్యస్వరూపాన్ని వర్ణించడమేగాని దాని అంతస్సత్వాన్నీ కవిత్వ సంపన్నత్వాన్నీ నిర్ధరించడంకాదు. ఈ మూడు కావ్యాలూ శ్రీ శ్రీకి కవిగా గౌరవంచేకూర్చేవనే ఇప్పటికీ నా అభిప్రాయం. 'ఒక చాలా సున్నితమైన పుష్పం....' లో ఇంగ్లీషు పలుకుబడి ఉన్నదని వెంకటేశ్వరరావుగారన్నది నిజమే. పుష్పమనేది అల్పాయుష్షుకేనా సంకేతం? వజ్రంవిలువ దానిలోఉన్న బొగ్గువల్లనేనా? ఒకవైపు కవి ఆయా వస్తువులకుగల గుణాన్ని ఇదమిత్థమనిచెబుతూ, పుష్పలాలిత్యాన్నీ వజ్రపు అమూల్యత్వాన్నీ నిర్దేశిస్తున్నాడు. మరొకవైపు విమర్శకుడు కవిహృదయాన్నీ ప్రకటితమైన కవి ఉద్దేశాన్నికూడా తోసివేసి ఆ వస్తువులను కిందికి తోస్తున్నాడు. ఇందులో సహృదయత్వమెంతపాలో దేవుడికే ఎరుక.

ఇంతకూ శాబ్దికులు, లాక్షణికులు, సహృదయులు, discerning విమర్శకులు, రసార్ణవాన్ని తాగి గరుర్చిన తేన్చినవాళ్లు, ఇన్ని కితాబులను యితరులకు నిరాకరిస్తూ తమకు ఆపాదించుకొనే మహాశయులవారు పట్టిందానికి కాళ్లు నాలుగెలా ఉంటాయి? సర్రియలిజం యోగ్యత తమకెన్నడో తెలిసిపోయింది. ఎక్జిస్టెన్షియలిజం యోగ్యత తమకు యితరులకంటెముందే తెలిసివచ్చింది. కెనెడీయోగ్యతను తామెన్నడోచాటారు. ఈ మనస్తత్వంగల సర్వజ్ఞులకు ఒక దణ్ణం!

మంచి కావ్యాన్ని కనిపెట్టగల విమర్శకుడు మంచి కావ్యాలనుకూడా తొక్కిపెట్ట గలడేమో నాకైతే తెలియదు. కాకుంటే, 'ఖడ్గసృష్టి'యావత్తూ చెత్తబుట్టపాలు చేయడ మెందుకో?

మళ్ళీ అంటున్నాను— 'మహాప్రస్థానం' సంకలనానికి సైదోడే 'ఖడ్గసృష్టి' సంకలనం!

ఈ మధ్యకాలంలో శ్రీ శ్రీ జీవితంలోనూ కవిత్వంలోనూ మార్పు వచ్చింది. మహోద్రేక పారవశ్యం వెనకబడి స్థిమితంతోకూడి ఆలోచనను సమకూర్చుకొని ఆయన మనస్సు మరింత పరిణతమైంది. ఇది కవిత్వక్షయంకాదు: కవిత్వపరిపక్వత, దీన్ని నిరాకరించే విమర్శకుడు శ్రీ శ్రీ కవిత్వంలోని ఇటీవలి చెత్తలోకప్పబడిన రత్నా లనుకూడా discern చేయనోల్లక పోతున్నాడు. వాదంకోసమని గుణమున్నచోటకూడా దోషాన్ని చూపుతున్నాడు. ఇదేకాబోలు Discerning critic యొక్క ధర్మమూ సహృదయత్వమూ? అయితే వాటికీ ఒక దణ్ణం!

[సృజన–3. మే–జులై 1967 లో కె.వి. రమణారెడ్డిగారు ఆరంభించిన యీ 'ఖడ్గసృష్టి' సమీక్ష సమీక్ష యింతటితో ఆపివేస్తున్నాము. సం॥]

భావ విప్లవం:

ఫ్యూడల్ యుగంపోయి ప్రజాస్వామ్యయుగం రావడానికి అభ్యుదయ సాహిత్యం తోడ్పడినట్టే ప్రజాస్వామ్యయుగంనుండే సామ్యవాదయుగం రావ డానికి ఈనాడు అభ్యుదయ యువకుల్లోవస్తున్న సాహిత్య ధోరణులు తోడ్పడు తాయి, సాహిత్యంలో విప్లవం ముందువస్తుంది. అది భావవిప్లవమౌతుంది,

—శ్రీ శ్రీ

చర్చావేదిక:

ఆధునికత — తెలుగు వచనకవిత | జగన్ మోహన్ సి. ఎ.

[ఫ్రీ-ప్రొఫ్రింక్ వర్స్—ఆధునికత అనే శీర్షికతో గత సంచికలో యీ రచయితే రాసారు. అయితే అది ఇందుర్తి ప్రభాకరరావుగారు రాసిన వ్యాసపరిధిలోనేవున్నది. ఫ్రీవర్స్ గురించి ఆధునికతగురించి జగన్ మోహన్ సి.ఎ. గారికున్న అభిప్రాయాలు సమగ్రంగా వ్యక్తమవడానికి ఉపకరిస్తుందనేభావంతో యీ వ్యాసం ప్రచురిస్తున్నాము. సం॥]

ఏది ఆధునికత? ఏదికాదు? ముందు 'ఆధునిక', 'సమకాలీన' పదాలమధ్య తారతమ్యాన్ని గుర్తించాలి. 'సమకాలీన' కాలానికి సంబంధించింది. 'ఆధునిక' అన్నది చేతనకూ, కాలానికీ సంబంధించింది.[1] సమకాలీనులు కొందరు కావ్యాలు వ్రాస్తున్నా అనూచానంగా వస్తున్న కావ్యరూపాలనూ (ఛందస్సు మొదలగునవి) కావ్య వస్తువునూ తీసుకునే యింకా వ్రాస్తున్నారు. వారికి నన్నయ్య తిక్కనాదులు, ప్రబంధకవులు models గా పనికివస్తున్నారు. కొంతమంది భావం, diction, వస్తువు మారినా ఇంకా పాతబడి సామాన్యమయిపోయిన ఆ ఛందోరూపాలనే వ్రాస్తున్నారు. ఆధునిక కవిత కూడా ప్రస్తుత కాలానికి సంబంధించిందే. అయినా ఆధునిక కవిత diction లో, భావపరిధిలో, కావ్యవస్తువులో, కావ్యరూపంలో అన్నింటా పూర్వకవితతో తెగతెంపులు చేసుకుంది. ఒక కొత్త ఊపుతో, కొత్త శక్తితో, కొత్త రూపాలతో ముందుకు సాగుతుంది. దీనికి models లేవు. ఉండవుకూడా. ఇక్కడ Ezra pound అన్న మాట ఒకటి గమనార్హం: No goob poetry is ever written in a manner twenty years old.

ప్రకృతిలో మార్పనేది సహజమైంది. నాలుగుకాలాలపాటు ఒకేరీతిగా ఉండేది అసహజమైంది, కృత్రిమమైంది. అదే కరుడుకట్టుకపోయి మానవ మేధస్సును, భావ పరిధిని ఎదగకుండా చేస్తుంది. కాబట్టి పెద్దకాలం నిల్చినదాన్ని దేన్నైనా బలవంతంగా నైనాసరే కూలదోసి కొత్తను స్థాపించాల్సి ఉంటుంది. ఈ కొత్త కూడా కొద్దికాలంతరువాత పాతదైపోతుంది. అయితే ఆధునికతఅన్నది మార్పులోనే, ఎప్పుడూవచ్చే కొత్తలోనే ఉంటుంది. వ్యాప్తిలో, అచారంలో ఉన్న దేన్నికాదని వ్రాసినా అది ఆధునికమే అవుతుంది. ఈ ఆధునికతకుఉండే గుణాలు కొత్తదనమూ, సాహసమూనూ[2]. అచార పరాయణులైన కొంతమంది యీ ఆధునిక కవితలో నైతికస్థాయి దిగజారిపోయిందనీ,

అంత్యదశలో వచ్చే విపరీతలక్షణాలున్నాయనీ అన్నా ఫరవాలేదు. ఎందుకంటే వారి కలానే కన్పిస్తుంది. వారికీ, ఆధునికులకూ దృష్టికోణంలో భేదముంది.

ఒకవ్యక్తి విద్యాబోధనా కాలంలో తన కండిన కవితగురించి కొన్ని social responses ను వృద్ధిచేసు కుంటాడు. అతనిలో దానివల్ల ఒకరకమైన conditioned responses కలిగి, వాటిద్వారా ఆ రకమైన కవిత్వాన్ని అప్రియత్న పూర్వకంగానే ఆనందించగల్గుతాడు. తనకు తాను కవిత్వాన్ని ప్రేమించే మనిషిగా, జడ్జిగా ఊహించు కొంటాడు. పాఠకలోకం యీ విధంగా నియమబద్ధమైన responses వృద్ధిచేసుకొని కవినికూడా తమ అంచనాలకు అనుగుణంగా సాధారణమైన కవిత్వం వ్రాయమంటారు, అప్పుడు కవితయొక్క విలక్షణత పోతుంది. సరిగ్గా అలాంటి సమయంలోనే ఆధునిక కవిత్వం, ఆధునిక సాహిత్యం కావాల్సిన అవసరం ఏర్పడుతుంది. అప్పుడు ఆధునిక కవిత్వమంతా విలక్షణంగా, గొప్పగా ఉండకపోవచ్చు. విభిన్నంగా ఉంటేచాలు.

కవి పాఠకలోకాన్ని irritate చేసి మేల్కొల్పాలి. లేకపోతే తానే వారికి దాసోహమనాల్సి వస్తుంది.

సాంఘికస్థితి, మానవస్వభావము మారినాయన్న నిశ్చితమైన అభిప్రాయముతోనే ఆధునిక కవిత ప్రాదుర్భవిస్తుంది. ఈ మార్పు ఎప్పుడూ జరుగుతుంటుందనికూడా నమ్ముతుంది. అందుకే ఆధునికత అనేది ఒక Prevalent style ను establish చేయ టానికి ఒప్పుకోదు.[3] అలా జరిగితే అది ఆధునికత కాదుకూడా. ఆధునిక కవిత ఇలా ఉండాలి. ఇలా ఉండకూడదు, ఇలా పలకాలి, ఇలాంటిభావాలే కల్గి ఉండాలి అన్న నియమాలు దాని spirit కే వ్యతిరేకమైనవి. ఆధునిక కవిత సమకాలీనమైన సమస్యలు, వ్యక్తి గురించేకాకుండా రేపటి విషయాలగూర్చికూడా ఆలోచించవచ్చుగాక. అది నిన్నటిగురించి ఎప్పుడూ ఆలోచించదు.

సమకాలీన సమస్యల నంటిపెట్టుకుని ప్రస్తుతంకోసం రాయబడేకవిత సమకాలీన కవిత అని, ప్రస్తుత సమస్యల నిర్లక్ష్యంచేసి రేపటి ప్రపంచంకోసం కలలుకంటూ- పునాది వేయచూచే కవిత ఆధునిక కవితఅనీ వేర్పాటుచేయడం ఒక పరిమితిలోనే అర్థ వంతంగా కన్పిస్తుంది. అంతకుమించి ఆ విభజన అర్థాన్ని కోల్పోతుంది.

Eugene Zamyatin అన్నట్లుగా "The old. slow, soporific descriptions are no more. The order of the day is laconicism." మనము శక్తివంతమైన తక్కువ పదాలలో భావాన్ని వ్యక్తంచేయాలి. భాషలో వాక్య నిర్మాణాన్నిగురించి పట్టించుకోవాల్సిన అవసరం లేదు. వ్యక్తీకరణ, ధ్వని ముఖ్యం.

సాధ్యమైనంతవరకు సంక్షిప్తంగాఉండాలి. వాడిన కొద్దిపదాలలో తీక్షణత, అర్థస్ఫూర్తి అనంతంగా ఉండాలి. "In the eyes of many modern poets verbal rhythm tends to merge with Psychological rhythm and that a weakly accented 'verse' is nothing but a proposition, an idealogical unit."— Marcel Raymond

మార్సెల్ రేమండ్ అన్నట్లుగా కవితలోని పదాల లయ పాఠకుడి మనస్సులో Psychological rhythm పుట్టించగలగాలి. లేకపోతే కవి చెప్పాలనుకొన్న ఒకానొక భావం ఒక సాధారణమైన పసలేని వాక్యంగా పాఠకుడి మనస్సుకుతోచే ప్రమాదంఉంది. అందువల్లనే తాను చెప్పాలనుకొన్న భావం పాఠకుడి మనస్సులోకి చక్కగా చొచ్చుకొనిపోయి, కదిలించి అతన్ని తనతో భాగస్వామినిగా చేసుకోవాలంటే ఆధునిక కవి అతి తీక్షణమైన, అలజడిని కల్గించి చురుక్కుమనిపించే పదాలను ఎన్నికచేయక తప్పదు. అయితే కవి తాను ఎన్నుకొనేపదాలు అతి original అయినప్పుడే అది సాధ్యం. పాఠకుడు కవిత చదివేప్పుడే శబ్దాలు, ధ్వని, లయ, భావం ఇవ్వన్నీ ఒక్కుమ్మడిగాఅతనిపై దాడిచేయాలి, అంటే ఆధునిక కవి Poe, Mallarme, T. S. Eliot ను మొదలగు symbolist ల టెక్నిక్ స్వంతంచేకోవాలన్నమాట.

తెలుగు ఆధునిక కవిత గమనించాల్సిన ఒక విషయం. ప్రాచీన ఛందోబద్ధ కవితలోవాడే వాక్యనిర్మాణ క్రిమానికి (Syntax) సాధారణమైన వాచిక వాక్యనిర్మాణ క్రిమానికి (syntax in speech) భేదం ఉంది. మనము మాట్లాడుకునేరీతిలో పూర్వ కవులెన్నడూ వ్రాయలేదు. కాని ఆధునిక కవితలో మనము మాట్లాడుకొనే భాషను Speech syntax నే వాడుతున్నాము. కాబట్టి మనము Speech rhythm నేమనదిగా తీసుకున్నాము. అదిగాక ఏసాహిత్యంలోనైనా కవిత చెప్పబడుతుంది, మాట్లాడబడుతుంది— చదవబడదు. ఈ సత్యాన్ని మనము యిప్పుడిప్పుడే గుర్తించాము. దీన్ని ఇంకా ముందుకు తీసుకుపోవాల్సిన అవసరంఉంది.

తెలుగు ఆధునిక కవిత సజీవభాషను, సజీవ లయను వశపర్చుకుంది. ఇక భాషను ఉత్తేజపరిచి యింకా అందంగా, అర్థవంతంగా చేయాల్సిన అవసరం ఎంతేనా ఉంది,

ఇక 'వచనకవిత'గురించి. వచన కవిత అనగానే free verse, verse libre మనకు జ్ఞాపకం వస్తాయి. ఇంగ్లీషులో free verse అనబడేదానికి, మన తెలుగులో వచన కవిత అనేదానికి చాలా భేదం ఉందని నా అభిప్రాయం. ఇంగ్లీషులో regular metre and rhyem లేని verse ను free verse అంటాము. ఇది డిక్షనరీ అర్థం.

Free verse అంటె ఇంతకు మించి అర్థంలేదు critical గా చెప్పాలన్నా. మన తెలుగు వచన కవితకూ యీ గుణం వర్తిస్తుంది. ఇంగ్లీషులో free verse అవగానే మనకు రెండువిధాలైన రూపాలు కన్పిస్తాయి. Symbolist free verse మరియు Prose arranged in lines, 'consecutive' Prose.[4] సరే దీన్ని అలాఉంచుదాం.

ఇంగ్లీషుభాషలో మనకు stress or accent కన్పిస్తుంది. ప్రతిపదాన్ని stressed and unstressed syllables గా విభజింపవచ్చు. Free verse లో ఇంగ్లీషు కవులు metre ను, rhyme ను కాదన్నా stressed syllables ను మాత్రము చాలా జాగ్రత్తగా వాడుతారు. ఒక విధమైన Psychological rhythm ను సాధించడానికి వారికి అవి ఎంతైనా పనికివస్తాయి. కాని మనకు తెలుగులో ఆ ఉపయోగం లేదు. తెలుగులో పదంలోని ప్రతిఅక్షరాన్ని స్పష్టంగా పలకాల్సిందే. అందువల్ల monotony కల్గడానికి అవకాశముంది మనము Psychological rhythm ను సాధించడానికి మార్గాంతరాలు వెదుక్కోవలసివస్తున్నది. అందువల్లనే మన వచనకవిత free uerse నుండి దూరంగా పోవాల్సివస్తుంది. మనము D.H. Lawrence లాగా "consecutive" prose lines వ్రాసి వచనకవిత అనలేము. Waste Land లో The Game of chess భాగంలోని మొదటి పది పదిహేనులైన్ల మాదిరిగా blank verse వ్రాసి తరువాత free verse లోకి దిగి ఈ రెంటిమధ్య అంతరాన్ని feel చేయకుండా ఉండలేము. మనం వ్రాస్తే ఒక పద్ధతిలో పూర్తిగా వచన కవితే వ్రాయాలి. లేకపోతే ఛందోబద్ధమైన కవితే వ్రాయాలి పూర్తిగా Prose lines వ్రాస్తే పసలేని వచనంగా అయిపోయే ప్రమాదం నోరుతెరుచుకుని ఉంటుంది. అందువల్ల మన వచన కవితలో శబ్దం, ధ్వని, వైవిధ్యము, శబ్ద చిత్రాలు (imagery), Poetic deyices మొదలగునవి విరివిగా కావాల్సి ఉంటుంది. Poetic devices యిదివరకు వాడుకలో ఉన్నవిగావచ్చు, కవి తాను స్వయంగా invent చెయ్యొచ్చు. ఈ విధంగా మన వచన కవిత ఇంగ్లీషు free verse కంటె క్లిష్టమైంది. కఠినతరమైందికూడా.

ఉపకరించిన పుస్తకాలు:

1. Irving Home— Introduction to Literary Modernism.
2. J. V. Cunningham.
   'Tradition and Modernity': wallace stevens.
3. Irving Home (Literary Modernism)
4. Marcel Raymond— Literaty Modernism.

కథ:

విద్యాబోధ | సి. వి. కృష్ణారావు

ఆపల్లెలో బడిపెట్టి అప్పటికే నాలుగు నెలలుగావచ్చింది. "చదువువచ్చిన వాళ్లంతా యిస్త్రీలాగు చొక్కాలు తొడుక్కొని కళ్లద్దాలు పెట్టుకోని హాయిగావుంటారు. సుఖపడుతారు. గౌరవనీయులవిపించుకుంటారు. కుర్చీలమీద కూర్చుంటారు. పెద్ద వాళ్లౌతారు. నేనెందుకు కాకూడదని" రాముడు చేరాడు బళ్లో.

ఆ రెండునెలల్లోగానే అక్షరాలు గుణింతాలు వచ్చేసినవి. లెక్కల్లో బడ్డాడు. తెలివిగలవాడౌతాడని అందరనుకుంటున్నారు. బళ్లో పంతులుగూడా తనకు తొందరగా చదువు వస్తుందన్నాడు.

ఒకసారి క్లాసులో పంతులు "నీదగ్గర వందరూపాయిలుంటే ఇరవై షాహుకారి కిచ్చావు: ముప్పయి కంసాలాయన కిచ్చావు. ఇంకా నీదగ్గర యెన్ని మిగుల్తయి!" అందరూచేశారు. రాముడు చెయ్యలేదు. చూరువైపుచూస్తూ కూర్చున్నాడు.

"ఏం రాముడూ చెయ్యలేదేం?"

"..................."జవాబు చెప్పలేదు రాముడు.

"నిన్నే"

"చెప్తానండి"

"వీడికప్పుడే కళ్లు నెత్తికెక్కినయి"అన్నాడు పంతులు.

మర్నాడు పంతులు యింకో లెక్కయిచ్చాడు. "నీయింటికి కూరగాయలమ్మి వచ్చింది. అణా దోసకాయలు. అణాన్నర వంకాయలు. అర్ధణా పచ్చిమిరపకాయలు కొన్నావు. మొత్త మెంతయింది?"

అందరు పిల్లలు చేశారు. రాముడు చెయ్యలేదు.

"వీడికి చదివేస్తే వున్నమతిపోయింది"అన్నాడు పంతులు.

మూడోనాడు పంతులు "ప్రతివాడూ దేవుడికి దణ్ణం పెట్టాలె. వరాలిస్తాడ"ని చెప్పాడు. రోజూ పిల్లలందరూ రాగానే ప్రార్థనచేయటం మొదలుపెట్టారు. రాముడు పెదిమ కదల్చలేదు. "ఏంరా అప్పుడే యింతగర్వం కండ్లకెక్కిందా" అని మొట్టాడు రాముణ్ణి పంతులు. రాముడు గుడ్లనిండా నీళ్లు కుక్కుకున్నాడు.

పంతులుకు తోచలా. తక్కిన పిల్లల్ని అడిగాడు. "ఏం రాముడు సాంతం మారి పోయినాడే. కారణం ఏంటి. వాళ్లనాయనతోచెప్తే బాగా చదివిస్తాడో ఏమో. ఎవ రన్నా చెప్పండిరా."

"వాళ్ళనాయన లేడంటి."అన్నారు పిల్లలు.

"ఏం రాముడూ మీనాయన లేడా?" అని దగ్గరకువచ్చి బుజంమీద చెయ్యేసి అడిగాడు పంతులు.

"పంతులుగారూ. నాకు గర్వమూరాలేదు. లెక్కలు రాకనూపోలేదు. నాకు వరాలిచ్చే దేముడూ లేకపోయె. కూరగాయలు కొనేయిల్లూ లేకపోయె. ఇవ్వటానికి డబ్బూ లేకపోయె. అందుకని మీప్రశ్నలో అపలువిషయం తెలియలేదండి."అని కళ్ల తుడుచుకుంటూ చెప్పాడు.

"ఓరి పిచ్చివాడా. ఈలోకంలో చదువంతా అంతే. మనకు లేకపోయినా వున్న వాళ్లకన్నా చేసి పెట్టటం నేర్చుకోవాలె. లేకపోతే నీకు వుద్యోగం ఎట్లావస్తుంది?" అని పంతులు ముక్కుమీదికి జారిన కండ్లజోడు పైకినెట్టుకోని బోర్డువైపు తిరిగాడు.

"అంటరానితనమనేది వర్ణాశ్రమాలవల్లనే వచ్చింది.
ఈ వర్ణాశ్రమధర్మం వున్నంతకాలమూ అంటరానివారూవుంటారు.
వర్ణాశ్రమవ్యవస్థను సమూలంగా నాశనంచేసినప్పుడుకాని—
అంటరానితనం సమసిపోదు."

అంబేద్కర్.

రాజూ - రాణీ | -ఎక్స్-రే.

పేకముక్కల పంపకంలో
తెల్లవాడి చేతుల్నించి
రాజూ రాణీలు
కొల్లగొట్టేవాడి చేతుల్లో పడ్డాయి.
రాజుకు పదవీలేదు జై
రాణికి పెదవీలేదు సై

పక్షిజాతికల క్వీన్ లు
బురదలోని చేపల్ని తీసి
ఇసుకలో వదిలిపెట్టినయ్
పంచవర్షాలు నాలుగంటే
మంచంకాళ్లు ఆఠీన్ ఆసు.

రిజర్వుబేంక్ గవర్నర్ గడియారంలో
గంటలముల్లు గల్లంతయింది
నిమిషాలముల్లు అంకెలను చెరుస్తున్నది
ఆకాశవాణి యాచనాగీతం సకిలిస్తున్నది

ప్రధానమంత్రికి బెడ్ టీ అందేవరకు
దరిద్రం వరదబాధితులకు
పార్లమెంట్ భవనం విడిది.
అక్కడ శాసనాల శాకపాకాలు వండుకోవచ్చు.

రాజ్యాంగం బంగారు కంచంలోపోసి
తినవచ్చిన కొంగలనుపిలిచి
పక్కకాపలా కాయొచ్చు.

ఆకలి పెద్దపులిముందు
ఓట్ల ఎండుగడ్డి పడేసెయ్
దప్పిక ఎరుగని ప్రభుత్వం గుర్రాన్ని
సోషలిజం తటాకంఒడ్డున వదులు

నిరుద్యోగం సముద్రాన్నీ తోడటానికి
భూస్వామ్య పెట్టుబడిదారీ జల్లెడపట్టుకో.
రడీమేడ్‌షాప్‌లో
పదవి చొక్కాకి వెలవెలాడుతున్నది
వెక్కిరాసిచ్చి తొడుక్కో.

గురి | —ఐ.

నీకు కళ్ళున్నాయి
కళ్ళు వున్నాయని నీకు తెలీదు
నీకు వేరువేరుగా నోరు, ముక్కు. చెవులుకూడా వున్నాయి ప్రత్యేకించి
ఇవన్నీ వున్న తలుంది
కాని అవేవీ వున్నట్టు, వాటి అవసరం వున్నట్టు నీకు తెలీదు
తెలుసుకోలేదు

నీకు చురుకైన చర్మం వుంది
చర్మంకింద వేడిగా, వాడిగా పోరాడే రక్తం వుంది
నీరక్తంలో నరాల్లో అంతులేని శక్తి వుంది
నీకు కాళ్ళున్నాయి చేతులున్నాయి
ఆకలుంది దాహముంది
కష్టాలున్నాయి కన్నీళ్ళున్నాయి
కోర్కెలున్నాయి కలలున్నాయి

ఇంకా
బుద్ధివుంది బలముంది
కోపముంది కసివుంది
పగవుంది పరాక్రమముంది
పౌరుషముంది పట్టుదలవుంది
జీవితముంది దానికో లక్ష్యముంది
అవన్నీ వుండటంవల్లనే నీవు మనిషివి

కాని అవన్నీ వున్నట్టు నీకు తెలీనేతెలీదు
తెలిస్తే ఇలావుండవు దుమ్ములా ధూళిలా, రాయిలా రప్పలా, నీటిపై గీతలా
అవన్నీ తెలీకుండా, వాటిస్పృహ నీకు లేకుండా నిర్జీవంగా తయారయ్యావునీవు
ఆయుధాల్ని పొదిలోంచి తీయటం చాతకాదు నీకు
అందుకే అవకాశవాదుల జెండాపై కపిరాజుగా వెలిశావు నువ్వు
నీ కండల్ని రుచిమరిగి బులబులాగ్గా నంజుకుంటూ
నీరక్తాన్ని ఒక్కొక్కటొట్టూ కండచీమల్లా, నల్లుల్లా, దోమల్లా, జలగల్లా పీల్చేసి
నిన్ను పిప్పిచేసి
అనుక్షణం అక్కరకురాని ధర్మసూత్రాల వల్లెవేతతో
నీ చైతన్యాన్ని కీలుకీలూ సుతారంగా కత్తేసి
నీ దిక్కూ మొక్కూ లేని ఎందుకూ కొరగాని, హీనమైన జీవితాన్ని,
చివరకి చావుని మహాఘనంగా కీర్తించి
మెప్పులతో డప్పులతో సాగనంపుతున్నారు నిన్ను
శ్మశానానికి
దహనానికి
ఆ మాటల్లో మంటల్లో నిప్పుల్లో సెగలో పొగలో ఉక్కిరిబిక్కిరై
నీవు
నీ జీవితం
నీ జీవితలక్ష్యం
అంతా
కాలి, కంపుగొట్టి
మిగుల్తుంది
వల్లకాట్లో
పిడికెడు బూడిద

నెత్తురు మెట్లు | —ఎన్. గోపి.

ఎక్కిపోతున్న పాదాలకింద
బక్కప్రాణాల బరువు మూలుగు
మరోనాడు మరికొన్ని పాదాలు

మరోనాడు మరికొన్ని....
తరతరాలుగా కదిలివస్తున్న
తెరపిలేని దగాపాదాలు
జాలిలేని
మానవతా స్పందనలేని
రాతి పాదాలు.

వీటినేకదూ
నా అశ్రువులతో కడిగినాను
చూసి అసహాయుడనై రగిలినాను.
ఇవేకదూ
నా ఆవేశ హృదయాన్ని అదిమితొక్కినవి
ఆందోళనతో ఆగిపోనివి.

ఎన్ని ఆశలు రాలిపోతున్నవి!
ఎంత ఆనందం ఆరిపోతున్నది!
ఇన్నికోట్ల కళ్ళు
ఎన్నాళ్ళుగా యీచీకటిని మోస్తున్నవి!

ఎప్పుడీమెట్లు ముక్కలవుతాయి?
ఎప్పుడీమేడ కూలిపోతుంది?
ఎప్పుడు సమాధిమీద
విప్పుకునే కొత్తపువ్వును చూస్తాను.

ఆవేశం పగులుతుందికదా
పోరాటం రగులుతుంది
నిట్టూర్పులకు మాడిపోనిపాదాలు
నిలువుకోతకు బలవుతాయి.
చురుకుచూపులు కుచ్చుకోని గుండెల్లో
చురకత్తులు దిగుతాయి.

పిరికిపాలు మారి పోయకండి | టంకశాల అశోక్

శవాలైన అలల తరాలు
ఒడ్డుతో
అడ్డురాళ్లతో
ఓడిపోయాయనిచెప్పి
పిరికిపాలు చేవకండి
మాకథ—
మీగాథలకూ, బోధలకూ
పొంతన విరోధి।

మారే పత్తురూపాయల్లాంటి
పైశాచిక నిబంధనల ఉక్కుసంకెళ్లలో
అలలవంటి బలహీనపు తిరుగుబాట్లూ
అసహాయపు నిట్టూర్పులతో
అంగాంగాలూ చెదరిపోతూంటే
'చావుకుముందు తోకాడింపు'
తిరుగుబాట్లు మీవి।
మీ అనుభవాలు — మాకు చెప్పకండి

విర్లిప్తత చచ్చిపోతున్నది
సంఘర్షణ శిఖరాలకు పాకుతున్నది
దగ్ధమౌతున్న చీకటి జడులు
పోగుపడుతున్న — మీ బూడిద
పక్కకు కాళ్లీడ్చుకుంటున్నాయి
కొత్త చరిత్రకు పుటలు సిద్ధమౌతున్నాయి

కళ్లు మూసుకుని
ఇంకా చీకటేఉందని
మమ్మ జోకొట్టకండి
పిరికిపాలు మారి పోయకండి.

నవసంకల్పం

కాటూరు రవీంద్రత్రివిక్రమ్.

కప్పూర తాంబూలం
బంగరు తూగుటుయ్యాల
రంభలాంటి చిన్నదాని సపర్య—
యివన్నీ పొసగాలంటే
యిది
రత్నాలు రాసులుగాపోసి
అమ్మేకాలంకాదు!
రాళ్లను 'రత్నాల'కి
తెగనమ్మే 'కరువు' కాలం....

యిది
సమరసభావం
'లుప్త'మయిన
ప్రజాస్వామ్యం ...
ప్రజల్ని దోచుకునే
గజదొంగలు
మిద్దెలెక్కి—
'మద్దెల' మోగించే అర్థరాత్రి యిది....

ఈ
మోతలతో
నీగూబలుపగిలి
నువ్వు
మూర్ఛపోబోకు.

లే....
వేళ్ళతో
కర్ణరంధ్రాలను
కప్పెట్టు....

కళ్లకి
పనిచెప్పు.
చేతనయితే
నోరువిప్పు,
ఎలుగెత్తి,
ఆకాశాన్ని చేరేదాకా
అరచి చెప్పు.

ఓ
మనిషీ!
నీకున్నదో 'మెదడు'....
అందులోకి
తొంగిచూడు
నీ
మొహంలో నీడలన్నీ
నీకే
చీదరనిపిస్తాయి
నీ
నోరు
నీకే 'దుర్గంధం' కొడుతుంది.

అందుకే—
నాయీ 'చివరిగానం'
నీకు
'పువ్వు మిగలాలి'
సమాజానికి
'మనం మిగలాలి'
యిదే
మన 'నవసంకల్పం'.

ఇదీ నిజం | జి. నర్సింహారెడ్డి.

అసంఖ్యాక వాద ప్రతివాద ఘూర్ణితంగా
వర్తమానం చలించటం చూస్తున్నాను
దైవమనీ పదార్థమనీ శక్తి అనీ

జడమనీ చేతనమనీ
ప్రబల లోక కల్యాణ కాంక్ష
బద్ధ చేతస్కులుగ కొందరు
జగత్క్రమాన్ని నిర్వచిస్తూ
చరించటం చూస్తున్నాను.

ఏది ఏమైనా ఒకటిమాత్రం నిజం
తనవలె సర్వలోకాన్ని
తలచటం మానవత్వపు వికాసం

దుఃఖం తనకు వలదంటాడా
దూరీకరింప యత్నించవలె లోకపు దుఃఖాన్ని
అన్యాయం తనను అణచవలదంటాడా
అభిలషించవలె అందరికీ న్యాయాన్ని

ఇది నిరంతరం జగద్ఘోషమాలపిస్తున్నది
అస్పష్టంగానైనా అంతరంగమనుక్షణం వినిపిస్తున్నది.

మంచు కురుస్తున్నది | మానేపల్లి సత్యనారాయణ.

మంచు కురుస్తున్నది
వెలుతురు ప్రభలేదు వేడిలేదు
భూమి గబగబా లోపలికి తిరిగిపోతోంది
మరోపూర్తి కోసం

జీవకారణం— సౌఖ్యదాయకం
సర్వలోక కల్యాణకారకం అయిన సూర్యకాంతి
తొలిప్రభ నేలచేరకండా
నా వాళ్లు, నా యిల్లు, నా తోట, నా చుట్టూ
చల్లదనం పొగచూరుతున్నది
మంచు కురుస్తున్నది
గంటలముల్లు సెకండ్లముల్లును వెన్నాడుతున్నది
చలితో వణుకుతున్న చెట్లు
పూలనోళ్లు తెరుచుకుని
ఆకాశంవేపు అర్రులుచాస్తూ
వెలుగు వేడుకుంటున్నాయి
సర్వ చరాచర జగత్తూ చిదానందబ్రహ్మ
పదానికి కళ్లు వెలార్చుతున్నది
జీవితంమీది నీటిపొరలాగ
మంచు కురుస్తూనే వున్నది
పొగచూరిన చిమ్నీలోంచి
కాంతి మందగిస్తున్నది
ఎర్రబడిన వొత్తికి కళ్లు ఎర్రబడ్డాయి
ఎండ యింకా దుప్పటి విప్పిందికాదు
వేడిపురి తెరిచిందికాదు
అదేమి మంచో—
యింకా కురుస్తూనే వున్నది.

చేతికి నోటికీ మధ్యవున్న దూరం
సామాన్యుని చెమట బిందువు!

—భూషి కృష్ణదాసు.

సమీక్షలు: | వినడానికో కథ

మనం బతుకుతూన్న ఈ నాటి సమాజం చాలా అసహజంగా గమిస్తున్నది ... తెలివి, వంచనాశిల్పం వున్నవాడు వందలాదిమందిని దగాచేయడానికీ సమాజంలో వీలుంది కష్టిమశిక్షణా క్రమంగా జీవించాలనుకున్నవాళ్ళు కన్పించడంలేదు. ధూర్తుల శాసనసభల్లో చేయబడుతూన్న ఏ చట్టమూ అమలులోకిరావడంలేదు. ఆశ్రితపక్షపాతం, అధికార దుర్వినియోగం- చివరికి బస్సులో సీటుదొరకపుచ్చుకునేదగ్గరకూడా- వాడుకో బడుతున్నయ్.

మనుషుల బానిస మనస్తత్వ నిషాలోనుండి ఇంకా బైటపడడంలేదు. వాళ్ళదేం తప్పుగాదు. బానిసత్వం.... పేర్లు మార్చుకుందేగాని, సామాన్యుల్ని భయపెడుతూనే ఉందింకా! తమ తప్పుల్ని తాము మర్చిపోవడానికి ఎదుటివాడి బలహీనతలాధారంగా మనుషుల్ని కొరుక్కుతినడం మానలేదు....

మనని అన్ని రకాలుగా కుంగతీసి, అభివృద్ధినే సత్తైనాశనం చేస్తూన్న సనాతన నమ్మకాల్ని, కట్టుబాట్లనీ వదులుకోలేక చాలా వెనకబడిపోయి ఉన్నాం.

ప్రజల్లోఉన్న కొన్ని నమ్మకాల్ని అపోహల్ని దొంగభక్తులు చాలా చెడ్డపద్ధతుల్లో వాడుకొని పబ్బంగడుపుతున్నారు- ఇదంతా అబద్ధమంటారా?.... నేనేమీ జవాబు చెప్పను.... రంగారావు 'వినడానికోకథ' చదవండని తప్ప!

ఐతే ముందోవిన్నపం. రంగారావు ఓ పాత్రి నోటలనిపించినట్టు చూడు అని చెప్పేదాకా చూస్తున్నదాన్నే చూడడం చాతగాని వాళ్ళంగనక, ప్రతికథలోకి నిశితంగా చూసి చదవండి.

'నిరహారదీక్ష చేయబడును' ఈ సంపుటిలో మొదటికథ, ఇందులో పాత్రల తత్త్వాన్నిసూచించే పద్ధతిలో పేర్లుపెట్టబడ్డాయి. 'నిరాహారదీక్ష చేయుబడును'.... కు గాంధీగారు చాలా శక్తి సంపాయించిపెట్టారు. గాంధీని విడగొట్టిచూస్తే అది మనకు అలకపాన్పెక్కిన ఇల్లాళ్ళనూ. పదేళ్ళలోపుకుర్రాళ్ళలోనూ కన్పించే ఆయుధంఅది....

గాంధీగారు తమ పద్ధతులకి వ్యతిరేకంగా స్వాతంత్ర్య ఉద్యమం అతివాదపోకళ్లు పోయినపుడు తరుచు యిలా అలిగి పులగంతినేవారు. గాంధీగారి ఇంగువ వాసవంటిన గుడ్డగనక ఇదింకా బతికేఉంది.... దాన్ని ఈనాటి వంచకులు ఎట్లా తమస్వార్థానికివాడు కొంటూన్నారో, అదొకవృత్తిగా దీక్షితుల్లాంటివాళ్ళెట్లా జీవిస్తున్నారో మనకు చాలా enlarge చేసి చూపేకథ ఇది.

రచయితకిగల నిశిత పరిశీలనాశక్తి, వ్యంగ్య హాస్యధోరణి కథంతా పర్చుకొని ఉంది.

దీక్షితులు నాయక్‌లాంటి దొంగలకి సమస్య తేలిపోవాలనేఆదుర్దాగాదు. సమస్యని తాము కొంత వాడుకోవాలనే తహతహ. అందుకే '....పదిమంది నోళ్ళల్లో యింక పడ లేదు.... ప్రభుత్వం ఏదోవొక సాలోచనకు వచ్చేముందే మనం దీక్ష కొనసాగించాలి. ఎప్పుడూ గోరుచుట్టుపై రోకటిపోటులా వుండాలి మననడపడి.'

కాని నాయక్కారణంగా కథ అడ్డంతిరిగింది. 'జరిగిపోయిన వ్రతాలన్నీ లోకానికి సంబంధించినవి. అందుకే ఆ సమస్యల్లో లాభనష్టాల ప్రమేయం లేకపోయింది' దీక్షితులకి.

పాములు పట్టేవానికి, ఎన్నడో ఓనాడు పాముకాటు ప్రమాదం తప్పనట్టే, పంచనని వాడుకొని జీవించే దీక్షితులు యిట్లా అనుకుంటాడు 'మనిషి జీవనోపాధిగా ఏర్పరిచే ప్రతిచర్య, ఈరోజుల్లో అదే అతని జీవితానికి ఉచ్చు అల్లుతుంది.'

'ఈ రోజులిక ఇంతే అనుకుందామా?.... ఈరోజుల్నింత గందరగోళంగా మార్చిన ఆ దుశ్శక్తిని దీక్షితుల్లాంటి వాళ్ళమీద, వాళ్ళ నిరాహారదీక్షలమీద ఆధారపడి ఎదుర్కోగలమా?....

ఎక్కడా విసుగనిపించకుండా, వెలితిలేకుండా, స్ఫుటమైన ఆలోచనతోనూ శిల్పంతోనూ, బలమైన వాక్యాలతోనూ నడిచినకథఇది.

రెండవకథ పోస్టుమార్టమ్.

చావు, అనుమానాస్పదంగావున్న ఆత్మహత్యో, హత్యోఐనా, శవాన్ని డాక్టర్ పరీక్షించడాన్ని పోస్టుమార్టమ్ అంటారు. శ్రీపతిగారన్నట్టు ఈ కథకు పేరుపెట్టడంలో చాలా ప్రజ్ఞకన్పిస్తుంది.

క్రిష్ణప్రియ అందంగా ఉంటుంది. పడుచుపిల్ల చచ్చిపోయింది బానిస మనస్తత్వంతో బతుకుతూన్న మనుషులకి ఇంతకన్నా ఎక్కువ భాగ్యం ఇంకేం కావాలి?.... అందుకే బంధువులూ బైటవాళ్లూ ముక్తకంఠంతో ఆత్మహత్యఅనే అంటారు. ఔను ఆత్మహత్యఐతే- ఎందుకు చేసుకున్నట్టు? ఇదేవాళ్ల పోస్టుమార్టమ్ రాఘవయ్యలాంటి మధ్యతరగతి మర్యాదస్తుడు, లోకానికి, గౌరవమనేపేరుతో- ఎంతగా భయపడిచస్తాడో, చాలా బలంగా చెప్పాడు. ఈకథగూడా సందర్భానుగుణమైన సంభాషణతో, పదునైన విమర్శతో సాగింది.

వేళ్ళు: ఇతివృత్తానికనుగుణమైన శైలిలో సాఫీగా సాగింది— రోగి మనోవ్యథ

మాటల్లోనేగాక పరిసరాల్ని సృష్టించడంద్వారాగూడా సాధించారు.

4 వ కథపేరే పుస్తకంపేరు....

ఈ పద్ధతిలో ఇదివరకు కొన్నికథలొచ్చాయి. కథగూడా చాలా సాధారణంగా ఉంది. సారధి ఒక వ్యభిచారికనే కొడుక్కి తన భార్యకని కొంత దానంచేసి సాధించిన ప్రయోజనం ఏమీలేదు. అంతా తెలివిదక్కువ దుందుడుకుతనం.... ఈ సంపుటిలోని అతి సాధారణమైనకథఇది.

దుఃఖంలేనోడు.... అస్తిత్వంలేని యిద్దరి మగాళ్ళకథ ఇది. గుమస్తాగానే ఉండక సుందరి మొగుడిగామారిన కథలోనిఒకడు- చాలా పెద్ద మూర్ఖుడు. వివాహమనేది అనురాగంచుట్టూ కట్టుకపోయే గూడుఅని, నలభైయేళ్ళ వయసులోనూ తెల్సుకోలేని చవట. అందుకే చాలా హీనంగా వంచింపబడ్డాడు. నైతికవిలువలు పడిపోయిన వ్యక్తులు, సుందరి, సుందరిమొగుడు, కామాక్షి, ఏ కొంచెమైనా intuition ఉందంటే కామాక్షి మగనిదగ్గరే.... ఈకథ నిభాయించుకొనేశక్తి లేకపోతే, బర్రైనా, భార్యైనా దొంగదౌతుందనే భావాన్నిసూచిస్తూంది— బర్రె పశువు. భార్య వ్యక్తి....భార్యనిగూడా 'నిభాయించుకోవడం'అనే అభిప్రాయంతో మనం ఏకీభవించలేం— ఐతే, ఈకథలోని సుందరివేరు— నీతీనిజాయితీలే లేనిమనిషి. తన మొగని 'పెళ్లాన్ని కొనుక్కొన్నవా'లను కొనే తప్పుడాలోచనకి మంచిశిక్ష యిచ్చింది. కాని 'బర్రె' సంగతి అలాకాదు.... కామాక్షి rigid మూర్ఖత్వం, బర్రెను దొంగనిచేసింది. Henpecked కామాక్షిమగడు పాపం క్షంతవ్యుడు— మంచి హాస్యస్ఫోరకమైన రచన.

6 వ కథ సావిత్రి.

అదిగో బస్సు.... ఇది కథ అనిగూడా అనలేం. స్కెచ్ ఇది. రచయిత పరిశీలనాశక్తికిది గుర్తుగా ఉంది. ప్రారంభంలోనూ, చివరలోనూ 'మ్యూజికల్ చేర్స్ బ్యాండ్' ఆగిపోవడాన్ని సూచించి, బస్‌స్టాండ్ నీ, ప్రయాణీకుల ఆత్రాన్నీ సీట్లకొరకు పోట్లాడుకునే పోటీ తత్వాన్ని కళ్లకు గట్టినట్టు చేశారు రచయిత. ప్రభుత్వం ప్రజలకని మంజూరుచేసేడబ్బు ప్రణాళికలుగూడా ఎట్లా, ఆశ్రితులకి, అధికారంఉన్న వాళ్ళకి, కిటికిల్లోంచి ఎక్కి దూకేవాళ్ళకి మాత్రమే చిక్కుతున్నయో యీ స్కెచ్‌లో గుణించిచూసుకోవచ్చు.

ఈ స్కెచ్‌లోని రచయితలాగే, ఏ అభివృద్ధీ అందకుండా సామాన్యపౌరుడు ఇరవైఏండ్లకిందనే ఆగిపోయాడు. పేదబ్రాహ్మడిలాంటివాడే దొంగగా చెప్పబడుతున్నాడు గాని అసలైన దొంగలు అంబాసిడర్లలో తిరుగుతున్నారు.... ప్రతి వాక్యం అవసరం. ఆవేశంలేకుండా నిర్మొహమాటంగా సాగింది....

కథలన్నింట్లోనూ, దృశ్యానుగుణమైన పోలికలు ఉన్నాయి. కథాశిల్పం విసుగెత్త కుండా మలచబడ్డది.

'సావిత్రి' 'వినడానికోకథ' 'దుఃఖంలేనోడు'కథలతో ఎలాంటి ప్రయోజనమూ ఉండదు. రచయిత తనకుగల వ్యంగ్యధోరణిని, కుశాగ్రదృష్టినీ, సమాజంవేపు, దానిలోని 'బద్దెబాజీ'వేపు మళ్ళించాల్సిన అవసరం ఉంది.

గంపెడు ప్రేమకథలు, తద్దెడు వరకట్నాలు, ఓ గోర్రిస్ ఉద్యోగసమస్యలు, శాపవశాత్తు మనుషుల్లో పుట్టిన దేవతల్లాంటి పాత్రిలతో నిండిన కథలు చదివి చదివి, ఖారరాహిత్యస్థితికి వచ్చినమనసుకు, రంగారావు కథల సంపుటి భ్రిమలు తొలిగించేదిగా ఉంది.

వాస్తవాల చిత్రీకరణకు పూనుకొని, మంచి కథకులు బహుళంగా లేనికొరతను రంగారావు తీరుస్తాడని ఆశిద్దాం.

ప్రింట్‌లో పాత్రలమాటలకి చేర్చాల్సిన " "గుర్తులగురించి తగినశ్రద్ధ తీసుకో లేదు. Pause సూచించాల్సిన— గుర్తులుగూడా లేవు. ఒకటీ అర అచ్చుతప్పులున్నా, తప్పుల కుప్పలుగా వస్తూన్న యీనాటి పుస్తకాలతో పోల్చినపుడు, ప్రచురణకర్తలు చాలా శ్రద్ధగా అచ్చొత్తించారనేచెప్పాలి.

సృజనకి పేరేపరిచయమక్ఖర్లేదు. త్రైమాసిక పత్రికగానేగాక సాహిత్య ప్రచురణలు గూడా ప్రారంభించిన 'సృజన' భవితవ్యంపట్ల అందరికీ అచంచలమైన విశ్వాసం కలుగుతుందిక.... ఇదొక ఆశాచిహ్నం.

కొత్త రచయితనే భయంలేకుండా, కేవలం సాహితీ ప్రయోజనాన్నే దృష్టిలో పెట్టుకొని, యీ ప్రయత్నానికి సాహసించి, మొదట్లోనే యింతటి ఉదాత్తమైన కథల సంపుటిని తెచ్చిన 'సృజన'నిర్వాహకులు బహుధా అభివందనీయులు.

'శక్తి' చిత్రం బాగుంది. అక్షరాలు చేర్చకపోయినా లేక ఆర్డర్‌లో చేర్చినా బాగుండేది.

—కిషన్.

కథలు - కొకరకాయలు

శ్రీ చలసాని ప్రసాదరావు రచనలు 'కథలు – కొకరకాయలు'లో పదకొండు కథలు, అందులో కొన్ని కొకరకాయలుకూడా ఉన్నాయి. పుస్తకానికి రాంభట్ల కృష్ణ మూర్తిగారు 'క్లౌనుగా కన్పించును కాని క్లౌనుకాదు' అన్నరీతిలో టూకీగా పరిచయ వాక్యాలు వ్రాశారు.

'ఇంటర్వ్యూ' కథలో సత్యహరిశ్చంద్రునిలాంటి అప్పారావుకు తన మేనమామ టెలిఫోన్ మహత్యంద్వారా తుదకో ఉద్యోగం లభిస్తుంది. 'నాగరీకుడు'లో గోపాలం ఒక కాఫీ హోటల్ రౌండుటేబుల్ సమావేశంలో ప్రత్యక్షమై గుమ్మంబయటి కిళ్లీకొట్టు వద్ద మాయమైపోయి కథ పూర్తవుతుంది. 'అంతరాంతరాలు'లో ఇంతచదువూ చదివి తీరా గుమాస్తా ఉద్యోగానికి మారుగా ఒక బంట్రోతుపనిని చేకూర్చుకున్న రామ్మూర్తి సెమీట్రాజెడీ (అర్ధవిషాదాంత) ఉదంతం ఉంది. 'పత్తేదారీ' కథలో డిటెక్టివ్ మహాశయుని స్కూటర్‌నే తప్పించేసిన హంతకుని తుదివిజయం ప్రదర్శింపబడి, స్కూటరు ముఖ్యమా లేక దాని నంబరా అనే సమస్య గుణపాఠంగా యెదురౌతుంది

'అరాజకీయ బాధితుడు' అనే కథ వాల్మీకి వ్రాయమరచిన రామాయణభాగం. అందులో శ్రీమదాంజనేయులవారి రాజకీయప్రతిభ, మరిన్ని తారకమంత్రోపదేశఘట్టము గ్రాంధికశైలిలో వ్రాయబడ్డాయి. ఆకాలపు ఊహా ప్రజాస్వామ్యాన్ని యీకాలపు కృతకచరిత్ర ఫక్కీలో చూస్తాము. 'కండూతి'అనే కాకరకాయలో పత్రికారాజ్యంలో రచయిత పాట్లకంటె సమీక్షకులవేట్లు ఎలా అధికమో నిరూపించబడింది.

'ఊకాగారి జడ్జిమెంట్' అనే కథ ఐ. ఎ యస్. మేడ్ ఈజీ అన్న పంథాలో ఉంటుంది. ఇది కార్యాలయోద్యోగులకు ప్రత్యేకించి సరదాదాయకం. 'విజ్ఞుడు'లో 'అప్పారావు'గారి సినిమాథియేటరు ప్రవేశంద్వారా మానవుని సినిసిజం దెసద తీరిపోయి, నేటి సినిసిస్టు లోకమంతా వెండితెర తారాగణానికి యెంతగా ఋణపడిఉందో తేలిపోతుంది.

'పుణ్యభూమి' అనే రచనను ఒకపెద్ద కాకరకాయ అని చెప్పాలి. ఇందులో యమధర్మారావు రాజ్యపరిపాలనలో శాసనసభా ప్రసంగాల గాంభీర్యంనించి, ప్రాజెక్టుల కొనసాగింపు ప్రావీణ్యంవరకు అనేక అంతర్గతకిటుకులను 88 పేజీల పంచవర్ష రిపోర్టు క్రింద సరళంగా పొందుపరచారు. సంగీతంతో పంటలు పండించే ఎగ్రో మ్యూజికాలజీ శాస్త్రప్రయోగాల వింతలూ, వివరాలుకూడా ఉన్నవి 'రాజర్షి'అనే జీవితచరిత్రలో ప్రఖ్యాతులయిన శ్రీ శ్రీ సచ్చితానందులవారి పుణ్యాశ్రమ జీవితానుభవ చరిత్ర వలయపు చక్రభ్రమణాన్ని చిత్రీకరించి చూపారు.

కథల ప్రక్రియలో కాకరకాయ ప్రక్రియను సమ్మిళితం చేయడం ఈరచనలోని విశేషం. ముఖ్య విషయాలను అముఖ్యధోరణిలో కొట్టివేయడం, గంభీరాంశాలను పేలవ విషయాలక్రింద త్రోసిపుచ్చడం యిలాంటి హాస్యరచనల ధోరణి అనవచ్చు. సమస్త వస్తువిషయాలను సమాన ఛాయాలో చదునుపరచే తరహా హాస్యధోరణి, ఏది ఎలాగైనా- ప్రహసన ఫక్కీలో నవ్వునుమాత్రం పుట్టిస్తుంది.... కాని, హాస్యంలో

మరికొంత వ్యంగ్యగహనత ఉండి ఉంటే బాగుండేదేమో అనిపిస్తుంది. అపహాస్యం చేసే టప్పుడు కథనవస్తువు కీలకస్వభావాన్ని ఆధారంచేసికొని, దాని సారాంశ గతమైన కీలక విపర్యాసాన్ని యెత్తిచూపడం ఉత్తమం అలాంటి సునిశితహాస్యం పాఠకహృదయాల్లో చిరకాలం చోటుచేసికొంటుంది. అప్రాముఖ్య అంశాల విపర్యాసంకూడ పెదవులపై నవ్వుపుట్టించవచ్చు. కాని మనస్సులో చెరగనిముద్ర వేయదు. 'సెటైర్ కిల్స్ విత్ లాఫ్టర్' అన్నదాని సత్తా రచయితనికటమైన లక్ష్యదృష్టి నైశిత్యంపై ఆధారపడుతుంది.

'కథలు, కాకరకాయలు'లో రెండు శిల్పరీతుల మేళన చూస్తాము, కథాశిల్పం, ప్రహసనశిల్పం రెండూ శ్లిష్టంగా కలసికొని యుంటాయి ఈరెండు శిల్పాలమేళనంలో ఆయారీతుల వైశద్యవిశేషతలను పోషించి నిగ్గుదీస్తూ, రెంటిని నేర్పుతో పొదగవలసి యుంటుంది, లేనితీరుకు రీతులు కలగాపులగమై, వైశద్యం వన్నెతరిగి, వ్యంగ్యం పేలవమౌతుంది. ఈ దృష్ట్యాశిల్పం విషయంలో రచయిత మరికొంత శ్రద్ధతీసికొని ఉండాల్సిందనిపిస్తుంది.

ఎలాగైనా, కథలు, కాకరకాయలు చురుకైన కథనవేగంతో నిర్వహింపబడ్డాయి. ఘటనలు, భాషణలు, వర్ణనలు, వ్యాఖ్యలు తగుపరిమాణాల్లో జతగూర్చబడియున్నాయి. పరిసరప్రపంచాన్ని అందులోని మనుష్యుల నానారకాల అవకతవకలను, అల్పత్వాన్ని గూర్చి నవ్వుకునే 'None have tails but it is wonderful to see How they swing from tree to tree' అన్నతరహా అపహాస్యధోరణిలో రచయిత కథనాంశాలను నిర్వహించాడు. ముమ్ముందు సూక్ష్మదర్శిత్వంతో సాక్షేప హాస్యాన్ని నిగ్గుదీయ్యడంలో కృతకృత్యులౌతారని ఆశిస్తున్నాం.

క ళ (వార్షిక సంపుటి)

భారత కళాపరిషత్ ప్రచురణగా, శ్రీ చలసాని ప్రసాదరావు సంపాదకత్వంలో 'కళ' మూడవ వార్షిక సంపుటి విడుదలైనది. భారతీయ చిత్రకళా వికాసానికి చెంది, ఆంధ్రప్రదేశానికి సంబంధించిన వివరాలతో ఆయా వ్యాసాలను సంచికలో పొందుపరచారు.

పరిప్రేక్షణలో శ్రీ సంజీవదేవ్ ఆంధ్రచరిత్రలో చిత్రకళాస్థానాన్ని గూర్చివ్రాశారు. శ్రీ దేవులపల్లి ప్రభాకరరావు తెలుగు సాహిత్యంలోని చిత్రకళా ప్రసక్తికిచెందే ఉద్ధర

ణలను పొందుపరుస్తూ వ్యాసంవ్రాశారు. ఆంధ్రుల ఆది చిత్రకళఅంటూ వేలిముద్రలూ, గోటిగీతలతో ప్రారంభించిన తొలి కుంభాకార అలంకరణ రూపాల కళా ప్రసక్తిని శ్రీ రాంభట్ల కృష్ణమూర్తిగారు పేర్కొన్నారు శ్రీ నార్ల వెంకటేశ్వరరావుగారు అమరావతి. నాగార్జునకొండ శిల్ప విశేషాలను సమీక్ష చేశారు. హిందూ కళ అన్న శీర్షికతో శ్రీ పి. యస్. యన్. రెడ్డి ఆంధ్రలోని ఆయా జిల్లాల దేవాలయ వాస్తుశిల్ప విశేషాలను పరిచయంచేశారు.

శ్రీ బాలకోటయ్య తోలుబొమ్మల తయారీకిచెందే చిత్రకళా రీతులను పరిచయం చేస్తూవ్రాశారు. కాకతీయ శిల్పాన్నిగూర్చి శ్రీ చలసాని ప్రసాదరావు వివరణాత్మకంగా చర్చించారు. శ్రీ అబ్బూరి గోపాలకృష్ణ విజయనగర రాజ్య కాలానికిచెందే వాస్తు, కుడ్య చిత్రరూపాలను సమీక్షచేశారు.

శ్రీ ఆచంట జానకీరామ్ బ్రిటిష్ పరిపాలనాకాలపు చిత్రకళా విశేషాలనుగూర్చి మరియు జాతీయ పునరుజ్జీవనదశకు చెందే కళారీతులనుగూర్చి శ్రీ వేటూరి రాధాకృష్ణ గారు పరిచయాత్మకంగా వ్యాసాలు వ్రాశారు. స్వాతంత్ర్యఅనంతర చిత్రకళనుగూర్చి శ్రీ మనోహన్ దత్ వివరణచేశారు.

పైవిధంగా ఆంధ్రప్రాంతానికి అనువర్తించే చిత్రకళా రూపాలను, చరిత్ర క్రమంలో కళ మూడవసంచిక ఆవరించియుంది. త్రివర్ణముఖచిత్రం. చిత్రపటాలు, ఆహార్య అలంకరణలతో సంచిక ఆకర్షణీయంగావుంది. పాఠశాలలు, గ్రంథాలయాల్లో తప్పక వుండాల్సిన ప్రచురణఅని చెప్పవచ్చు. రచయితలందరూ సుప్రసిద్ధులూ, అను భవజ్ఞులన్నది వేరుగా చెప్పేపనిలేదు.

ఈ సంచికలోని విశేషాలను గమనించినప్పుడు అందులోనూ ఆంధ్రప్రాంతాన్ని ముఖ్యంగా దృష్టిలోపెట్టుకొన్నప్పుడు చిత్రకళకు సాంఘిక జీవితంలోగల స్థానం ఎంత స్వల్పమో గుర్తుకువస్తుంది. ఏకొద్ది కొండగుహలు, దేవాలయాలూ, రాజమందిరాల్లోనో స్థానం చేసుకొన్న కళారూపాల వికాసక్రమంకూడ నిరంతరంగా అవాంతరాలకు లోనై నట్లు కన్పిస్తుంది. కాగా ఇప్పుడు మనకు మిగిలిందల్లా మధ్యయుగ శిథిలావశేషాలేకదా!

ఇక ఈనాడు చిత్రకళకు సంఘంలోగల స్థానం ఏమిటి? ఆ కళ పురోభివృద్ధికై తీసికొనబడుతున్న చర్యలేమిటి? అనుప్రశ్నలు వస్తాయి. ఫైన్ ఆర్ట్సు కాలేజీలు, లలిత కళా అకడమీ కార్యక్రమాల నాల్గుగోడలమధ్యమాత్రమే చిత్రకళాప్రసక్తి నిచూస్తాము.

చిత్రకళా వికాసానికి దోహదమీయగల తరహా పారిశ్రామిక వికాసం, ఆంధ్రలో తీరని కొరతగావుంది. అలాంటిస్థితిలో కళకు సంఘజీవనంలో సముచితస్థానం, పరిగణన, ప్రాముఖ్యత ఉందని తృప్తి పడలేము.

శివకాశీ కాలెండర్లు, సినిమాతారల బొమ్మలు, మరంటే స్వంతఫోటోగ్రాఫులు ఇవిమాత్రమే ఇండ్లలో వాడుకలో వుంటూవున్నవి. లలితకళా విద్యాలయాల నుంచి వెలువడే ఉత్తీర్ణులు తరచు నిరుద్యోగ నిస్పృహలకు గురికావలసి వస్తోంది. వారు దుకాణాలకు- తప్పితే ఆఫీసులకు- సైనుబోర్డులు వ్రాయడంకంటె చేయగల్గేది అగు పడటంలేదు. ఏనాడో, ఎక్కడో జరిగే యే ఎగ్జిబిషనుకొరకో యెదురుచూడటం, అందులో తమ బొమ్మలను ప్రవేశపెట్టుటకుగాను పైరవీలు చేయాల్సిరావడం, ఐనా తీరా వాటిని ప్రోత్సహించే నాథులులేక నిస్పృహ కల్గడం- ఈ స్థితిలో కళాకారులు అసంతుష్ట భావంతో ఆధునిక కళాఖండాలంటూ ఏవోరకం బొమ్మలు వేసుకుని, వాటి పరిమితరంగ ప్రచారంతో తృప్తిచెందటం- ఇలాంటి స్థితిగతులుచూస్తాము. సాంస్కృతిక పునరుజ్జీవన క్రమంలోని ఇలాంటి 'సంక్షోభ' సమస్యను దాటివేయడం సరికాదు. దేశ ప్రజలు సంస్కృతికోసం, కళల వికాసం కోసం, తమ ఆదాయాల్లో కొంత భాగం (ప్రభుత్వంద్వారా ఐనప్పటికిన్నీ) వినియోగించగల పరిస్థితులేర్పడేంతవరకు రచయితల కళాకారుల సృజనాత్మక కృషికి ఉత్తేజన ఇవ్వలేము. కని, కళాకారులపాత్రకు వారి వాణికి, సమాజంలో పరిగణన ఉన్నదనే ఆత్మవిశ్వాసం ఏర్పడనంతవరకు సాహిత్య కళలు, ఉద్దాముక ఉత్తేజనతో, సృజనాత్మక సందేశంతో ముందుకు సాగవని పెద్దలు చిరకాలంగా చెప్తూవున్నదే కాని, దానిని ప్రభుత్వమూ, ప్రజలు ఆచరణాత్మకంగా పాటించడం అన్నది యింకా మిగిలియేవుంది. కనుక చిత్రకళా పునరుజ్జీవనలో ఎదు రయ్యే ఆటంకాల నివారణకోసం, భారతీయ కళాపరిషత్ మరియు కళ చైతన్యయుతంగా సారథ్యమివ్వడం అవసరమనిపిస్తుంది.

వాస్తవికత, సంఘశీలత అనే సూక్ష్మ చక్షువులతో సంస్కృతీ, కళా ప్రగతి పథాన్ని దాని అన్ని పరిమాణాల్లోను, గుణగణాల్లోనూ సమన్వయించి విలోకించడం జరగనంతవరకు సరైన పరిష్కారాన్ని సాధించలేము, మన సంస్కృతీ కళారూపాలు చౌకబారు విదేశ అనుకరణలనుండి, సమాజ అతీతత్వ అహంభావధోరణులనుండి, కృతక యాంత్రిక శీల బలహీన వైఖరులనుండి తన్మూలక స్వీయసంక్షోభంనుండి, విడి వడి, సహజ స్వచ్ఛంద సజీవరీతులలో మానుషత్వ సందేశ గౌరవంతో ముందుకు సాగగల మంచిరోజులురావాలన్నది ప్రతివాడూ కోరుతున్న అంశమే. కనుక ఇప్పుడు కావల్సిందల్లా అందుకు మన మేధావులు సమైక్యకృషిని కొనసాగించటమే. అలాంటి

అభ్యుదయ శీల వేదికగా 'కళ' లాంటి పత్రికలు సముచితపాత్ర నిర్వహించగలవనీ సమస్యలను పరిష్కరించే కావ్యవాద దిశలో సమాలోచనలు జరుపగలవనీ ఆకాంక్షిస్తున్నాం. 'కళ' 3వ వార్షిక సంచిక అన్ని గ్రంథాలయాల్లోనూ, విద్యాలయాల్లోనూ ఉండితీరాల్సిన ప్రచురణయని మరొకమారు చెప్తున్నాం....

—పాములపర్తి సదాశివరావు.

సాహిత్య లేఖలు:

Abstract Poetry గురించి.... | వేగుంట మోహనప్రసాద్

[ఈ కింద వేగుంట మోహన ప్రసాద్‌గారు Abstract Poetry గురించి, abstraction గురించి రాసింది సృజనకుకాదు. ఆయన మిత్రులయిన సత్యప్రసాద్ గార్కి రాసారు. అయితే యీ విషయాల్లో ఆధునిక సాహిత్య పాఠకులకున్న ఆలోచనలకు, భావాలకు పదనుపెట్టినట్లు వుంటుందని పై యిద్దరి అనుమతితో యీ లేఖ ప్రచురిస్తున్నాం. సం॥]

" ... Abstract Poetry గురించీ Abstraction గురించీ నాకు తెలిసినంత వరకూ రాస్తాను. symbolic గ represent చేయడం విషయంకూడ యితరులు ఒప్పుకుంటారో లేదోగానీ- ఇలా అనుకుందాం. ఇంగ్లీషులో ఒక అలంకారంఉంది. synecdoche అని. Part for the whole అని. ముందు దీనితో మొదలుపెడితే అర్థం అవుతుందనుకుంటా. వైద్యుడు పరీక్షచేసేప్పుడు నాలికనో, కళ్లల్లో కాంతినో, నాడినో, గోళ్ళరంగునో దేన్నో ఒకదాన్నో లేక యీ అన్నిటినో పరీక్షిస్తాడు. ఇటువంటివి ఇంకా ఎన్నో కలిపితేనే సంపూర్ణమైనదేహం. కానీ అంగాంగాలు విడివిడిగానే సంపూర్ణదేహాన్నిగురించి చెప్తాయి అసమగ్రమైన రూపాన్నించి సమగ్రమైనభావాన్నీ అసమగ్రమైన భావాన్నించి సమగ్రమైన రూపాన్నీ, సమగ్రమైన రూపాన్నించి అసమగ్రమైన భావాన్నీ, సమగ్రమైన భావాన్నించి అసమగ్రమైన రూపాన్నీ చూపించటం ఈ Synecdoche పని. అయితే ఇందువల్ల ఏంసాధిస్తున్నాం? కొన్ని విషయాలు ఎంతచెప్పినా అంతమవవు. కొన్ని గీతాలు ఎంతపాడినా మౌనంలో విరిగిపోలేవు. కొన్నిరకాల మౌనాలు ఏశబ్దంలోకీప్రాకవు మౌనంగానయినా. మానవుని వేదనని ఏ బద్దీతోనూ కొలవలేం కొన్నిపట్ల. ఒకానొక చిత్రం ఎంతవేసినా అసంపూర్ణంగానే మిగిలిపోతుంది. అట్లాగే మనదుఃఖాలు హెచ్చవేసినా కూడినా భాగారించినా తీసివేసినా మరేంచేసినాకూడ తరగవు. పెంచుకోవాలని అనుకోం. ఈ స్థితిని కవి అనేవాడు భరించలేక అరుస్తాడు. కార్తోన్న కన్నీటిచుక్కల్ని ఒక్కొక్కదాన్నీ భద్రంగ చొక్కా జేబులో దాచుకుని, ఏడుపంతా అయినాక వాటిల్లో ఒక్కచుక్కని బయిటికితీసి చాల ఆప్యాయంగా అందరికీ చూపిస్తాడు మళ్లీ ఏడుపుప్రారంభిస్తూ. ఈఒక్క అశ్రుబిందువుని చూపటమే Synecdoche. ఎందుకంటే దుఃఖాన్ని కలిగించే కారణాలు సాధారణంగా నీచమైన వస్తువులే. అయితే దుఃఖమే సర్వోత్కృష్టమైనది. అతిసాధారణమైన

వస్తువుయొక్క కురూపం Synecdoche వల్ల కప్పబడి ఉదాత్తమైనదిగా కనబడుతుంది. కథా స్టోరీ మొత్తంచెప్తే వినే ఓపిక ఎవడికీఉండదు. ఒకవేళ చెప్పటమేగాని జరిగితే అందులోని ugly angles కూడ చూపాలి. అందుచేత part for the whole అనే యీ సిద్ధాంతం Artistic గ చాల మేలు చేకూర్చుతున్నదనే చెప్పాల్సొస్తుంది. utilitarian వాదులు దీన్ని ఏపట్టానా ఒప్పుకోరు. జీవితంమీద కళఅనే మాయతెరని దించుతుందని, అసలు నిజమైన జీవితాన్ని చూడనియ్యదని. ఎప్పుడైతే కేవలం ఒకభాగం(Part)వల్ల మొత్తాన్నీ (whole) చూపదలచుకున్నామో, అప్పుడే ఒక భాగంవల్ల మొత్తంలోకొంత చూపదలచలేదనే అర్థం. కొన్ని aesthetic considerations వల్ల దీన్ని ప్రదర్శించమని నేనంటాను. కాని మసిపూసి మారేడుకాయచెయ్యాలని చూస్తున్నావని ప్రయోజనవాదులు అనొచ్చు. Abstraction (రూపరహితత)కూడ Synecdoche నించే పుడుతుందని నా ఆలోచన. దీన్ని సమర్థించుకోవటం కొంచెం కష్టం. సరే. రూపంఉంటే రూపరహితత. భావంఉంటే భావరహితత. సౌందర్యంఉంటే అసౌందర్యం. కొన్ని వస్తువులకి రూపాలుండవు. రూపాలున్న వస్తువులకి అసమగ్రిత ఇచ్చి, కళాత్మకంగ ఆలోచనలో సమగ్రిత ఇస్తాం (ఒక్క కన్నీటిచుక్కలాగా) కాని రూపాలే లేని వాటిమాటేమిటి? ఈ ప్రపంచంలో యింతమంది విఫల, సఫల ప్రేమికులున్నారు. వాళ్ళనడగండి చెప్పగలరేమో ప్రేమ అంటే ఏమిటో?

కనక ఒక చతురస్రంలోనో త్రిభుజంలోనో ఇమడని కాంక్షనీ, వాత్సల్యాన్నీ ప్రేమనీ, ఆరాధననీ, ముఖ్యంగా ఈశ్వర ప్రేమనీ. పరీక్షణనీ, మృత్యువునీ, చివరకి యీ కన్పించే జీవితాన్నీ అన్నిటినీ నైరూప్యంచేసి, ప్రతీక (Symbol ఇచ్చి అనుభూతిని ధ్వనింప చేస్తున్నాం. 'My love is like a red red rose that has Sprung in Spring' అంటాడో కవి. చూచారా ఎంత నీచానికి దిగజారిపోయాడో కవి red red rose Sprung in Spring అని శబ్దంలో, ఒక గులాబీ నైచ్యానికి! కాని ఏంజేస్తాడు! అంతకంటే గతిలేదు. మనకు తెలియని దాన్ని తెలిసినదానితో చెప్పటంకంటే గత్యంతరంలేక. దీన్నే నేనిట్లా అంటాననుకోండి 'The rose is like my red red love' అని. Concrete గ ఉన్నదాన్ని abstract గ చెప్తున్నానన్నమాట.

హృదయవాది చైతన్యం ఎప్పుడూ నైరూప్యమే. తల్లి, తండ్రి, ప్రేయసి ప్రియుడు, భక్తుడు వీళ్లంతా హృదయవాదులు. వీళ్ల నైరూప్య చైతన్యం మాటల కోసం గిలగిల కొట్టుకుంటున్నప్పుడు ఏనబడిన Symbols లో దేన్నో ఒకదాన్ని ఏరుకుని దానిలో భావం, వేదన, ఆనందం నింపి వాడుల్తారు ప్రతీకలు లేకపోతే నైరూప్యవాదం నిలువదు. మంచు పొగలో ముసుగేసుకుని నడిచినట్లుంటుంది.

డాక్టరు విషయానికొద్దాం. వాడికి నాలుకా ముక్కూ చెవీ నాడీ చూపకండా అసలు దేహాన్ని పరీక్షించమంటే ఏం చేస్తాడు? ఇవన్నీ చూచిన తర్వాతే దేహాన్ని చూస్తాడు. చూడకపోయినా తెలుసుకుంటాడు. ఈ తెలుసుకోవటమే abstraction. అసలు దేహమనేది ఎక్కడా లేదుగా నాడీ నాలుకా బయట: ఉంటే అది నైరూప్యమే.

'Like a poet hidden in the light of thought' అన్నాడు Shelley. అలా దాక్కోలేనివాడు కవిగాడు.

Symbolism కవిత్వంలో ప్రవేశపెట్టటంవల్ల expression కి చాలా సౌలభ్యం ఉంది. Still life Paintings చూడండి. కదిలేవాటికంటే కదలనివే ఎక్కువ ప్రాణాన్ని సూచిస్తయ్ వాటిల్లో. కదలవు కనుకనే కదిలితే ఎట్లా ఉంటుందోనన్న ఆలోచన మెదుల్తుంది మనలో. చచ్చిపడిన కప్ప, నెత్తురు డగులకత్తి, కాల్చిన సిగరెట్, ఒల్చిన కమలాకాయా, జామ్ రాసిన రొట్టీ, విరిగిన పళ్లెం, మూడు కాళ్ల కుర్చీ, మరకల టేబిల్ క్లాత్, వాజ్‌లో నిన్నటి వాడిన పూలూ, సగం నిండిన మంచినీళ్ల గాజు కూజా- ఇలా ఊహించుకుంటూ పొండి, ఇవన్నీ ప్రతీకలు కావూ? ఇవన్నీ ఒక నిండు జీవితాన్ని దానిలోని అసమగ్రతని సమగ్రంగా సూచించవూ?

నైరూప్యవాదంలో రూపకాలంకారం, అవిభాజ్యమైన identity కుదరవు. కాకపోతే ఒకదాన్ని మరోదానితో పోల్చవచ్చు. అలా పోల్చటానికి ఏ వస్తువునైతే ఆధారంగా తీసుకుంటామో దాన్ని Poem ఆఖరికి త్యజించవచ్చు. త్యజించినంత మాత్రాన రూపకం (Metaphor) అవదు. వీలయితే Wallace Stevens అమెరికన్ కవి రాసిన 'Anecdote of a jar' అనే పద్యం చదవండి. 'An anthology of American Literature' EPH వాళ్ల పుస్తకంలో వుంది.

Robert Frost ఒక 'The Dust of Snow' అనే పద్యంలో అంటాడు. ఇదీ ఆ పద్యం

The way a crow
Shook down on me
The dust of Snow
From a hemloc tree

Has given my heart
A change of mood
And saved some part
of a day I had rued.

ఒక విషవృక్షంమీద ఉన్న మంచుకంటుకున్న దుమ్ముని కాకి నామీద రాల్చింది గానీ ఆరాల్చటం నా పశ్చాత్తప్త దినాన్నొక దాన్ని మార్చి నన్నానందింప జేసింది— అని. ఇందులోని ప్రతీక మంచుకంటుకున్న దుమ్ము ఒక్కటే. ఇక పశ్చాత్తాపం, పాపం దుఃఖం, తదుపరి ఆనందం ఇవన్నీ ఏమిటో ఎందుకో తెలీవు. తెలీకపోవటం వల్లనే యీ ఎనిమిది పంక్తుల పద్యానికీ ఎనిమిది భాష్యాలైనా చెప్పవచ్చును. తెలుగులో చెప్పాలంటే దుమ్ముకి అంటుకున్న మంచో మంచు కంటుకున్న దుమ్మో అనాలిగాని మంచే దుమ్ము అనకూడదు. మంచు మంచి, దుమ్ము దుర్మార్గం. కాకి రెట్టలా పైనుంచి రాలింది, చెట్టు ఆకుమీంచి దుమ్ముతో కూడింది మంచు. ఎంత abstraction ఉందీ యీ చిన్న పద్యంలో.

Abstract poetry కి కవి మానసిక అనుభూతులకీ ఏమిటి సంబంధం అని. కవిత్వమే abstraction. అలా అని ప్రేలాపన అంతా కవిత్వం అనలేం. ఆలాపనే కవిత్వం.

ప్రతీ మాటకీ కూడ ఒక Preordained energy ఉంటుంది. ఏదో చెప్పాలనుకోవటానికీ చెప్పుతున్నప్పటికీ ఉన్న మధ్య కాలంలో యీ శక్తి పుట్టుంది. ఈ శక్తిని వస్తువుగ మార్చుకుని image లాగా, Symbol లాగా వాడుకుంటాం మన భావాన్ని ఎరుక పరచేందుకు. Pure Poetry లోనే abstraction కి స్థానంఉంటుంది. ఆకలిగురించో, అన్యాయంగురించో రాస్తున్నప్పుడు concrete గానే చెప్పాలి. ఒక్క శ్రీశ్రీమాత్రమే అనగలడు 'కాంతిలేని గాజుకళ్లు. తనకన్నా శవంనయం' అని. ఇందులోచూడండి. గాజుకళ్లు నిజమా, అసలుకళ్లు నిజమా? ఆ ముసల్ది నిజమా? శవం నిజమా? ఆ భిక్షువర్షీయసిని photo తీసి photo ని చూచి paint చేసినట్లు— ఆగాజుకళ్లు, ముసిరే ఈగలు!

Symbolic గ represent చేయటం ఎలా. Symbolic గ feel అవటమే. సముద్రం ఉన్నదనుకోండి. అది అంతులేని విశ్రాంతికీ గుర్తు. ఒడ్డునైతే నిరంతర శ్రమకీ గుర్తు. Liberty కీ గుర్తు. ఇట్లా ఏదైనా ఒక వస్తువుని చూచినప్పుడు వస్తుగుణాన్నికూడచూస్తే మన భావాలకీ భావాల గుణాలకీ వాటి ప్రకృతికీ సరిపోతే, మన భావాలనే మళ్లా evoke చెయ్యగలిగితే అది సరైన ప్రతీకఅని అర్థం. వస్తువు ద్వారా విషయనిరూపణ చెయ్యటమే Symbolism. దీన్నే శ్రీపతిగారు సాంకేతిక ధ్వనివాదం అన్నారు. ఇంతకుముందుదాకా నన్ను ఇతరులు ఛాయావాదం, మార్మికవాదంఅన్నారు. నోరులేనివాణ్ణవటంవల్ల ఊరుకున్నాను. ఛాయావాదం అన్నమాట మంచిదే కొంత

వరకు. హిందీలో దీన్ని ఎలా అర్థంచెపుతారోగానీ, నాఉద్దేశ్యంలో అయితే ప్రతిమను చూపకుండా ప్రతిమయొక్క ఛాయను చూపటం, అంచేత final గ altimateగ ప్రతిమనుచూపటమే అవుతుందనీ. అయితే ఛాయకి ఎండగానీ వెన్నెలగానీ తప్పకఉండాలి. ఎండలేని పగలూ వెలుగూ, వెన్నెలలేని రాత్రి, చీకటీ మాత్రమే ఉన్నపుడు కవి అర్థంకాడు. Symbol వెలుగ్లోనూ చీకటిలోనూ కన్పిస్తుంది. కారణం Symbol ప్రతిమే గాని ఛాయకాదు. Symbol భావంతోనిండిన రూపం. అంచేత నైరూప్యానికి కూడ పనికొస్తుంది....."

సృజన పదవ సంచిక చూశాను ... ఆ సంచికలో జనధర్మ పత్రికను సమీక్షిస్తూ నా కవిత్వంపట్ల "పాఠకుడు" వెలబుచ్చిన అభిప్రాయాలతో నేనేకీభవిస్తున్నాను. ముఖ్యంగా 'ఎదురుతిరిగి' అనే శీర్షికకు చేసిన వ్యాఖ్యానం (జనధర్మలో) అన్యాయంగావుంది.... ....
(21–3–'69)

....ఎక్కడపడితే అక్కడ విమర్శకులు, సమీక్షకులు నేనేదో రూపాన్ని పట్టుకొని వ్రేలాడుతున్నట్లు రాస్తారు. మరి యిది తెలియక రాస్తారో, లేదా కావాలనే రాస్తారో, ఆధునిక కవిత్వంలో సామాజిక చైతన్యభావప్రేరితమైన ప్రగతివాద లక్షణానికి నేను ప్రథమస్థానం యిస్తాను. ఈ వస్తువూ, నేననే రూపమూ యీరెండూ అవిభాజ్యములుకావు. ఆ ప్రగతిభావన యీరూపంలో అవతరించిందనే నా అభిప్రాయం, అంతేకాని యీరూపాన్ని పట్టుకుని, దీనితోకనుపట్టుకుని సాహిత్యగోదావరి ఈదాలని నావాదంకాదు....
(5 ఏప్రిల్ '69)

—కుందుర్తి

హైదరాబాదు

కథల పోటీ

(కళాశాల విద్యార్థులకు మాత్రమే)

'69 నవంబర్‌లో సృజన నాల్గవ జన్మదిన సంచిక కథలసంచికగా వెలువడు తున్న సందర్భంలో ప్రత్యేకించి విద్యార్థుల ప్రతిభనూ, ప్రయోగశీలత్వాన్నీ గుర్తించి ప్రోత్సహించాలనే సంకల్పంతో ఆంధ్రప్రదేశ్ లోని అన్ని కళాశాలలవిద్యార్థులకొరకు (తెలుగులో కథ రాయగల ఉతర ప్రాంతాల కళాశాల విద్యార్థుల కొరకుకూడ) కథల పోటీని సృజన నిర్వహిస్తున్నది.

1. రచన ఎంత చిన్నదయినా, పెద్దదయినా కావచ్చు. శుభ్రంగా కాగితానికి ఒకవైపే రాయాలి.
2. రచనలో కొత్తదనమూ, మౌలికతా, జీవమూ ఉండాలి కథలుగనక, ముఖ్యంగా వాస్తవికతా చిత్రణ, అనుభవసారం, ప్రగతిశీలదృక్పథమూ ఉండాలని సృజన ఆశిస్తుంది.
3. రచయిత పేరు(ఉంటే కలంపేరు), తరగతి, కళాశాల పూర్తి వివరాలు వేరేకాగితం మీదరాస్తూ రచన తన స్వంతమని ధృవపత్రంరాయాలి
4. ఆ రచన ఆ కళాశాలకుచెందిన ఆ విద్యార్థిదేనని, అది అతనిస్వంతమని ధృవపత్రమొకటి కళాశాల ప్రిన్సిపల్‌గారినుండి పొంది జతపరచిపంపాలి.
5. ప్రతిఒక్క రచయిత ఎన్ని రచనలయిననూ పంపవచ్చును.
6. ప్రతిఒక్క రచనకూ ఎంట్రీఫీజు ఒక రూపాయి. వేరుగా మనియార్డరుద్వారా పంపించాలి.
7. అన్నింటిలో ఉత్తమంగా నిర్ణయించబడ్డ ఒకేఒక్క కథకు 50 రూపాయల కనీస బహుమతి లభిస్తుంది. అంటే ఎంట్రీఫీజు రూపంలో ఎంత డబ్బు వచ్చినా ఆ మొత్తం బహుమతిగానే యివ్వబడుతుంది.
8. అట్టికథ కథలసంచికలో ప్రచురింపబడుతుంది.
9. బహుమతిపొందనివానిలోకూడ యోగ్యమనిపించిన కథలను ప్రచురించుకునే హక్కు మాకుంటుంది.
10. తగినన్ని స్టాంపులు జతపరిస్తేతప్ప రచనలు తిప్పిపంపబడవు.
11. అన్ని విషయాల్లోనూ తుదినిర్ణయం 'సృజన'దే.
12. రచనలు సెప్టెంబర్ 30 వ తేదీలోగా యీకింది చిరునామాకు చేరాలి.

ఈ పోటీ నిర్వహణలో ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని కళాశాలల అధినేతలూ, విద్యార్థులూ మాకు సహకరిస్తారని ఆశిస్తున్నాము.

సంపాదకుడు
సృజన.

కథలు చేరవలసిన చిరునామా.

నవీన్, యాక్టింగ్ ఎడిటర్, సృజన
6–3–117, రామగిరి, నలగొండ.

సృ జ న

కథల సంచిక

నాలుగవ జన్మదినానికి సృజన–13, కథల సంచికగా నవంబర్‌లో వెలువడుతుంది.

యేకారణంవల్లనోగాని పాఠకుల్లో, రచయితల్లో, ముఖ్యంగా సమీక్షకుల్లో సృజన కవిత్వపు పత్రిక అనే వొక భావంవుంది. నిజానికి తెలుగుదేశంలోని కథకులు సృజనను ఆధునిక కథావేదికగాకూడ పటిష్ఠంకావడానికి తగినంతగా వుపయోగించుకోవడంలేదు తప్ప సృజనకు కథలంటే చిన్నచూపేమీలేదు.

ఆధునిక శిల్పమూ, ప్రయోగశీలత్వమూ, ప్రగతి దృక్పథమూగల కథలు రచయితలనుంచి ఆహ్వానిస్తున్నాము. నవంబర్ సంచిక పూర్తిగా కథలసంచికగా రూపొందించదలుచుకున్నాము. ప్రపంచ సాహిత్యంలోనే ప్రముఖ స్థానాన్ని అలంకరించిన తెలుగుకథ, మళ్ళా వొకసారి తన సేవ చూపుకోవడానికి కథకులందరూ మాతో సహకరిస్తారని ఆశిస్తున్నాము.

కథలసంచికకు సంపాదకుడుగా నవీన్ వ్యవహరిస్తాడు. కాబట్టి కథలు నేరుగా యీ కింది చిరునామాకు సెప్టెంబర్ 30 వ తేదీవరకల్లా అందేట్లుగా పంపించవలసిందిగా కోరుతున్నాము.

నవీన్, యాక్టింగ్ ఎడిటర్, సృజన
6–3–117, రామగిరి, నలగొండ.

శ్రీ శ్రీ సాహిత్య సమాలోచన

సంచికగా సృజన–14 వెలువడుతుంది.

రచయితలు కవిగా, యుగకర్తగా, కథకునిగా, రేడియో నాటికాకర్తగా, అనువాదకునిగా, విమర్శకునిగా, విప్లవపథ నిర్దేశకునిగా, వ్యక్తిగా శ్రీ శ్రీ సమగ్ర పరిశీలనచేస్తూ రాసిన వ్యాసాలు మాకు నవంబర్ 15 వరకు అందేట్లు పంపించవలసిందిగా కోరుతున్నాము.

సంపాదకుడు
సృ జ న

Printed, Published & Edited by Varavara rao for 'Sahitheemithrulu'